
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
31.03.2026 మంగళవారం | సంపుటి : 12 సంచిక : 251 | పేజీలు : 12 వెల : రూ. 4/-
తెలంగాణ | Simultaneously Published from Karimnagar & Hyderabad. | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698





దేశం నుండి నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయిందని, ఏప్రిల్ 1 నుండి భారత్ నక్సల్ రహిత దేశంగా మారుతుంద ని హోంమంత్రి అమిత్ షా సోమవారం లోక్‌సభలో ప్రకటించారు. బస్తర్ ప్రాంతం ఇప్పుడు తుపాకుల మోత నుండి స్కూలు గంటల వైపు మళ్లిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హయాంపై ఆయన విమర్శలు గుప్పించారు. 1970వ దశకంలో ఇందిరా గాంధీ తన రాజకీ య ప్రయోజనాల కోసం వామపక్ష భావజాలాన్ని ప్రోత్సహిం చారని, దానివల్లే దేశంలో 12 రాష్ట్రాలకు నక్సలిజం పాకి 12 కోట్ల మంది ప్రజలు ప్రభావితమయ్యారని ఆరోపించారు.

# మావోయిస్టుల రహిత దేశం



## రాహుల్ గాంధీ మావోయిస్టులకు మద్దతు తెలిపాడు

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపణలు
- చర్చల ద్వారా సమస్యల పరిష్కారమవుతాయని హితవు
- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు..?
- ఎవరైనా ఆయుధాలు పడితే అంతు చూస్తాం: అమిత్ షా

**న్యూఢిల్లీ, మార్చి30 (జనంసాక్షి) :**

ప్రాణాలకు తెగించి పోరాడిన సీఏపీఎఫ్ జవాన్లు, రాష్ట్ర పోలీసులు, సహకరించిన ఆదివాసీ బిడ్డల వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన కొనియాడారు. చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు. పార్ల మెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతా లు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటు న్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజం లో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

### తెలంగాణకు చెందిన అజ్ఞాత కేడర్ వీరే...



- ముప్పాళ్ల లక్ష్మణరావు @ గణపతి, సిసిఎమ్, పీబీఎం
- పుసునూరి నరహరి @ సంతోష్ సిసిఎమ్, పీబీఎం, సీసీఎం, ఈఆర్బీ సభ్యుడు
- జోడే రత్న బాయి @ సుజాత డీకే ఎసిడ్సి మెంబరు, మాడ్ డీవీసీ ఇన్చార్జ్
- నక్క సుశీల @ రేలా, డీసీఎం స్థాయి, డీకేఎస్ జెడ్సీ
- రంగబోయిన భాగ్య @ రూపి ఏసీఎం స్థాయి, డీకేఎస్జెడ్సీ మాడ్‌లో డీవీసీఎం
- వర్త శేఖర్ @ మంగు, డీకేఎస్జెడిసిఎం, కమ్యూనికేషన్ వింగ్ ఇన్చార్జ్

## అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేతలు

# తెలంగాణకు వచ్చేయండి

- ప్రజాస్వామ్య స్రవంతిలో చేరి సురక్షిత జీవితాన్ని గడపండి
- అన్ని సహాయ సహకారాలకు తెలంగాణ పోలీసులు కట్టుబడి ఉన్నారు
- రాష్ట్ర అభివృద్ధి, శాంతిలో భాగస్వాములు కావాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు



**హైదరాబాద్ మార్చి 30 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు కీలక విజ్ఞప్తి చేశారు. హింసా మార్గాన్ని విడిచిపెట్టి, జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన కోరారు. గత రెండేళ్ల కాలంలో సుమారు 721 మంది మావోయిస్టు కేడర్ పోలీసుల ముందు లొంగిపోయారని, వారందరికీ ప్రభుత్వ పునరావాస పథకం కింద రావలసిన అన్ని ప్రయోజనాలను అందించి, వారు గౌరవప్రదమైన జీవితం గడిపేలా చర్యలు తీసుకున్నామని డీజీపీ వివరించారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస విధానంపై ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న కేడర్‌లో కూడా నమ్మకం పెరుగుతోందని, అందుకే లొంగిబాట పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాల్లో అజ్ఞాతంగా పనిచేస్తున్న తెలంగాణకు చెందిన ముఖ్య నాయకుల పేర్లను డీజీపీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. జగిత్యాల జిల్లాకు మిగితా 2లో



## 'సన్నబియ్యం' విందు.. భలే పసందు

### ఆరగించిన సీఎం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కితాబు

**హైదరాబాద్ (జనంసాక్షి)** రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా అసెంబ్లీ ఆవరణలోని డైనింగ్ హాలులో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీలకు సన్నబియ్యంతో ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు. రేషన్ షాపుల ద్వారా సామాన్యులకు అందుతున్న బియ్యంతో వండిన పదార్థాలను వడ్డించారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని, మంత్రులు, అధికార, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సన్నబియ్యం భోజనం చేశారు. సన్నబియ్యం విందు భలే బాగుందంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కితాబిచ్చారు. పేదలకు అందుతున్న బియ్యం నాణ్యత ఏ విధంగా ఉందో ఈ సందర్భంగా ఆయన స్వయంగా పరిశీలించారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు.

# ఆహార కల్తీ నియంత్రణకు హైడ్రాలాంటి వ్యవస్థ

## నిత్యావసర నిల్వవుంచారో జాగ్రత్త..

- ఇది హత్యానేరం కంటే ప్రమాదం : సీఎం రేవంత్ సీరియస్
- 50శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- కేసీఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :**

ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య మిగితా 2లో



## సెలక్ట్ కమిటీకి విద్వేష ప్రసంగాల బిల్లు

- ఇక విద్వేషపూరిత ప్రసంగాలకు అడ్డుకట్ట
- నాన్‌బెయిలబుల్ కేసు.. ఏడేళ్ల వరకు జైలు శిక్ష
- తీవ్రంగా వ్యతిరేకించిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు

2

## యుద్ధం ఆపడానికి కేంద్రం చొరవ తీసుకోవాలి

- అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- తీర్మాణాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన సభ

### కాళేశ్వరం మీద లక్ష కోట్లు
## ప్రజాధనం వృథా

ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే ఈ దుస్థితి
రాజ్యసభలో కేంద్రమంత్రి పాటిల్ వ్యాఖ్యలు 11

## బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా



బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా 2

## దేశంలో ఆర్థిక భూకంపం



- ఇంధనం కొనాలంటే ట్రంప్ అనుమతి కావాలి
- ఇంతకంటే సిగ్గుచేటు మరొకటుందా..?
- దేశంలో ఇంధన కొరతపై ప్రతిపక్ష నేత రాహుల్ ఫైర్

2

### ట్రంప్ మేకపోతు గాంభీర్యం
# హర్మూజ్‌ను తెరవకపోయారో జాగ్రత్త

## ఇరాన్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తాం

- త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి
- ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరికలు

### పాక్ మధ్యవర్తిత్వం మాకొద్దు

నో చెప్పిన ఇరాన్

### అమెరికాకు స్పెయిన్ షాక్

గగనతలంలో విమానాలకు అనుమతి నిరాకరణ 2

**వాషింగ్టన్, (జనంసాక్షి) :**

ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో మిగితా 2లో



### కాగ్ కీలక నివేదిక
## ప్రభుత్వ రంగ సంస్థలు, కార్యాకలాపాలపై రిపోర్ట్

- సింగరేణికి సంబంధించిన పలు సూచనలు
- 9 సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్లు వెల్లడి



2

### పెద్దల సభలోనూ
# బీఆర్ఎస్ నిరసన

## శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

- రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన
- శాసనమండలిలో సభ్యుల సస్పెన్షన్ తొలిసారి

11





# రూపాయి ఢమాల్

- చరిత్రలోనే అత్యంత దిగువ స్థాయికి రూపాయి
- పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతలు, ఆయిల్ ధరల పెరుగుదలతో భారీ పతనం
- ఒక్క నెలలోనే 4.4 శాతం క్షీణత - రికార్డు స్థాయి దిగజారుదల
- స్టాక్ మార్కెట్ కూడా భారీ నష్టాల్లో - నిఫ్టీ 488 పాయింట్లు పడిపోయింది

## 95.45 స్థాయికి పడిపోయిన రూపాయి

*భారత రూపాయి చరిత్రలోనే అత్యంత దారుణమైన పతనాన్ని సోమవారం నమోదు చేసింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రాడేలో 95.22 స్థాయిని తాకి, 95.45 వద్ద క్లోజ్ అయి కొత్త ఆల్-టైమ్ లోను సృష్టించింది. పశ్చిమాసియాలో (యూఎస్-ఇరాన్) యుద్ధ ఉద్రిక్తతలు తీవ్రమవడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 115 డాలర్ల వరకు పెరగడం, భారత చమురు దిగుమతి బిల్లు ఉబికిపోవడం, విదేశీ సంస్థాపనల పెట్టుబడులు భారీగా ఉపసంహరణ, ఎగుమతులు బలహీనపడటం వంటి కారణాలు రూపాయి పతనాన్ని వేగవంతం చేశాయి. ఈ మార్చి నెలలోనే రూపాయి దాదాపు 4.4 శాతం క్షీణించింది.*

9

### రూపాయి మారకం విలువ

| సంవత్సరం | రూపాయిల్లో |
|---|---|
| 1947 | ₹3.30 |
| 1966 | ₹7.50 |
| 1991 | ₹22.70 |
| 1998 | ₹41 |
| 2004 | ₹45.32 |
| 2014 | ₹60 |
| 2025 | ₹91.14 |
| 2026 మార్చి 30 | ₹95.45 |

# ఆర్టీసీ స్థలాల్లో ఆర్టీసీ బస్సులే ఉండాలి

## ఈవీ బస్సులను వెళ్లగొట్టాలి

- నల్లగొండలో ఆర్టీసీ కార్మికుల అర్థనగ్న ప్రదర్శన



**నల్లగొండ, మార్చి30 (జనంసాక్షి) :** టీజీఎస్ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ డిపో జేఏసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యుత్ బస్సుల విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ కార్మికులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గో బ్యాక్ గోబ్యాక్ ఈవీ బస్సులు గో బ్యాక్.. ఆర్టీసీ స్థలాల్లో- ఆర్టీసీ బస్సులే ఉండాలి.. ఆర్టీసీ బస్సులే ఉండాలి- ఆర్టీసీ సిబ్బందే నడపాలి.. ఆర్టీసీ స్థలాల నుండి- ప్రైవేట్ ఈవీ బస్సులు వెళ్లగొట్టాలే అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వమే ఈవీ బస్సులని కొనుగోలు చేసి ఆర్టీసీలకు ఇవ్వాలని, ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నడపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేట్ ఈవీ బస్సులను తీసుకుని, పూర్తిగా ప్రైవేట్ వారికి అప్పగించి, కొత్త నియామకాలు చేపట్టకుండా పూర్తిగా సంస్థను నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను, మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల పట్ల రాష్ట్ర జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిందని, ఇక ముందు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని పోరాటాల్లో పాల్గొని విజయవంతం చేసి అన్నింటిని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు బి.నరేందర్, బాసాని వెంకటయ్య, జిల్లా జేఏసీ నాయకులు ఎన్ఆర్సీ రాజు, టీజే రావు, డిపో జేఏసీ నాయకులు ఏఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

## వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి

- గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ



**హైదరాబాద్, మార్చి30 (జనంసాక్షి) :** జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాల ని డిమాండ్ చేశారు. తెలం గాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.

# ఇద్దరు పిల్లలు దొరికారు..





**వరంగల్ ఈస్ట్, మార్చి 30 (జనంసాక్షి) :** వరంగల్ నగరంలోని కరీమాబాద్ కు చెందిన ఇద్దరు పిల్లలు ఇంట్లో నుంచి వెళ్లిపోగా వారు సోమవారం దొరికినట్లు సమాచారం. ఈనెల 27న సాయంత్రం కరీమాబాదుకు చెందిన కందగట్ల యజ్ఞశ్రీ (12), మణికంఠ (10) ఇద్దరు పిల్లలు ఇంట్లో ఎవరికి చెప్పకుండా సాయంత్రం వెళ్ళిపోయారు. ఈ విషయమై మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వివిధ బృందాలుగా విడిపోయి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన పిల్లల ఆచూకీ కోసం అహర్నిశలు కృషి చేశారు. అంతేకాకుండా స్థానిక కాంగ్రెస్ నాయకు డు అత్తర్ కరీమాబాద్ రామ్ లక్ష్మణ్ దగ్గర సీసీ కెమెరా ఫుటేజీని తీసుకోవడం పిల్లలు ఇద్దరు వెళ్తున్న దృశ్యం కనిపించింది. ఇది మరింత ఆధారంగా లభించింది. ఈ క్రమంలో సోమవారం అనంతపురం జిల్లా ధర్మవరం ప్రాంతంలో ఈ ఇద్దరు పిల్లలు ఓ ముస్లిం మహిళ ఇంటికి వెళ్లి తమకు ఆకలవుతుందని అడగడంతో ఆ మహిళ వీరి పూర్తి వివరాలు తెలుసుకొని అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి పోలీసులు ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వచ్చిన ఇద్దరు పిల్లల గురించి స్థానిక మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు అనంతపురం జిల్లా ధర్మవరం పోలీసుల వద్ద క్షేమంగా ఉన్నట్లు యజ్ఞశ్రీ కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే బాలుడు మణికంఠది అనంతపురం జిల్లా అని తెలిసింది. ఏది ఏమైనా పిల్లలు దొరకడంతో ఆయా కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. దొరికిన ఇద్దరు పిల్లలను పోలీసులు వరంగల్ కు తీసుకొస్తున్నట్లు సమాచారం.

# వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్‌ను సవరించాలి

## తెలంగాణ రైతు సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో జూలకంటి రంగారెడ్డి, టి సాగర్, సారంపల్లి మల్లారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్‌ను సవరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పి.జంగారెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన తెలంగాణ రైతు సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలోవారు మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారని, గత సంవత్సరం 24,439 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం 1250 కోట్లు తగ్గించారని, గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం "క్యూర్, ప్యూర్, రేర్" లక్ష్యాలుగా ప్రకటించి రేర్‌లో వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపుల ద్వారా వ్యవసాయోత్పత్తులు 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగినట్లు ప్రకటించారని, వ్యవసాయరంగం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1.11 లక్షల కోట్లు కాంట్రిబ్యూట్ చేస్తున్నట్లు చెప్పారని, రైతు భరోసా, యాంత్రీకరణ, పంటల బీమా, పంటల బోనస్ కు నిధులు పెంచినప్పటికీ మొత్తం బడ్జెట్లో వ్యవసాయ రంగానికి కేవలం 7.15% మాత్రమే కేటాయించారని అన్నారు. భూ భారతి అమల్లో రెవెన్యూ కోర్టుల పునరుద్ధరణ, 11 అంశాల పహాణి పత్రికలో వాస్తవ సాగుదార్లు (కౌలు దార్లు) పేరు నమోదు, పంటల బోనస్, మ్యానిఫెస్టోలో ప్రకటించిన పంటల కనీస మద్ధతు ధరల నిర్ణయంకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు లేవని, వ్యవసాయ ప్రణాళిక ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల పెంపుదల వల్ల రాష్ట్ర అవసరాల మేరకు ఉత్పత్తి చేయడానికి తగిన ప్రణాళిక లేదని, హార్టికల్చర్ శాఖ 2 దశాబ్దాలుగా 12 లక్షల ఎకరాలు మాత్రమే సాగు చేస్తున్నారని, రాష్ట్రంలో 4లక్షల ఎకరాలకు తగ్గిందని, వ్యవసాయ దిగుమతుల ద్వారా రైతులు నష్టపోతున్నారని, పత్తి, వరి పంటలను మాత్రమే మద్ధతు ధరల ఆధారంగా సాగు చేస్తున్నారని, ఆ రైతులకు కూడా కనీస మద్ధతు ధరలు అమలుకావడం లేదని, ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయరంగం కౌలు రైతులకు రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాల పరిహారం, మార్కెట్ జోక్యం పథకం కింద నిధుల కేటాయింపు లేదని, పాల ఉత్పత్తి దార్లకు లీటరుకు రూ.5 ప్రోత్సాహకం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించి బడ్జెట్ నిధులు కేటాయించలేదు. అందుకు అనుగుణంగా బడ్జెట్‌ను సవరించాలని, కనీసం బడ్జెట్‌లో 20శాతం నిధులు వ్యవసాయ రంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జాతీయ కార్యదర్శి భాస్కర్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, గిరిజన సంఘము రాష్ట్ర కార్యదర్శి ఆర్ శ్రీ రామ్ నాయక్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, రైతు కూలీ సంఘం నాయకులు విజయ్ లో మాట్లాడుతూ... వ్యవసాయంగా బడ్జెట్ ను సవరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 31 నుండి జరిగే ఆందోళనలో భాగస్వాములమవుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహా, రైతు సంఘం నాయకులు శివ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పల బాధతో కౌలురైతు ఆత్మహత్య

**నారాయణపేట, మార్చి30 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లా కృష్ణఖన మండలం గుడేబడ్లూరులో విషాదం నెలకొంది. అప్పుల బాధతో కృష్ణా నదిలో దూకి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. గుడేబడ్లూరు టై రోడ్డు చెక్‌పోస్టు వద్ద నివాసం ఉండే నాగరాజు (55) కృష్ణా పరివాహక ప్రాంతంలో భూమి కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. రెండేళ్లుగా ఆశించినంతగా వరి పంట దిగుబడి రాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలో నిరాశకు లోనైన నాగరాజు.. ఈ సీజన్‌లో పంట వేయలేదు. సాగు కోసం చేసిన అప్పుల తీర్చేందుకు, పొట్ట కూటి కోసం హైదరాబాద్ వచ్చాడు. హైదరాబాద్‌లో చిన్నా చితకా పనిచేస్తున్న నాగరాజు.. రెండు రోజుల క్రితం భార్యాపిల్లలను చూసేందుకు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు కృష్ణ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పుల బాధ భరించలేకనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని నాగరాజు భార్య పోలీసులకు తెలిపింది. కౌలు రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని స్థానికులు డిమాండ్ చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అక్రమ అరెస్టులు సరికాదు

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అనంతుల మధు




**సూర్యాపేట (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్టు సరికాదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో-ఆర్డినేటర్ అనంతుల మధు అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ కోరుతూ తెలంగాణ ఉద్యమ సంఘాలు అసెంబ్లీ ముట్టడి పిలుపు ఇచ్చిన సందర్భంగా నాటి తెలంగాణ విద్యార్థి నాయకులు తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కో -ఆర్డినేటర్ అనంతుల మధు, నాయకులు భాషిపంగు సునీల్, ఏనిగా సంతోష్ రెడ్డి, భూక్యా నాగు నాయక్‌లను చివ్వేంల ఎస్ఐ మహేష్ ముందస్తు అక్రమ అరెస్ట్ చేసి, చివ్వేంల పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా అనంతుల మధు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ డిమాండ్ చేసారు. ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్న నేటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలుచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తెలంగాణ ఉద్యమకారులు అసెంబ్లీ ముట్టడి కి పిలుపు నిస్తే, హామీలను అమలు చేసే ప్రక్రియ పై నోరు మెదపని రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఉద్యమకారులను ముందస్తు అక్రమ అరెస్ట్ లు చేయడం సరికాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ, తక్షణమే చట్ట పరమైన సబ్ కమిటీ వేసి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేసారు.

# మహిళలు సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలి

## స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) జాతీయ ఉపాధ్యక్షురాలు,ఉపాధ్యాయ నేత మోతుకూరి సంయుక్త



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళలు సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) జాతీయ ఉపాధ్యక్షురాలు,ఉపాధ్యాయ నేత మోతుకూరి సంయుక్త అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా చైతన్య సదస్సు టాప్ర రాష్ట్ర కార్యాలయం ముషీరాబాద్ లో జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మోతుకూరి సంయుక్త మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళల సమస్యల పరిష్కారం కొరకు కలిసికట్టుగా కృషి చేయాలని, ఆకాశంలో సగం అన్నట్లు మొత్తం జనాభాలో సగం మంది మహిళలు న్నారని, ఈ రోజు దాదాపు అన్ని రంగాల్లో మహిళలు పని చేస్తున్నారనీ, ఉద్యోగ విరమణ చేసియున్న పెన్షనర్లలో కూడా సగం మంది కాకపోయినా చాలా మంది మహిళలు ఉన్నారని, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో జరిగే పోరాటాలలో కూడా మహిళా పెన్షనర్లు పాల్గొంటే తప్ప పరిష్కారం కావని అన్నారు. చైతన్యవంతమైన మహిళలు ఇంటిపనిలో పురుషులకు కూడా బాధ్యత అప్పగించి పోరాటాలలోనికి మహిళలు రావాలన్నారు. మహిళలు రాకుండా ఏ పోరాటం జయప్రదం కాదని అన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన రాజకుమారి మాట్లాడుతూ మన టాప్ర పెన్షనర్ల సంఘంలో మహిళలది ప్రత్యేక విభాగం ఉందనీ, చాలా జిల్లాల్లో కూడా టాప్ర యునిట్ల కు మహిళా విభాగాలు న్నాయని వాటి సమావేశాల్లో పాల్గొని సమస్యల పరిష్కారం కొరకు పనిచేస్తున్నారన్నారు. ఈ సమావేశానికి టాప్ర రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నారాయణ రెడ్డి, పి కృష్ణమూర్తి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం అర్జున్, కోశాధికారి రమేష్ లతో పాటు కొండల్ రావు, రాజన్ బాబు, వెంకటేశం, నర్సింహా రెడ్డి, శేక్ హుస్సేన్, ఎంఏ అజీజ్, విజయలక్ష్మి, శ్రీ వాణి, విజయమ్మ, బి పద్మజ, రత్నమాంబ తదితరులు హాజరైనారు.

# అత్తాపూర్‌లో వికలాంగురాలిపై లైంగికదాడి

- 48 గంటల్లో నిందితుడు అరెస్ట్



**రాజేంద్రనగర్, మార్చి30(జనంసాక్షి) :** హైదరాబాద్ అత్తాపూర్ హసన్ నగర్‌లో వికలాంగురాలుపై లైంగిక దాడి చేసిన నిందితుడు మహమ్మద్ అఖీల్ (35)ను పోలీసులు 48 గంటల్లో అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం 28న హసన్ నగర్‌కు చెందిన బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో, ఆమె బంధువైన నిందితుడు ఇంట్లోకి ప్రవేశించి బలవంతంగా దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకోగానే ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలు సంజ్ఞల ద్వారా జరిగిన విషయాన్ని తెలియజేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, వేగంగా విచారణ చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. ఈ కేసు పలు సెక్షన్ల కింద నమోదు కాగా, రాజేంద్రనగర్ పోలీసుల పర్యవేక్షణలో నిందుతున్ని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. చాకచక్యంగా నిందితుడిని అరెస్ట్ చేసిన అత్తాపూర్ పోలీస్ బృందాన్ని అధికారులు అభినందించి రివార్డులు అందజేశారు.

## ఆటో బోల్తా.. తల్లీ కుమారుడు మృతి

**కామారెడ్డి, మార్చి30 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల శివారులో ఘోర ప్రమాదం జరిగింది. ఆటో బోల్తాపడిన ఘటనలో తల్లీకుమారుడు మృతి చెందగా.. 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓ వేడుకకు వెళుతుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

# పెన్షనర్ల బకాయిల చెల్లింపుల విషయంపై స్పందనేదీ?

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెన్షనర్ల బకాయిల చెల్లింపుల విషయంపై అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఎటువంటి ప్రకటనా చేయకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు ఆగ్రహంతో ఉన్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మార్చి 2024 నుండి పదవి విరమణ పొందడం ప్రారంభమైందని, నాటినుండి నేటి వరకు రెండు సంవత్సరాలు అయినా కూడా, డిఏ ఏరియర్స్, గ్రాట్యూటీ, కముటేషన్, టీజీఎల్ఐసి, జిపిఎఫ్,లీవెన్ క్యాష్మెంట్ లాంటి బకాయిలు ఇంతవరకు చెల్లించ లేదని, రాజకీయ పలుకుబడి ఉన్నవారికి, లేదా కోర్టుకు వెళ్లి కాంటెంప్ట్ కేసు వేసిన వారికి బకాయిలు చెల్లించారని, కోర్టుకు వెళ్ళని వారికి ప్రభుత్వం బకాయిలు చెల్లించదా! సుమారు 100 మంది పెన్షనర్లు బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడం వల్ల మనోవేదనకు గురై అనారోగ్యము పాలై, ఆస్పత్రుల్లో చికిత్స చేయించు కొనుటకు డబ్బులు లేక ప్రాణాలు సైతం కోల్పోయారని, అనేక రకాలుగా ఉద్యమాలు చేసి ప్రభుత్వానికి చేశారని, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులు పెన్షనర్ల ఆర్థిక దీనస్థితిని వివరిస్తూ వాయిదా తీర్మానాలు కూడా ఇచ్చిన సందర్భంలో ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదని, పదేపదే ప్రతిపక్ష నాయకులు ఎప్పటి వరకు చెల్లిస్తారో చెప్పండని కూడా కోరారని తెలిపారు. ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి వారు పదే పదే గత ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకుని మాట్లాడుతున్నారు. మీ ప్రభుత్వం కూడా వచ్చి దాదాపుగా రెండున్నర సంవత్సరాలు కావస్తోందని, ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గమనించవలిసిన విషయం గత ప్రభుత్వం ఉద్యోగులను, ఉపాధ్యాయులను, పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేస్తేనే మీ పార్టీకి వెనుదన్నుగా నిలబడి ఓటేసి గెలిపించామని, ఇప్పటికైనా మీరు పెన్షనర్లకు వెంటనే వారికి రావలసిన బకాయిలను చెల్లించవలసిందిగా ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయండి

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా సోమవారం ఒక ప్రకటన లో ప్రభూత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గల 205 మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సుమారు 8000 మంది వరకు విద్యార్థులు ప్రతి ఏటా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి బయటికి వెళ్తున్నారని, మైనారిటీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు లేనందున అనేక మంది విద్యార్థులు గత ఐదేళ్లుగా ఇంటర్ తర్వాత చదువులకు స్వస్తి పలికి, ఉపాధి చూసుకుని జీవనం సాగిస్తున్నారని, బాలికలకు వివాహాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి ఒక్కో విద్యార్థికి ఒక లక్షా, ఇరవై వేలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రంలో నేటి వరకూ ఒక్క మైనారిటీ గురుకుల డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు చేయని కారణంగా మైనారిటీ గురుకుల సంస్థ పై వెచ్చిస్తున్న నిధులు బూడిదలో పోసిన పన్నీరవుతుందని అన్నారు. యస్సీ, యస్టీ, బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా 80 కు పైగా గురుకుల డిగ్రీ కళాశాలలున్నాయని, మైనారిటీలకు మాత్రం ఒక్క కళాశాల కూడా లేదన్నారు. దీని కారణంగా మైనారిటీ గురుకులాలో ఇంటర్ వరకు చదివిన విధ్యార్ధులు ఉన్నత విధ్యలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కావునప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బాల, బాలికల కొరకు వేర్వేరుగా ప్రాతీ జిల్లాలలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు.

# 30వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ఐ



**నాగర్‌కర్నూల్, మార్చి 30 (జనంసాక్షి) :** తిమ్మాజిపేట మండల ఎస్సై ఏసీబీకి పట్టుబడ్డారు. ఒక కేసుకు సంబంధించి ఒక వ్యక్తి నుంచి రూ. 30 వేలు లంచం ఎస్సై డిమాండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఇసుక సరఫరా చేస్తున్న ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్, జేసీబీని పట్టుకొని ఈనెల 5న ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి వివరాలను నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారులకు తెలిపారు. మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు రూ. 60 వేలు ఫైన్ వేశారు. ఈ డబ్బులను ఈనెల 7వ తేదీన చెల్లించి వాహనాల రిలీజ్ కోసం పత్రాలను తెచ్చి ఎస్సైకి అందజేశాడు. అయితే ఎస్సై రూ. 30 వేలు ఇస్తేనే వాహనాలను విడుదల చేస్తామని డిమాండ్ చేశారు. మైనింగ్ ఫైన్ కట్టడంతో పాటు, మళ్లీ రూ. 30 వేలు కట్టవలసి రావడంతో వాయిస్ రికార్డింగ్‌లు, రూ. 20వేలు చెల్లించిన అంశాలతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అన్ని ఆధారాలతో ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు.

# అంబేద్కర్‌పై దాడి రాష్ట్రపతి ఉత్తర్వులు (షెడ్యూల్డ్ క్యాస్ట్) 1950

ఇటీవలకాలంలో భారతదేశంలో చారిత్రకంగా వెనుకబాటుకు గురైన అట్టడుగు వర్గాలు తమ వాటా కోసం ఉద్యమిస్తున్నారు. సంపద, భూమి, రాజ్యం, రిజర్వేషన్ హక్కులపై గళ మెత్తుతున్నారు. మరోవైపు అట్టడుగు వర్గాల రాజ్యాంగ రిజర్వేషన్లను, చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు దళితులు మతం మారితే రిజర్వేషన్లు కోల్పోతారని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తించదనే తీర్పు ఇందుకు నిదర్శనమే. దళిత క్రైస్తవులపైన, హిందూ దళితుల మీద ఇవ్వబడిన ఈ తీర్పు భారత రాజ్యాంగం మౌలిక సూత్రాలకు విరుద్ధమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని 2021 జనవరి 21న బాపట్ల జిల్లా, కొత్తపాలెం గ్రామంలో అగ్రకులం వ్యక్తుల చేతిలో దాడికి గురైన ఓ దళిత పాస్టర్ వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశాడు. మతం మారిన ఫాస్టర్ కు ఎస్సీ హోదా వర్తించదని, తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని ఏపీ హైకోర్టులో నిందితులు పిటిషన్ దాఖలు చేశారు. అప్పుడు కోర్టు క్రైస్తవ మతం మారిన వ్యక్తికి ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ చట్ట రక్షణలు వర్తించవని తీర్పించింది. ఈ తీర్పును ఆ ఫాస్టర్ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా ఇటీవల 2026, మార్చి 24న అత్యున్నత న్యాయస్థానం కూడా సమర్ధించింది. దీనికి ఆధారం అనాడు అంబేద్కర్ మతం మారకుండా తెచ్చిన 1950 రాష్ట్రపతి ఉత్తీర్వులే. ఈ తీర్పును మీడియా పండగ వాతావరణంలో ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతుంది. ఇదీ"దున్నపోతు ఈనిందంటే దూడను దొడ్ల కంటేయమన్నట్టు" ఉంది. దళితులపై అగ్రకులాలు ఎంత అక్కసును వ్యక్తం చేస్తున్నారో అర్థమవుతుంది.

**రిజర్వేషన్స్ కు రాష్ట్రపతి ఉత్తర్వులు ఆధారమా? రాజ్యాంగం ఆధారమా?**

భారతీయ హిందూమతంలోని అస్పృశ్యత అంటరానితనంపై సుదీర్ఘంగా పోరాడిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. ఆయన 1935లో మహారాష్ట్ర, నాసిక్ జిల్లా దగ్గరలో ఉన్న ఓలా మహాసభలో "నేను హిందువుగా పుట్టాను, కానీ హిందువుగా చనిపోను" అని ప్రకటించాడు. ఈ క్రమంలో అంబేద్కర్ మతం మారడాన్నీ అడ్డుకునేందుకు 1950, ఆగస్టులో రాష్ట్రపతి ఆర్డర్(షెడ్యూల్డ్ క్యాస్ట్) తీసుకువచ్చారు. ఈ ఆర్డర్, కేవలం హిందూ మతంలో ఉన్న దళితులను మాత్రమే ఎస్సీలుగా పరిగణించారు. అంబేద్కర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ కాబట్టి షెడ్యూల్డ్ క్యాస్ట్ ఆర్డర్స్ తీసుకొచ్చారు. అనంతరం సిక్కు (1956), బౌద్ధ (1990) మతాల్లోకి మారిన వారిని సైతం ఈ పరిధిలోకి చేర్చారు. అయితే, క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన దళితులను మాత్రం ఇప్పటికీ వెలుపలే ఉంచారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ క్లాస్ 3 ప్రకారం ఒక వ్యక్తి క్రిస్టియన్ పేరు పెట్టుకుంటే, బైబిల్ పట్టుకుంటే, ఏసుక్రీస్తు ఫోటో పెట్టుకొంటే, చర్చికి వెళ్లినంత మాత్రాన అతను క్రిస్టియన్ కాదు. తనకు తాను స్వయంగా ప్రకటించుకుంటేనే క్రిస్టియన్. అప్పుడే రిజర్వేషన్స్, అట్రాసిటీ చట్టం వర్తించదు. ఈ విషయాన్ని పలు కేసుల్లో కోర్టులు సైతం వాక్యానించాయి. కానీ ఇటీవల సుప్రీంకోర్టు జడ్జిమెంట్ లో పాస్టర్ తనకు తానే క్రిస్టియన్ అని ప్రకటించుకున్నాడు. కాబట్టి ఈ తీర్పు కూడా ఆ పాస్టర్ కే వర్తిస్తుంది. అందరికీ కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 మతం, కులం, భాష, లింగం అనే తేడా లేకుండా సమానత్వాన్ని హామీ ఇస్తుంది. ఆర్టికల్ 25 మత స్వేచ్ఛకు హామీ ఇస్తుంది.

**మతం మారిన వివక్ష ఆగలేదు :** భారతదేశంలో పీడిత వర్గాల కోసం తెచ్చిన రాజ్యాంగ రిజర్వేషన్లు, చట్టాలు, మతపరమైన సౌకర్యాలు కావు అవి శతాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక అన్యాయానికి పరిహారం. అయినప్పటికీ కులభారతంలో దళితులు మతం మారిన వివక్షత ఆగలేదు. ఆంధ్రప్రదేశ్ లో కారంచేడు, చుండూర్ దళిత క్రిస్టియన్ లపైన జరిగిన దాడి చరిత్రలో మాయని మచ్చలుగా నిలిచాయి. దళితులు మతం మార్చుకుంటే వారి జీవితాల్లో గౌరవం, సమానత్వం రాదని ఈ అమానుష ఘటనలు రుజువు చేశాయి. ఈ సంఘటలతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం తెరపైకి వచ్చింది. ఇప్పుడు దళితుల రక్షణ కోసం తెచ్చిన ఈ చట్టాన్ని వర్తింపచేయ వద్దనడం గమనార్హం. హిందూ సమాజంలోనీ దళిత, వెనుక బడిన వర్గాలు కూడా వివక్ష నుంచి తప్పించుకోవడం లేదు. తెలంగాణలో కుమ్మెర ఘటన, కర్ల రాజేష్ పై మరణం ఇందుకు నిదర్శనం. వివక్ష అనేది కేవలం మతానికి పరిమితం కాదు అది సామాజిక నిర్మాణంలో, మనుషుల మనస్తత్వంలో, బలంగా పాతుకుపోయిన వ్యవస్థ. కావున మతం మారిందనే కారణంతో వ్యక్తికి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను నిరాకరించడం అంటే బాధితుడినీ మళ్ళీ బాధితున్ని చేసి శిక్షించడమే. ఇదీ అంతిమంగా దళిత క్రిస్టియన్ ను భయపెట్టించడం, దళిత హిందువులను ప్రలోభాలకు గురిచేయడమే.

**రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలి :** 1950 రాష్ట్రపతి ఉత్తర్వులపై గతంలో యూపీఏ గవర్నమెంట్ జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమీషన్ ఏర్పాటు చేసింది. రిపోర్ట్ సమర్పించింది. అయినప్పటికీ కాలయాపన చేయడానికి బీజేపీ గవర్నమెంట్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమీషన్ నియమించింది. ఈ కమీషన్ రిపోర్ట్ లను బయటికి రానివ్వకుండా రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇస్తుంది? అంతేకాకుండా రాష్ట్రపతి ఆర్డర్ పై సుప్రీంకోర్టులో 2004 నుంచి పలు ప్రజా ప్రయోజన వాజ్యాలు వేశారు. ఇవీ బెంచి మీదకి రాకుండానే అడ్డుకుంటున్నారు. వాస్తవంగా రాష్ట్రపతి ఆర్డర్ ఆరు నెలల్లోపు చట్టంగా మారితేనే నిలుస్తుంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ళైనా ఈ ఆర్డర్ చట్టంగా మారలేదు. అయినా దీని ఆధారంగానే సుప్రీం కోర్టు తీర్పునీవ్వడం భారత రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. ఒక అగ్రకులం వ్యక్తి క్రిస్టియన్ గా మారిన అతను ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోల్పోడు. అతని అగ్రకుల హోదా పోదు. ఒక బీసీ, ఎస్టీ సైతం క్రిస్టియన్ గా మారిన తమ రిజర్వేషన్లు, రక్షణలు పోవు. కానీ మతం మారిన దళితులు మాత్రమే రిజర్వేషన్స్, చట్టపరమైన రక్షణలను కోల్పోవడం వివక్ష కాదా? ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం కాదా? సుప్రీంకోర్టు తీర్పు మతం పేరుతో ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తున్నట్టు కాదా ?ఇదంతా ఆధిపత్యం వర్గాల ఆధ్వర్యంలో జరుగుతున్న వ్యవస్థాపక అణిచివేత. ఈ ప్రమాదం కేవలం దళిత క్రిస్టియన్లకే పరిమితం కాదు. భవిష్యత్తులో ఆదివాసులపై కూడా జరుగుతాయి. ఇప్పటికే ఒరిస్సా, ఈశాన్య రాష్ట్రాల్లో మతంపేరుతో ఆదివాసులపై దాడులు జరుగుతున్నాయి. రేపు బీసీలపై కూడా జరిగే అవకాశం లేకపోలేదు. అంతిమంగా హిందు బీసీ ఎస్సీ ఎస్టీలకు రాజ్యాంగపరమైన, చట్టపరమైన రక్షణలను మతం పేరుతో నీరుగార్చే ప్రమాదం పొంచి ఉంది. ఇవి ఆగాలంటే అంబేద్కర్ మతాంతరం చెందకుండా ఆపడానికి కుట్రపూరితంగా తెచ్చిన 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను రద్దు చేయాలి. అప్పుడే రాజ్యాంగ స్ఫూర్తి వర్ధిల్లుతుంది.

**సంపతి రమేష్**
**సామాజిక విశ్లేషకులు**
**7989579428**

# గంగా - జమునా తెహజీబ్ - సామరస్య తెలంగాణ

## మైనారిటీ బడ్జెట్‌లో రేవంత్ రెడ్డి సమదర్శన రాజనీతి



తెలంగాణ నేల భిన్నత్వంలో ఏకత్వానికి, గంగా-జమునా తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యం. రాష్ట్రంలోని ప్రతి పౌరుడు, వారు ఏ మతానికి లేదా వర్గానికి చెందిన వారైనా, సమానమైన అభివృద్ధి ఫలాలను అందుకోవాలనేది ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అసలైన సంకల్పం. "అభివృద్ధిలో వివక్ష ఉండకూడదు - అందరికీ ఆత్మీయ భరోసా ఉండాలి" అనే తన దార్శనికతను 2026-27 వార్షిక బడ్జెట్‌లో ముఖ్యమంత్రి గారు అడుగడుగునా ప్రతిబింబించారు. మార్చి 20, 2026న ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖకు ఏకంగా 3,003 కోట్ల రూపాయలు కేటాయించడం ఒక చారిత్రాత్మక ఘట్టం. ఈ నిధుల కేటాయింపు, వాటి సక్రమ వినియోగాన్ని పర్యవేక్షిస్తున్న మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి శ్రీ మహ్మద్ అజహరుద్దీన్ గారి ఆధ్వర్యంలో మైనారిటీల వికాసం నేడు సరికొత్త పుంతలు తొక్కుతోంది. ఇది కేవలం అంకెల కేటాయింపు కాదు, ఇది తెలంగాణలోని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు మరియు ఇతర మైనారిటీ వర్గాల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చూపుతున్న సమదర్శన రాజనీతికి నిదర్శనం.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనారిటీల సంక్షేమం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం కాకుండా, వారి ఆర్థిక మరియు విద్యా ఎదుగుదల కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోబడ్డాయి. గత పదేళ్ల పాలనలో మైనారిటీల సంక్షేమం అనేది కేవలం ప్రచారానికే పరిమితమైందని, ప్రగతి భవన్ మెట్ల వరకు కూడా సామాన్య మైనారిటీ సోదరులకు ప్రవేశం లేని పరిస్థితి ఉండేదని నిన్న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పదునైన విమర్శలు చేశారు. దానిని సరిదిద్దుతూ, నేడు సెక్రటేరియట్ తలుపులు అందరికీ తెరిచి ఉంచడమే కాకుండా, బడ్జెట్‌లో మైనారిటీలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రాధాన్యతనిచ్చారు. మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ గారు అసెంబ్లీలో వివరించినట్లుగా, మైనారిటీలకు దక్కాల్సిన ప్రతి పైసాను పారదర్శకమైన ఆన్‌లైన్ విధానం ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మైనారిటీ కార్పొరేషన్ ద్వారా అందే రుణాలు కేవలం రాజకీయ నాయకుల అనుయాయులకే దక్కేవన్న ఆరోపణలను ఎండగడుతూ, ఈ ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' పథకం కింద మైనారిటీ యువతకు పారదర్శకంగా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తోంది.

విద్యా రంగమే మైనారిటీల తలరాతను మారుస్తుందని నమ్మిన ముఖ్యమంత్రి గారు, ఈ బడ్జెట్‌లో మైనారిటీ విద్యా సంస్థల బలోపేతానికి భారీగా నిధులు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ గురుకులాలను 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు'గా మారుస్తున్నారు. దీనివల్ల మైనారిటీ విద్యార్థులు మతపరమైన పరిధుల నుండి బయటకు వచ్చి, ఇతర సామాజిక వర్గాలతో కలిసి అంతర్జాతీయ స్థాయి విద్యను అభ్యసించే అవకాశం లభించింది. మంత్రి అజహరుద్దీన్ గారు ఈ విద్యా సంస్థల మౌలిక వసతుల కల్పనను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అలాగే, విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే మైనారిటీ విద్యార్థులకు 'ముఖ్యమంత్రి విదేశీ విద్యా నిధి' కింద అందజేసే ఆర్థిక సహాయాన్ని మరింత పెంచడమే కాకుండా, దరఖాస్తు ప్రక్రియను సరళతరం చేశారు. గతంలో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులను, మెస్ ఛార్జీలను ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన విడుదల చేసింది. దీనివల్ల వేలాది మంది పేద మైనారిటీ విద్యార్థులు ఆగిపోయిన తమ చదువులను తిరిగి కొనసాగించగలుగుతున్నారు.

నిరుపేద మైనారిటీ కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం అందిస్తున్న 'షాదీ ముబారక్' పథకంపై అసెంబ్లీలో ఆసక్తికరమైన చర్చ జరిగింది. గత ప్రభుత్వం బడ్జెట్‌లో అంకెలు వేసి, తీరా లబ్ధిదారులకు నిధులు విడుదల చేయడంలో ఏళ్ల తరబడి జాప్యం చేసేదని మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ గారు గణాంకాలతో సహా వివరించారు. దీనిని సరిదిద్దుతూ, రేవంత్ రెడ్డి గారు ఈ పథకానికి నిధుల కొరత లేకుండా చూడటమే కాకుండా, పెళ్లి జరిగిన అతి తక్కువ సమయంలోనే నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా వ్యవస్థను ప్రక్షాళన చేశారు. బడ్జెట్‌లో ఈ పథకం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం ద్వారా వేలాది మంది పేద తల్లిదండ్రుల కన్నీటిని ఈ ప్రభుత్వం తుడిచింది. అదేవిధంగా, వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణపై ముఖ్యమంత్రి గారు అత్యంత పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వక్ఫ్ భూముల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఇది మైనారిటీల సామాజిక ఆస్తుల పరిరక్షణలో ఒక గొప్ప ముందడుగు.

మైనారిటీల ఆర్థిక సాధికారత కోసం 'మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్' ద్వారా ఈ బడ్జెట్‌లో ?500 కోట్ల రూపాయలు కేటాయించారు. మంత్రి అజహరుద్దీన్ గారి పర్యవేక్షణలో మైనారిటీ యువతకు టైలరింగ్, కంప్యూటర్ కోర్సులు, ఆటో మొబైల్ రిపేరింగ్ వంటి రంగాలలో ఉపాధి శిక్షణ ఇప్పిస్తున్నారు. ముఖ్యమంత్రి గారి దార్శనికతలో భాగంగా ఏర్పడిన 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' లో మైనారిటీ యువతకు ప్రత్యేక కోటా కల్పించి, వారిని పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. దీనివల్ల మైనారిటీ యువత కేవలం పాతబస్తీ గల్లీలకే పరిమితం కాకుండా, హైటెక్ సిటీలోని బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించే స్థాయికి ఎదుగుతున్నారు. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో ముఖ్యమంత్రి గారు కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కూడా మెండుగా లభిస్తున్నాయి.

సామాజిక భద్రత విషయంలో మైనారిటీలకు రేవంత్ రెడ్డి గారు కొండంత అండగా నిలుస్తున్నారు. జూన్ 2 నుండి ప్రారంభం కానున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' ద్వారా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ?5 లక్షల జీవిత బీమా కల్పిస్తున్నారు, ఇందులో మెజారిటీ మైనారిటీ కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. ఆరోగ్య రంగంలో ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ?10 లక్షలకు పెంచడం వల్ల, ఖరీదైన వైద్యం అందక మరణించే పేద మైనారిటీల సంఖ్య గణనీయంగా తగ్గింది. పాతబస్తీలో మెట్రో రైలు పనులను వేగవంతం చేయడం ద్వారా ఆ ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి గారు తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు. "హైదరాబాద్ అంటే కేవలం హైటెక్ సిటీ కాదు, పాతబస్తీ కూడా ప్రగతిలో భాగం కావాలి" అన్న ఆయన నినాదం నేడు కార్యరూపం దాల్చుతోంది. పాతబస్తీలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచడం, మంచినీటి వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించడం శుభపరిణామం.

నిన్న అసెంబ్లీ చర్చలో ముఖ్యమంత్రి చెప్పిన ఒక మాట మైనారిటీల గుండెలకు హత్తుకుంది. "మేము ఎవరినో మెప్పించడానికి రాజకీయం చేయడం లేదు. మతం ఏదైనా మా దృష్టిలో అందరూ పేదలే, అందరూ అభివృద్ధికి అర్హులే" అని ఆయన స్పష్టం చేశారు. మతపరమైన ఉత్సవాలైన రంజాన్, క్రిస్మస్ పండుగలను ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తూ, పేదలకు దుస్తులు, కానుకల పంపిణీకి బడ్జెట్‌లో ముందస్తుగా నిధులు విడుదల చేసింది. ఇది రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మైనారిటీల పట్ల ఉన్న ఆత్మీయతకు నిదర్శనం. మైనారిటీల రక్షణ కోసం హోం శాఖ ద్వారా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి, రాష్ట్రంలో మతసామరస్యం దెబ్బతినకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన ప్రకటించారు. తెలంగాణ నేల శాంతికి నిలయమని, ఇక్కడ విద్వేషాలకు తావులేదని ఆయన చేసిన హెచ్చరిక మైనారిటీలకు భద్రతా భావాన్ని కలిగించింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ కార్యదక్షతతో తెలంగాణలో మైనారిటీ వికాసం ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ఈ 2026-27 బడ్జెట్ ప్రతి అక్షరంలోనూ మైనారిటీల ఆత్మగౌరవం, వారి పిల్లల బంగారు భవిష్యత్తు దాగి ఉన్నాయి. అప్పుల భారాన్ని ఎదుర్కొంటూనే, సామాజిక సమతుల్యం కోసం మైనారిటీ నిధులకు ఎక్కడా కోత విధించకుండా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ, మైనారిటీల విద్యా, ఉపాధి, రక్షణకు పెద్దపీట వేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వం నిజమైన 'సామరస్య తెలంగాణ'ను ఆవిష్కరిస్తోంది. అభివృద్ధి, విశ్వసనీయతను రెండు కళ్లుగా భావించి సాగుతున్న రేవంత్ రెడ్డి గారి పాలన తెలంగాణ మైనారిటీల జీవితాల్లో ఒక సువర్ణ అధ్యాయంలా నిలిచిపోతుంది.



**పురుషోత్తం నారగౌని**
**సీనియర్ జర్నలిస్ట్**
**సామాజిక రాజకీయ విశ్లేషకులు**
**మొబైల్ : 8897388393**

**మార్చి 31 డెడ్‌లైన్‌తో..**

# మావోయిస్టులను నిర్మూలిస్తారా? పేదరికం నిర్మూలిస్తారా..?

సిపిఐ మావోయిస్టు పార్టీ 18 రాష్ట్రాల్లో ఎగబాకింది. మావోయిస్టు విప్లవ ఉద్యమాన్ని అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ తో తమ దాడిని మొదలు పెట్టింది. ఆపరేషన్ కగార్ తో విప్లవోద్యమం భారీ నష్టాలను ఎదుర్కొంది. వరుస ఎన్కౌంటర్లు, వరుస అరెస్టులు, వరుస లొంగుబాట్లు, భారీ నష్టాన్ని చవిచూసింది. మావోయిస్టు పార్టీని పశ్చిమ బెంగాల్లో ఉద్యమం రైతాంగం ఎగిసి జగిత్యాల ఇంద్రవెల్లి తెలంగాణ ఎగబాకింది, దేశవ్యాప్త నలుమూలల విస్తరింపజేసింది. ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరుద్యోగం, ఇవన్నీ విప్లవోద్యమం బలపడింది. మార్చి 31 నాటికి మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డెడ్లైన్ విధించారు. ఆపరేషన్ కగార్ దండకారణ్యంలో ఉన్నటువంటి అపారమైన ఖనిజ సంపద అపారమైన అడవి సంపదను కొల్లగొట్టడానికి విదేశీ స్వదేశీ బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసమే ఆదివాసులపై అధర్మయుద్ధాన్ని ప్రకటించింది. స్వాతంత్రం సిద్ధించి 78 ఏళ్లు పూర్తయిన ఆదివాసులకు స్వాతంత్ర ఫలాలు అందడం లేదు నేటికీ అడవి ఆధారం అడవి తల్లి ఒడిలో ఆదివాసులు గిరిజనులు బతుకుతున్నారు. అలాంటి అడవిలో వేల సంఖ్యలో భద్రత బలగాలు పోలీస్ బలగాలు పహారా లో బహుళ జాతి సంస్థల పడగనిడలో ఆదివాసులు బతికీడుస్తున్నారు. ఇప్పటికీ కట్టుకోవడానికి బట్ట ఉండడానికి నివాసము ఏది లేకుండానే అడవి పైనే ఆధారపడి బతుకుతున్నారు. అలాంటి ఆదివాసులపై రాజ్యం, నిర్బంధంలో తన బల ప్రయోగాన్ని వినియోగి స్తుంది. తెలంగాణలో సామంతరమైన ప్రభుత్వాన్ని నడపగలిగారు. ప్రజలకు దగ్గరయ్యారు. మావోయిస్టులు దీర్ఘకాలికంగా సాయుధ పోరాటాన్ని కొనసాగించారు .. 1980లో అప్పటి సిపిఐ ఎంఎల్ పీపుల్ వార్ పార్టీని నిర్మించాడు. కొండపల్లి సీతారామయ్య తెలంగాణలో ఉవ్వెత్తున ఎగిసిపడిన జ్వాలలు అగ్ని జ్వాల లు విప్లవోద్యమ చరిత్రలో 1975 గిరాయిపల్లి, ఎన్కౌంటర్, 1981 జగిత్యాల జైత్రయాత్ర, ఇంద్రవెల్లి అమరత్వం , పోరాట చరిత్రలో ఇవి ఈ ఘటనలు ఎప్పుడు ప్రజల హృదయాల్లో మెదులుతూనే ఉంటాయి.. 2010లో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో దండకారణ్యంలో దాడిని మొదలుపెట్టింది. అప్పటినుండి వరుస లొంగుబాట్లు, వరుస ఎన్కౌంటర్లు తో దండకారణ్యం దద్దరిల్లుతూనే ఉంది. నాటి నుండి మొదలుకొని నేటిదాకా రక్తపాతం ఏరులై పారుతూనే ఉంది. అమాయక ఆదివాసులపై అక్రమ కేసులు తప్పుడు కేసులు పెట్టడం వల్ల సుమారు 30 వేల మంది ఆదివాసి ప్రజలు ఖైదీలుగా ఛత్తీస్గఢ్ జార్ఖండ్, మహారాష్ట్ర, నాగపూర్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, ఆయా రాష్ట్రాలలో ఆయా జై లలో శిక్ష నిరూపణ కాకముందే ఒక్కొక్కరు ఐదు సంవత్సరాల నుండి 10 సంవత్సరాల వరకు శిక్షలు రిమాండ్ ఖైదీలుగా శిక్షలు అనుభవిస్తున్నారు.. ఆదివాసులు ఆదవి హక్కు పూర్తిగా వారికేనని వారికే చెందాలని మావోయిస్టులు ఎప్పటినుండో పోరాడుతూనే ఉన్నారు. గత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దాడులలో మావోయిస్టు పార్టీ అగ్రనాయకత్వం ఎన్కౌంటర్లలో చనిపోయారు.. అయినా ఉద్యమం నడుస్తూనే ఉంది. దండకరణ్యానికి వెళ్లిన విప్లవద్యమం దండకరణ్యం వరకే పరిమితమైంది. మైదాన ప్రాంతాలలో విప్లవోద్యమం లేకుండా పోయింది. 1980 నాటికి నేటికి పోల్చుకుంటే ప్రజలలో అనేకమైనటువంటి మార్పులు వచ్చాయి.. ప్రపంచీకరణ సరళీకృత నూతన ఆర్థిక విధానాలు ప్రభావితం చేయగలిగాయి. ప్రజలలో స్వార్థం పెరిగింది. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా కొనసాగుతున్నాయి. పల్లెల్లో కూడా ప్రపంచకరణ విధానాలు అమలవుతున్నాయి. నాడు భూస్వామ్య పెత్తందారి దోపిడి ఉండేది, నేడు దోపిడి తన పంతాను మార్చుకొని రూపాంతరం చెందింది.. దోపిడీ గతం తో పోలిస్తే నేడు మరింత పెరిగింది. ఆర్థిక సమానతలు పేదరికం విలయ తాండవిస్తూనే ఉంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తెలంగాణలో విప్లవోద్యమ పార్టీలకు నష్టాన్ని కలిగించాయి. ప్రజాస్వామ్య తెలంగాణ కోసం మావోయిస్టులు తెలంగాణ ఉద్యమాన్ని 1998లో ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమం అది రాను రాను బూర్జువాల చేతిలోకి వెళ్లిపోయింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 10 ఏళ్లు అయిన పేద ప్రజలకు న్యాయం జరగలేదు. విప్లవోద్యమ పార్టీలకు మతాలు, కులాలు, ప్రాంతాలు, ఇవి నష్టాలను భారీగా కలిగిస్తాయి. ఇవి మానవ సమాజంలో అత్యంత ప్రమాదకరం మనుషుల మధ్య వైశ్యమాలు సృష్టించి రాజకీయ పార్టీలు తమ పబ్బాన్ని పదా న్ని గడుపుకుంటున్నాయి.. మావోయిస్టుల విషయానికొస్తే మావోయిస్టు పార్టీలో కేంద్ర కమిటీలో ప్రధానంగా మెజార్టీ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే ఉన్నారు. తెలంగాణ ప్రాంతం నుండి విప్లవోద్యమంలోకి అడుగుపెట్టిన వారందరూ కేంద్ర కమిటీలో క్రియాశీలకమైన పాత్రను నిర్వర్తిస్తున్నారు. ఆపరేషన్ కగారకు వ్యతిరేకంగా ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ప్రజా సంఘాలు హక్కుల సంఘాలు జర్నలిస్టులు రచయితలు ప్రజా కవులు కళాకారులు పోరాడినారు. కేంద్రంపై మావోయిస్టులపై నిషేధము ఎత్తివేసి బేషరతుగా చర్చలు జరపాలని డిమాండ్లు ముందుకు వచ్చాయి.. అయినా కేంద్రం వినకుండా ఏకపక్షంగా అడవిపై లక్షల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించి ఒక్క ఆదివాసికి 10 మంది పోలీసులను మొహరించారు నిత్యం దండకరణ్యం పచ్చని అడవులపై రక్తం మరకలు పడినాయి ఆదివాసులు వలసలుగా వెళ్ళిపోయారు. సుమారు మూడు లక్షల మంది ఆదివాసులు పక్క రాష్ట్రాల కెళ్ళి భయం గుప్పిట్లో తల దాచుకుంటున్నారు.



నేడు ఆదివాసి ప్రాంతాలలో అడవులను ధ్వంసం చేసి మైనింగ్ విరంగబడుతుంది. పచ్చని అడుగులపై విదేశీ స్వదేశీ కార్పొరేట్ శక్తులు పడగవిప్పి భూసలుకొడుతున్నారు.. వేలాది ఎకరాల అడవి భూములను బహుళజాతి సంస్థలకు పాలకులు కట్టబెట్టారు. పర్యావరణం పకృతి వీటిని పరిగణలోకి తీసుకోకుండా అప్పనంగా అప్పజెప్పినారు.. ఆదివాసులపై లాటి చార్జీ చేస్తూ... అక్రమ కేసులు పెడుతూ... జైల్లో నిర్బంధిస్తున్నారు. ఆపరేషన్ కగార్ లో సిపిఐ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ గంగన్న తో పాటు 28 మంది ఎన్కౌంటర్లో చనిపోయారు... దీంతో ఆగకుండా శాంతి చర్చల ప్రతినిధి సుధాకర్ అలియాస్ సింహాచలం చనిపోయారు... పదుల సంఖ్యలో చనిపోయారు.. మావోయిస్టు పార్టీ సిద్ధాంతకర్తగా వ్యవహరిస్తున్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను దాదా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఆశన్న అలియాస్ తక్కలపల్లి వాసుదేవరావు, అలియాస్ సతీష్ లొంగి పోయారు.. వీరి లొంగుబాటు విప్లవ ఉద్యమానికి నష్టాన్ని కలిగించాయి.. విప్లవ ప్రతిఘటకులుగా మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట ఒక హెచ్చరిక ప్రకటన విడుదలైంది. దీంతో ఆగకుండా వరుస సంఖ్యలో లొంగుబాట్లు జరిగాయి.. మావోయిస్టు పార్టీ విప్ల ఉద్యమానికి మార్క్స లెనిన్ మావో ఉపాధ్యాయునిగా పనిచేసిన కట్ట రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్, అలియాస్ అభయ్, అలియాస్ రాజు దాదా తో పాటు కడారి సత్యనారాయణ రెడ్డి, లను ఎన్కౌంటర్ కాల్చి చంపారు.. కట్ట రామచంద్రారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజాసంఘాల నేతలపై ఎన్ఐఏ కేసులు పెట్టింది... గాదే ఇన్నయ్యను చంచ లుగూడ సెంట్రల్ జైల్లో నిర్బంధించారు.. మరికొంతమంది ప్రజాసంఘాల నేతలకు ఎన్ఐఏ నోటీసులు జారీ చేసింది.

గడిచిన రెండు సంవత్సరాల కాలంలో 721 మావోయిస్టు లొంగిపోగా 266 ఆయుధాలు అప్పగించారు... గణపతి లొంగబాటపై మార్చి 31 తో ముగియనున్న కేంద్రం డెడ్ లైన్ గణపతి లొంగుబాటు కోసం దేశవ్యాప్తంగా ఆయనపై ఉన్న కేసులపై ప్రతిపాదనలు చేసి సిద్ధం చేశారు ... గణపతి లొంగిపోతారని ప్రచారం ఊపు అందుకుంది గణపతి లొంగిపోయినాడని ప్రచారం కూడా జరుగుతుంది.. గణపతి లొంగుబాటుపై బీర్పూర్ ప్రజలు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. గణపతి వయోభారంతో బాధపడు తుండగా మోకాళ్ళ నొప్పులు (ఐ షుగర్‌తో) బాధపడుతు న్నారు. గణపతి లొంగిపోతే మావోయిస్టు పార్టీ పూర్తిగా అంత మైనట్లేనని కేంద్రం భావిస్తుండగా... నిండు పార్లమెంట్లో అమిత్ షా నక్సలిజం పూర్తిగా నిర్మూలించామని పార్లమెంట్ల లో ప్రకటించాడు.. 1976 లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కూడా నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించామని అసెంబ్లీలో ప్రకటించారు. కానీ శ్రీకాకుళం కొండల్లో ఆవిర్భవించిన నక్సలిజం దేశవ్యాప్తంగా ఎదిగింది. ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా ఏర్పడి పీడిత ప్రజల వైపు నక్షలిజం పనిచేయగలిగింది. ఆనాటి రోజుల్లో విద్యార్థులు యువకులు మేధావులు రైతులు కార్మికులు కర్షకులు విప్లవ పార్టీలోకి వచ్చారు. రానురాను ప్రజలు నక్సలైట్ పార్టీలలోకి రావడం తగ్గిపోయింది.. ఆనాటి రోజుల్లో నక్సలైట్ పార్టీలు ప్రజల వైపున నిలిచాయి. 1925లో భారత కమ్యూనిస్టు పార్టీలు ఆవిర్భవించాయి. తెలంగాణ సాయుధ పోరాటం నిర్వర్తించి రజాకార్లకు వ్యతిరేకంగా విరోచితంగా సాయిధ పోరాటాన్ని నిర్వర్తించారు. 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచారు నక్సల్ బరి ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటున్న దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణం జరిగింది. మావోయిస్టు పార్టీలో ఇతర విప్లవ పార్టీలలో తరచుగా విభేదాలతో విడిపోవడం గ్రూపు గ్రూపులుగా విడిపోవడం పెద్ద నష్టాన్ని చేకూర్చాయి. ఇప్పటికే గణపతి పలు డిమాండ్లను కేంద్రం ముందు ఉంచినట్లు తెలుస్తుంది దండకారణ్యం నుండి భద్రత బలగాలను ఎత్తి వేయాలని పోలీస్ బేస్ క్యాంపులను ఎత్తివేయాలని ఏళ్ల తరబడి కేంద్ర కారాకారాల్లో మగ్గుతున్న మావోయిస్టు రాజకీయ ఖైదీలను బేశరథగా విడుదల చేయాలని వారిపై ఉన్నటువంటి కేసులను ఎత్తివేయవలసిందిగా కేంద్రం ముందు డిమాండ్లను ఉంచినట్లు తెలుస్తుంది.... ఆదివాసి ఖైదీలను కూడా విడుదల చేయాలని కోరినట్లు తెలుస్తుంది... మావోయిస్టు మార్చి 31 తో ఉద్యమం ముగిసినట్లేనని కేంద్రం భావించిన మావో లెనిన్ మార్క్స భావజాలం తెలంగాణ ప్రజల్లో విస్తృతంగా ప్రచారమై ఉంది.. ప్రజల మెదడుల నుండి మావోయిజం భావజాలంలో దూరం చేయడం పాలకవర్గాలతో కాదు ఆకలి అసమానతలు పేదరికం ఉన్నన్ని రోజులు నక్సలిజం ఉండి తీరుతుంది .ఇది పాలకులు గమనించాలి పాలకవర్గాలు చిత్తశుద్ధితో పేదరికాన్ని నిర్మూలిస్తే నక్సలిజం దానికి అదే నిర్మూలన కాపాడుతుంది పాలకులు నక్సలిజాన్ని రూపుమాపలేరు ఎందుకంటే పేదరికం నిర్మూలించడం వీరి తరం కాదు! 76 సంవత్సరాల స్వాతంత్ర భారత వానిలో పేదరికం ఆత్మహత్యలు ఆకలి చావును ఉన్నాయంటే పాలకవర్గాల ధమన నీతి అర్థమవుతుంది ... మార్క్సిజం చాలా గొప్పదని ఆ సిద్ధాంతాన్ని నేను కూడా పాటిస్తానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిండు అసెంబ్లీలో కమ్యూనిజం సిద్ధాంతం ఎంతో గొప్పదని ఆర్టీ సిద్ధాంతాన్ని నేను కూడా పాటిస్తానని కమ్యూనిజం సిద్ధాంతం కంటే మించింది లేదని కేసీఆర్ కరాకటిగా చెప్పారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాష్ సింగ్ బాదల్ నక్సలిజాన్ని శాంతి భద్రతల సమస్యగా కాకుండా రాజకీయ ఆర్థిక సమస్యగా పరిగణించలని అన్నారు. ఎన్టీ రామారావు నక్సలైట్లను దేశ భక్తులుగా కీర్తించారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ నక్సలిజం జెండాని తమ అజెండాని ప్రకటించారు.. చైనా, వియత్నం, క్యూబా, రష్యా ఆయా దేశాల్లో సోషలిస్టు విప్లవాలు విజయవంతమైనవి చైనాలో మావో నాయకత్వంలో వ్యవసాయక విప్లవం విజయవంతమైంది.. భారత దేశంలో 100 ఏళ్ళు పూర్తయిన ఇక్కడ సోషలిస్టువిప్లవం విజయవంతం కాలేదు చైనా దేశ పరిస్థితులు వేరు భారతదేశం పరిస్థితులు వేరు భిన్నంగా ఉన్నాయి లిభారతదేశంలో సంపద 100 శాతం ప్రజల్లో ఉండాల్సింది. 16 శాతం మంది చేతుల్లో ఉందిలి డబ్బు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైంది మిగతా జనాలలో బతకలేక నడి సముద్రంలో నావలాగా బతుకుతున్నారు. ౖతుల ఆత్మహత్యలు ప్రభుత్వ రంగ పరిశ్రమలు కూనరిల్లడం పల్లెలు తరిగి పట్టణాలు పెరగడం గ్రామీణ భారతం నుండి వలసలు పెరగడం ఆందోళన కలిగిస్తుంది. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, చేనేత రంగం, పాడిరంగం అన్ని రంగాలపై సరళికృత విధానాలతో తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువతీ యువకులు చెడు దారి పడుతు న్నారు.క్రైమ్ రేటింగ్ పెరగడం ఆందోళన కలిగిస్తుంది. నక్సలిజాన్ని రూపుమాపుతాం పదేపదే ప్రకటించడం పాలకులకు మామూలు అయిపోయింది ... లిమార్చిలి లి31 డేట్ లైన్ ఏ విధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే మావోయిస్టులను నిర్మూలిస్తానడం కాకుండా దేశంలో పెరిగిన పేదరికం పెరిగిన ఆర్థిక అసమానతలు పెరిగిన నిరుద్యోగం పెరిగిన ఆకలి చావులు పెరిగిన ఆత్మహత్యలు పెరిగిన వలసలు వీటిని నిర్మూలిస్తామని పాలకులు ప్రకటన చేయాల్సి ఉంది. భారత దేశంలో బ్రిటిష్ వలసవాదం నుండి స్వాతంత్ర పోరాటాలు నుండి నేటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. పాలకవర్గాలు అణచివేస్తూనే ఉన్నారు. మళ్లీ మళ్లీ కొత్త తరహాలో విప్లవోద్యమం పుట్టుకొస్తూనే ఉంది. బ్రిటిష్ వలసవాదులు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి, బిర్సా ముండా, కొమరంభీం, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, రాజు గురు సుకుదేవ్ లాంటి విప్లవ వీరులను చంపిన నేటిదాకా సజీవంగానే విప్లవ ఉద్యమాలు కొనసాగుతున్నాయి. భౌతికంగా మీరు లేకున్నా ప్రజల హృదయాల్లో చెరగని ముద్రలు, నేడు సాయిధ పోరాటం లేకున్నా ప్రజా విప్లవ ఉద్యమాలు మరో కొత్త రూపంలో పుట్టుకొస్తాయి. ఇది పాలకులు గమనించాలి ముందుగా పేదరికాన్ని నిర్మూలించండి 31తో మావోయిస్తులపై డెడ్లైన్ సందర్భంగా నక్సలిజని నిర్మిస్తారు. కానీ? మీరు పేదరికనీ నిర్మూలిస్తారా ??

**దామరపల్లి నర్సింహారెడ్డి**
**9581358696**

# ఒక్కరి నిర్లక్ష్యం కుటుంబాన్ని రోడ్డున పడేస్తుంది

- ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి
- ప్రమాదాలు విధి కాదు - మన నిర్లక్ష్య ఫలితమే



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 30 (జనం సాక్షి) :** ఒక్కరి నిర్లక్ష్యం కుటుంబాన్ని రోడ్డున పడేస్తుందని... ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లాలోని మోనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఎస్ అగర్వాల్ కంపెనీలో "ఎరైవ్ అలైవ్ " కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, ఒక్కరి నిర్లక్ష్యం వల్ల కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. "ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు" అనే విషయాన్ని గుర్తుంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో రోజుకు సగటున సుమారు 450 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతుండగా, గత సంవత్సరం దేశవ్యాప్తంగా సుమారు 1.6 లక్షల మంది ప్రాణాలు కోల్పోయి, 3 లక్షల మంది గాయపడ్డారని వివరించారు. జిల్లాలో గత సంవత్సరం 287 మంది మృతి చెందగా, 631 మంది గాయపడ్డారని తెలిపారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదని, ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం కన్నీరు ఉందని అన్నారు. జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 60 శాతం ద్విచక్ర వాహనాలకు సంబంధించినవేనని వెల్లడించారు. జిల్లాలో గత సంవత్సరం చేపట్టిన వాహన తనిఖీల ద్వారా సుమారు 69 రోడ్డు ప్రమాద మరణాలను నివారించగలిగామని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ - ద్విచక్ర వాహనదారులు రైడర్, పిలియన్ ఇద్దరూ ఐ ఎస్ ఐ ప్రమాణిత హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయకూడదని తెలిపారు. ఇటీవల శంకరంపేట్ మండలంలో జరిగిన ఒకే బైక్ ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటనను ఉదాహరణగా పేర్కొంటూ, ప్రమాదాల ముందు ఎవరూ అతీతులు కారని అన్నారు. చివరగా, ప్రమాదాలు విధి కాదని, మన నిర్లక్ష్య ఫలితమేనని స్పష్టం చేస్తూ మన కుటుంబాల భద్రత కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ కోరారు. కార్యక్రమం ముగింపులో సిబ్బంది, కార్మికులతో రోడ్డు భద్రతపై అవగాహనా ప్రతిజ్ఞ చేయించారు. ఇదే కార్యక్రమంలో తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిది తులాల బంగారాన్ని నిజాయితీగా పోలీసులకు అందించిన నాగరాజును జిల్లా ఎస్పీ అభినందించి శాలువాతో సన్మానించి బహుమతి అందించారు. అదేవిధంగా వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగను చాకచక్యంగా పోలీసులకు పట్టించిన వ్యక్తిని కూడా జిల్లా ఎస్పీ గారు శాలువాతో సన్మానించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సిఐ లు సందీప్ రెడ్డి కృష్ణమూర్తి రంగకృష్ణ, ఎసై లు సుభాష్ గౌడ్, గంగరాజు, రాజు, ఎంఎస్ అగర్వాల్ అధికారులు, కార్మికులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వ భూమిని కాపాడాలి

- సిపిఐ రాష్ట్ర నాయకులు కె. యేసు రత్నం




**నిజాంపేట్, మార్చి 30 (జనం సాక్షి) :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ సర్వే నెంబర్-103, 109 ప్రభుత్వ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా ప్రజావానిలో పాల్గొని అడిషనల్ కలెక్టర్ విజేయంద్ర రెడ్డి కీ వినతిపత్రం అందజేశారు. . ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు కె. యేసు రత్నం, సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్వే నెంబర్ -103 ప్రభుత్వ స్థలంలో తప్పుడు పత్రాలతో అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్నారు. అలాగే నిజాంపేట్ సర్వే నెంబర్ - 109 ప్రభుత్వ స్థలంలో కొంత స్థలం కబ్జా చేసి తప్పుడు పత్రాలతో అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇష్టానుసారంగా మున్సిపల్ పర్మిషన్ లేకుండా అదునపు అంతస్థులు ఎలాంటి పర్మిషన్ లేకుండా కడుతున్నారని, .కనుక పై అక్రమ నిర్మాణాలను పరిశీలించి ప్రభుత్వ భూమిని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరేంద్రర్ ప్రసాద్, సుజాత, రమ దేవి తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక
- జిల్లాలో పటిష్టంగా అమలు కావాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 30 (జనం సాక్షి) :** వేసవికాలం పరిశ్రమలలో అగ్ని ప్రమాదం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశ్రమల మేనేజర్ ప్రకాష్ రావు ను పరిశ్రమల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖల అనుమతులను నిర్ణీత గడువు లోగా మంజూరు చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది. జిల్లాస్థాయి రాయితీలను మంజూరు చేయడం జరిగింది. వేసవి కాలంలో పరిశ్రమలు ఎటువంటి అగ్నిప్రమాదాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవాలని కర్మాగార శాఖ అధికారులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో అమలు కావాలని మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కర్మగారా అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాలు నివారించాలి



**శంషాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసిపి నాగభూషణం పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం"అలైవ్ అరైవ్ " కార్యక్రమం 3వ దశలో భాగంగా, కిషన్గూడ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాబ్, ఆటో డ్రైవర్లు సాధారణ ప్రజలను లక్ష్యంగా తీసుకొని ట్రాఫిక్ నియమాలపై చైతన్యం కల్పించారు. ముఖ్యంగా మైనర్ రైడింగ్, ఆటో డ్రైవర్ల యూనిఫామ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్ స్పీడింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్, ఎస్ఐ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పీవీ టీకా అందించాలి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 30 (జనంసాక్షి) :** మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లాలోని రెసిడెన్షియల్ సంస్థలు, హాస్టళ్లు, పాఠశాలల్లో చదువుతున్న 14 నుంచి 15 సంవత్సరాల బాలికలందరికీ హెచ్‌పీవీ టీకా అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. సోమవారం కీసర మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ క్యాన్సర్ నివారణకు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీకా మోతాదులపై వివరాలు తెలుసుకొని, టీకా తీసుకున్న బాలికలకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో ఉన్న బాలికలకు కూడా టీకా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు. సంబంధిత శాఖల సమన్వయంతో బాలికలను సమీకరించి వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ టీకాపై విస్తృత అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు లేదా వివిధ కారణాలతో మిగిలిపోయిన వారిని గుర్తించి వారికి కూడా టీకా అందేలా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు, బాలికల్లో అవగాహన పెంచి స్వచ్ఛందంగా టీకా తీసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అవసరమైన మరమ్మత్తులపై వివరాలు తెలుసుకొని, అదనపు నిధులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. మందుల నిల్వ గదిని పరిశీలించి గడువు ముగిసిన మందులు వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఉమాగౌరి, ఉప డీఎంహెచ్ఓ సత్యవతి, ప్రోగ్రాం అధికారి కౌశిక్, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ మంజుల, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కోహెడ పోలీస్ దాడులు



**కోహెడ, మార్చి 30 (జనంసాక్షి) :** మండలంలోని కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారు లోని మోయ తుమ్మెద వాగు నుండి అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై పోలీస్ లు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో సోమవారం నారాయణపూర్ గ్రామ శివారు లోని మోయ తుమ్మెద వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో కోహెడ పోలీసులు తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూడగానే ఒక ట్రాక్టర్ ఇసుకతో లోడ్ చేయబడి వాగులో ఉండగా సదరు ట్రాక్టర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ ల విచారణలో నిందితుడు తరలిస్తున్న ఇసుకకు సంబంధించిన ఎటువంటి అధికారిక అనుమతులు అతని వద్ద లేవని పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్నవాహనము అలాగే వ్యక్తి వివరాలు ట్రాక్టర్ నెంబర్. టీ ఎస్ -36-టి 7982, ట్రాలి టి ఎస్ -36-టి -7983 యజమాని బండారీ రవి తండ్రి పర్శరాములు , గ్రామం గోట్లమీట్ట పట్టుబడిన ఇసుక ట్రాక్టర్ ను కోహెడ పోలీస్ స్టేషన్‌కు తరలించి, నిందితుని పై కేసు నమోదు చేయడం జరిగిందని పోలీస్ లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై పుల్లా అభిలాష్ మాట్లాడుతూ ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జడ్చర్లలో ఆశా వర్కర్ల భారీ రాస్తారోకో

- 10 కిలోమీటర్ల మేర స్తంభించిన హైవే
- వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్



**జడ్చర్ల, మార్చి 30 (జనంసాక్షి) :** గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట దగ్గర 44వ జాతీయ రహదారిపై ఆశా వర్కర్లు భారీ నిరసన చేపట్టారు. సిఐటియు పిలుపులో భాగంగా హైదరాబాద్ - కర్నూల్ జాతీయ రహదారిపై వందలాది మంది ఆశా వర్కర్లు బైఠాయించడంతో సుమారు 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ మేరకు ఆశ వర్కర్లు డిమాండ్ చేస్తూ ఎన్నికల హామీ ప్రకారం రూ. 18 వేల గౌరవ వేతనం అమలు చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన విరమింప చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆశా వర్కర్లకు మధ్య తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తమ సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్త సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయాలి



**నాగర్‌కర్నూల్, మార్చి 30 (జనంసాక్షి) :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు వి.రాజశేఖర్ శర్మ, వెంకటయ్య లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్ నిధులు విడుదల చేయక పోవడం వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలుగుతున్నాయని, విద్యార్థుల చదువుల కోసం, సర్టిఫికేట్స్ కోసం కళాశాల యాజమాన్యాల దగ్గరికి వెళితే ఫీజులు కడితే తప్ప సర్టిఫికెట్స్ ఇవ్వలేము అంటున్న పరిస్థితి ఉన్నదని, ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా విద్యార్థులకు ఇవ్వాల్సిన కోట్ల రూపాయల స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ ఇప్పటికీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వం విడుదల చేయకపోతే క్లాసులు నడపకుండా తరగతుల బహిష్కరిస్తున్న దుస్థితి నెలకొన్నదని తెలియజేశారు. ఫీజు బకాయలు విడుదల ఆలస్యం వల్ల, ఒక పక్క తల్లి దండ్రులు ఫీజులు కట్టలేక, ప్రభుత్వం స్కాలర్ షిప్స్ విడుదల చేయక విద్యార్థుల చదువులను మధ్యలోనే ఆపివేస్తు పార్ట్ టైమ్ జాబులు చేసుకుంటున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ఫీజు బకాయిల కోసం నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## విశ్రాంత ఉద్యోగులు సమాజసేవలో భాగం కావాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, మార్చి 30 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగుల జీవితంలో బదిలీలు, ఉద్యోగ విరమణలు సర్వసాధారణమని విశ్రాంత ఉద్యోగులు తమ శేష జీవితంలో కొంత సమయాన్ని సమాజ సేవకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. జిల్లా యువజన క్రీడల అధికారిగా పనిచేసి పదవి విరమణ పొందుతున్న డివైఎస్ఓ కృష్ణయ్య ను సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణయ్య తన ఉద్యోగ జీవితాన్ని విజయవంతంగా పూర్తి చేశారని, భవిష్యత్తులో జిల్లా అధికార యంత్రాంగానికి ఆయన సేవలు అవసరమైతే వినియోగించుకుంటామన్నారు. కృష్ణయ్య శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని,ఆరోగ్యంగా జీవించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం కృష్ణయ్యను జిల్లా కలెక్టర్ తో పాటు పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను వేగంగా పరిష్కరించాలి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 30 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి జాప్యం లేకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 143 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. తిరస్కరించే దరఖాస్తుల విషయంలో కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. అదేవిధంగా స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించని అధికారులకు మెమోలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, మార్చి 30 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 81 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డిఓ శ్రీనివాసరావుకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ఆయా శాఖల వారీగా సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి వారం ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద ఎత్తున అర్జీలు రావడమే కాక మామూలు రోజుల్లోనూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని అవే సమస్యలపై తన వద్దకు వస్తున్నట్లు చెప్పారు. ప్రజావాణికి వచ్చే చిన్న చిన్న సమస్యలను కూడా సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించకుండా అపరిష్కృతంగా ఉంచడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవిన్యూ, పురపాలక శాఖలలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించకపోవడానికి కారణమేంటని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్రతి బుధవారం ఆయా శాఖల జిల్లా అధికారులు తమ సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ చాలామంది పాటించడం లేదని మండిపడ్డారు. ప్రజావాణి అర్జీలు అధిక సంఖ్యలో పెండింగ్ లో ఉంచిన అధికారులకు మెమోలు జారీ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# భద్రత ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయి

**తూప్రాన్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** మానవ తప్పిదాల వల్లనే అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని భద్రత ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం,ఎస్ అగర్వాల్ కంపెనీలో అరైవు అలైవ్ కార్యక్రమం లో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు . ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు అధికంగా జరుగుతున్నాయని అన్నార. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, ఒక్కరి నిర్లక్ష్యం వల్ల కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. "ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు" అనే విషయాన్ని గుర్తుంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. వాహనానికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని



కోరారు. దేశవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో రోజుకు సగటున సుమారు 450 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతుండగా, గత సంవత్సరం దేశవ్యాప్తంగా సుమారు 1.6 లక్షల మంది ప్రాణాలు కోల్పోయి, 3 లక్షల మంది గాయపడ్డారని వివరించారు. మెదక్ జిల్లాలో గత సంవత్సరం 287 మంది మృతి చెందగా, 631 మంది గాయపడ్డారని తెలిపారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదని, ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం కన్నీరు ఉందని అన్నారు. జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 60 శాతం ద్విచక్ర వాహనాలకు సంబంధించినవేనని వెల్లడించారు. జిల్లాలో గత సంవత్సరం చేపట్టిన వాహన తనిఖీల ద్వారా సుమారు 69 రోడ్డు ప్రమాద మరణాలను నివారించగలిగామని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు రైడర్, పిలియన్ ఇద్దరూ ఐ ఎస్ ఐ ప్రమాణిత హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయకూడదని తెలిపారు. ఇటీవల శంకరంపేట్ మండలంలో జరిగిన ఒకే బైక్ ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటనను ఉదాహరణగా పేర్కొంటూ, ప్రమాదాల ముందు ఎవరూ అతీతులు కారని అన్నారు. చివరగా, ప్రమాదాలు విధి కాదని, మన నిర్లక్ష్య ఫలితమేనని , మన కుటుంబాల భద్రత కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ కోరారు. కార్యక్రమం ముగింపులో సిబ్బంది, కార్మికులతో రోడ్డు భద్రతపై అవగాహనా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సిఐ లు సందీప్ రెడ్డి కృష్ణమూర్తి రంగకృష్ణ, ఎసైలు సుభాష్ గౌడ్, గంగరాజు రాజు, ఎంఎస్ అగర్వాల్ అధికారులు పవన్ శర్మ ,వసంత కుమార్, వేణుగోపాల్,అనిల్ రాఘవన్ వెంకటేష్ పాషా, కార్మికులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల
- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి



**నర్సాపూర్ మార్చి 30 (జనం సాక్షి) :** పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డిలు అన్నారు సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతుంది అని పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అని చెప్పి పేదలకు ఒక ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతుందని అన్నారు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతంటి కలను సహకారం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పద్మ అశోక్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం నాయకులు సురేష్ నాయక్ రామా గౌడ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



**చిలప్‌చేడ్, మార్చి 30 (జనంసాక్షి) :** మండల పరిధిలోని మాజీ సర్పంచ్ లను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీస్ సిబ్బంది.గ్రామా పంచాయితీల పెండింగ్ బిల్స్ చెల్లించాలి అని అసెంబ్లీ ముట్టడికి బయలు దేరిన చిలప్‌చెడ్ మండల మాజీ సర్పంచ్ లు గోపాల్ రెడ్డి,యదగిరి,స్వరూప విట్టల్‌లను పోలీసు లు హౌజు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు, మాజీ సర్పంచ్ లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి,త్రాగునీరు,విధి దీపాలను,పారిశుధ్య పనుల,చెత్త సేకరణకు ట్రాక్టర్ డీజిల్ కొరకు మాజీ సర్పంచ్ లు వారి సొంత నిదులు ఖర్చు పెట్టి ప్రజ సమస్యలను తీర్చడం జరిగిది.కావున ప్రభుత్వశీ వెంటనే పెండింగ్ బిల్స్ నిదులు మంజూరు చేయలని . విజ్ఞపతి చేసారు. చిట్కుల్ మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, రామ్ దాస్ గూడా మాజీ సర్పంచ్ యాదగిరి, గౌతాపూర్ మాజీ సర్పంచ్ స్వరూప విట్టల్ లను ముందస్తు అరెస్టు చేసిన పోలీసు సిబ్బంది.

## నర్వలో డ్రగ్స్ రహిత తెలంగాణ కార్యక్రమం నిర్వహణ



**నర్వ, మార్చి 30 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ నియోజకవర్గం నర్వ మండలకేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా డ్రగ్స్ రహిత తెలంగాణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది,మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నియంత్రించాలని,డ్రగ్స్ రహిత మండలంగా తీర్చిదిద్దాలని కార్యక్రమం నిర్వహించడం జరిగింది.చెన్నయ్య సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా మంచిగా చదుకోవాలని సూచించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈగల్ టీం సబ్ ఇన్స్పెక్టర్ సుదర్శన్ యాదవ్,ఎస్సై పబ్బతి రమేష్ ఎంపీడీఓ శ్రీనివాస్,ఎమ్ఇఓ రామ్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్,నర్వ గ్రామ సర్పంచ్,హనుమంత్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి ,ఉప సర్పంచ్ అజయ్, గ్రామ వార్డు మెంబర్స్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఉపాధ్యాయుల బృందం,గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ఐక్య ఉద్యమాలు నిర్వహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు వెల్లడి

**వనపర్తి బ్యూరో, మార్చి 30 (జనం సాక్షి) :** ప్రస్తుత దశలో అస్తిత్వ ఉద్యమాలు దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతంగా కొనసాగుతున్నాయని ఇది ఎంతో ఆహ్వానించదగ్గ పరిణామం అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. సోమవారం నాడు వనపర్తి జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన బీసీ హక్కుల సాధన సమితి జిల్లా స్థాయి ముఖ్యుల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న జన గణనలో కులగణన ను చేపట్టి ఏ కులం జనాభా ఎంత ఉందో లెక్కలు తీసి అదేవిధంగా జనాభా దామాషా పద్ధతిలో రాజకీయ ఆర్థిక రిజర్వేషన్లు కేటాయించాలని దామాషా ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయించాలని చట్టసభల్లో కూడా జనాభా దామాషా పద్ధతిలో సీట్లు కేటాయించి అన్ని కులాల వారికి చట్టసభల్లో ప్రాతినిధ్యం



లభించే విధంగా చర్యలు చేపట్టాలని దేశంలో 3500 కులాలు ఉంటే ఈనాటికీ మూడువేల 400 కులాలు పార్లమెంటు గడప తొక్క లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రివర్గంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలని ఏకాభిప్రాయ సాధన పేరుతో గత 11 సంవత్సరాలుగా కుల గణన చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వం మోకా లడ్డుతోందని, ఇప్పుడు గాని కుల ఘనంగా చేపట్టకపోతే బీసీలు మరో 10 సంవత్సరాలు పాటు వెనక్కి నెట్టివేయబడతారని అందుకొరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలను ఐక్యం చేసి ఐక్య ఉద్యమాలు నిర్మించేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి కే విజయ రాములు మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన ఇరవై ఒక్క హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూడరాదని, బీసీల అభివృద్ధి కొరకు సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి ఉన్నారని ఇప్పటికీ శాసనసభలో మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టారని కేవలం 11 వేల కోట్లు మాత్రమే కేటాయించారని మిగతా 50 వేల రూపాయలు బీసీల అభివృద్ధి కొరకు కేటాయించి అట్టి నిధులను ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశానికి జె రమేష్ అధ్యక్షత వహించగా కే లక్ష్మీనారాయణ, కృష్ణ, మైబూస్, కుమార్, గోపాలకృష్ణ, నరేష్, వంశీ, లక్ష్మణ్, శిరీష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలపై లాఠీఛార్జ్ నిరసిస్తూ ధర్నా

**గద్వాల టౌన్, మార్చి 30 (జనంసాక్షి) :** ఆశా కార్యకర్తలపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆశా కార్యకర్తలతో కలసి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేరు నరసింహ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశా కార్యకర్తలకు నెలకు 18,000 వేల రూపాయలు ఫిక్స్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.ఆ హామీల అమలుపై ప్రశ్నిస్తే ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.తమ హక్కుల కోసం శాంతియుతంగా ఉద్యమించిన ఆశా కార్యకర్తలపై,సీఐటీయూ నాయకులపై లాఠీచార్జ్ చేయడమే కాకుండా,మహిళలను రాత్రి వరకు పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ తమ బాధ్యత అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ,ఇప్పుడు ఆ విలువలను విస్మరించిందని ఆయన ఆరోపించారు.కార్మిక వర్గ పోరాటాలను నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వం నిలబడలేదని హెచ్చరించారు.తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ హామీలు అమలు చేయాలని అడిగితే ఆశా



కార్యకర్తల ఇళ్ల వద్దకు వెళ్లి అక్రమ అరెస్టులు చేయడం,పోలీస్ స్టేషన్లలో నీళ్లు కూడా ఇవ్వకుండా నిర్బంధించడం అమానుషమని విమర్శించారు. గతంలో కార్మికులను విస్మరించిన ప్రభుత్వాలకు ఏమి జరిగిందో గుర్తు చేసుకోవాలని సూచించారు. తమకు 18,000 వేల రూపాయలు ఫిక్స్ వేతనం అమలు చేయాలని అదనపు పనిభారాన్ని తగ్గించాలని,వైద్య ఖర్చుల కోసం 50,000 వేల రూపాయలు,50 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లు నెరవేర్చే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆశా కార్యకర్తల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నర్సింగమ్మ,నాగ ప్రమీల,శ్వేత, జయలక్ష్మి, కేబీ సునీత, కాంతమ్మ,కవిత,పద్మ,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రజావాణి



**మెదక్, మార్చి 30 (జనం సాక్షి) :** ప్రజావాణిలో సమస్య పరిష్కారానికి ప్రజలు అందచేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుండి మొత్తం 81 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పరిష్కార స్వభావం దరఖాస్తు దారునికి తెలియచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని ఆయన సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డి. ఆర్.డి. ఓ శ్రీనివాసరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదండాపూర్ నిర్వాసితులకు మరో రూ. 150 కోట్లు విడుదల

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, మార్చి 30 (జనంసాక్షి) :** ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ప్రభుత్వం మరో రూ. 150 కోట్లను విడుదల చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సోమవారం పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. దీంతో ఇప్పటి వరకు ఈ ప్యాకేజీ కింద విడుదలైన మొత్తం రూ. 400 కోట్లకు చేరిందని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్కలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ. 250 కోట్లు, ప్రస్తుతం రూ. 150 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. పెంచిన పరిహారంతో కలిపి ఇంకా చెల్లించాల్సిన మిగిలిన బకాయిలను కూడా ఏప్రిల్ నెలలో తీసుకురావడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పరిహారంతో పాటు నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు స్పష్టం చేశారు.

# గ్రామసభలు పండుగ వాతావరణం తలపించేలా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, మార్చి 30 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ సభలను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.ఏప్రిల్, 2న నిర్వహించబోయే గ్రామ సభలు, వార్డు, మున్సిపల్ సభల నిర్వహణ పై సోమవారం ఉదయం ప్రజావాణి సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి ఏర్పాట్లు, సభ నిర్వహణ పై దిశా నిర్దేశం చేశారు.జడ్పీ సి. ఈ. ఒ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా అధికారులు, ప్రత్యక్షంగా సమావేశంలో పాల్గొనగా, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

### విద్యార్థులకు మెనూ ప్రకారం సమయానికి భోజనం పెట్టాలి

వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నిబంధనల ప్రకారం మెనూ అనుసరించి నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు.

### ప్రజావాణి అర్జీలను వేగంగా పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జెడ్పి సీఈవో యాదయ్యతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు.

### సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలి

మానసిక, బహుళ వైకల్యం, బుద్ధి మాంద్యం దివ్యాంగుల తలిదండ్రులు, సంరక్షకులకు సంరక్షకత్వం ధృవీకరణ పత్రం జారీ చేసేందుకు వనపర్తి జిల్లాలో జిల్లా స్థాయి కమిటి ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రకటించారు. సోమవారం ప్రజావాణి హాల్లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన (5) మంది సభ్యులతో కూడిన కమిటీని



ప్రకటించారు.

### గృహ సముదాయాలను నమోదు చేయండి

జన గణన- 2027కు సంబంధించి గృహ సముదాయాల బ్లాక్ (హౌజ్ లిస్టింగ్ బ్లాక్) లను గుర్తించి సి.యం.యం.ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.సోమవారం మధ్యాహ్నం జన గణన విధి విధానాలపై హైదరాబాద్ నుండి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలికేరి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో జన గణన - 2027 పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి ప్రజలు అందచేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మొత్తం 70 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పరిష్కార స్వభావం దరఖాస్తు దారునికి తెలియచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని ఆయన సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలు గ్యాస్ సరఫరాపై అపోహలు పడొద్దు

- జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ములుగు బ్యూరో,మార్చి30(జనం సాక్షి): ప్రజలు గ్యాస్ సరఫరా పై ఎలాంటి అపోహలు పడవద్దని,జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.సోమవారం ములుగు లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలోని ఎల్పిజి లక్ష్మీ హెచ్పి గ్యాస్ గోదాం ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గోదాం లో నిల్వ ఉన్న ఎల్పిజి హెచ్ పి గ్యాస్ సిలిండర్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎప్పటికప్పుడు స్టాక్ నిలువలు రిజిస్టర్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.గ్యాస్ సరఫరాలో అక్రమాలకు పాల్పడిన ప్రజల నుంచి అధిక రుసుము వసూలు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎల్పిజి గ్యాస్ సరఫరాలో ప్రజలు ఎలాంటి ఆందోళనలకు, అపోహలకు గురికావద్దని,గ్యాస్ కొరత ఉందంటూ వస్తున్న పుకార్లను నమ్మవద్దని స్పష్టం చేశారు.సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై, మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పౌర సరఫరాల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ ఎనర్జీ సప్లై, మానిటరింగ్ కమిటీ కన్వీనర్, సివిల్ సప్లై అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సేని , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ప్రజావాణి కార్యక్రమానికి 138 అర్జీలు



హనుమకొండ ప్రతినిధి మార్చి 30 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లా ప్రజావాణి అర్జీలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు అదనపు కలెక్టర్ ఎన్. రవి లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ స్వీకరించారు. అర్జీలను అందిస్తూ ప్రజలు సమస్యలపై వివరాలు తెలియజేయగా కలెక్టర్ ఓపికగా విన్నారు. ప్రజావాణి సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే జిల్లా అధికారులతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 138 అర్జీలు అందజేశారు.

## డీఈ కార్యాలయం ఎదుట

# ఆర్టిజన్ కార్మికుల ధర్నా



బెల్లంపల్లి, మార్చ్ 30 (జనంసాక్షి) : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిజన్, అన్-మ్యాన్డ్, పీస్ రేట్ కార్మికులు తమ డిమాండ్ల సాధనకై నినదించారు. జేఏసీ నాయకులు దేవేందర్, నవీన్, సుభాకర్, సింగారావు ఆనంద్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిజన్ ఉద్యోగుల కన్వర్షన్ చేపట్టాలని, వీరికి పాత ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని వారు కోరారు. ముఖ్యంగా ఉత్తర డిస్కమ్‌లోని 1,600 మంది అన్-మ్యాన్డ్ వర్కర్లను తక్షణమే ఆర్టిజన్లుగా మార్చాలని, 2016 డిసెంబర్ 4 కంటే ముందు నుంచి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వర్కర్లను విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లోని బిల్ కలెక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేసే పీస్ రేట్ వర్కర్లకు జీవో-11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, 2026 పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో టీఆర్వీకేఎస్ హెచ్ - 58 సంఘం మంచిర్యాల సర్కిల్ సెక్రటరీ ముష్క నర్సయ్య, బెల్లంపల్లి డివిజన్ ప్రెసిడెంట్ జాల తిరుపతి, సెక్రటరీ పైడాకుల తిరుపతి పాల్గొని మద్దతు తెలిపారు. విద్యుత్ కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 1104 యూనియన్ బెల్లంపల్లి ప్రెసిడెంట్ గిట్టె పుండలీక్ రావు, సెక్రటరీ మార్కండేయ, 327 యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పెద్ద రమేష్, బెల్లంపల్లి అధ్యక్షుడు యూసస్, సెక్రటరీ ఈశ్వర్ సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం ఈనెల 7వ తేదీలోగా స్పందించకుంటే 8వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యుత్ ఉద్యోగుల సమ్మెలో జిల్లాలోని కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నరేంద్రుడి నోట ముదిగుంట మాట

- హర్షం వ్యక్తంచేసిన గ్రామస్తులు, అధికారులు
- జాతీయస్థాయిలో మార్మోగిన మంచిర్యాల జిల్లాలోని గ్రామం





మంచిర్యాల ప్రతినిధి (జనంసాక్షి) : జాతీయస్థాయిలో మంచిర్యాల జిల్లాలోని ముదిగుంట గ్రామం పేరు మార్మోగింది. సాక్షాత్తు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ముదిగుంట గ్రామం పేరు ప్రస్తావించారు. ఆ గ్రామం సాధించిన ఘనతను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉదాహరిస్తూ దేశ ప్రజలతో తన భావాలను పంచుకున్నారు. టీవీలో దేశ ప్రధాని తమ గ్రామం గురించి ప్రస్తావించడం టీవీల్లో ఆ గ్రామ ప్రజలు తిలకించి ఆనందంతో మురిసిపోయారు. అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని ప్రసంగం ద్వారా దేశమంతా మారుమోగిపోయిన ఆ గ్రామం ఏది, అది ఎక్కడ ఉంది, అసలు ఆ గ్రామం సాధించిన ఘనతపై జనంసాక్షి ప్రత్యేక కథనం...

దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నెల నెల తన మనుసులోకి భావాలను మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా పంచుకుంటారు. దేశంలోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలు ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేస్తాయి. ఈ కార్యక్రమం ప్రతి నెల నాలుగవ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. వివిధ అంశాలపై ప్రధాన మంత్రి తన ఆలోచనలను ప్రజలతో పంచుకుంటారు. ఈ సందర్భంగా పలు సంఘటనలను కూడా ఉదహరిస్తూ తన అనుభవాలను వ్యక్తం చేస్తూ ఉంటారు. ఇందులో భాగంగానే ఈ ఆదివారం ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమ 132 సంచికలో వేసవి కాలం మొదలైన నేపథ్యంలో జల సంరక్షణ గురించి ప్రస్తావించారు. గడిచిన పదకొండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన జల్ సంచాయి అభియాన్ ప్రజలలో చాలా అవగాహనను పెంచిందని అన్నారు. ఈ ఉద్యమం ద్వారా దేశ వ్యాప్తంగా నీటి సమస్యను నివారించేందుకు ప్రతి గ్రామంలో సామూహికంగా కృషి జరగడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణ ఎంత విస్తృతంగా వెళుతుందో తెలియజేయడానికి ఈ ఉదాహరణే తెలియజేస్తుందంటూ త్రిపుర, చత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లోని గ్రామాల పేర్లతోపాటు తెలంగాణ లోని మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ముదిగుంట గ్రామ ప్రస్తావన కూడా తీసుకువచ్చారు. ఆ ఊరి ప్రజలు సంఘటితంగా ఉండి నీటి సమస్యను దూరం చేస్తుకున్నారని కొనియాడారు. ఈ గ్రామంలో ఉన్న దాదాపు 400 కుటుంబాల వారు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. వారు నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మలిచారని అన్నారు. ఇదిలా ఉంటే ఆదివారం ప్రసారమైన ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని గ్రామంలో ఏర్పాటుచేసిన టీవీ తెర ద్వారా గ్రామస్థులందరు తిలకించారు. ఈ కార్యక్రమంలో తమ ఊరి పేరును ప్రస్తావించినందుకు ఆనందపడిపోయారు. అయితే వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడంతోపాటు మురికి నీటి కాలువల్లోని నీరు కూడా వృధాగా పోకుండా ప్రతి నీటి బొట్టు భూమిలోకి ఇంకిపోయేలా ప్రతి ఇంటికి ఓ ఇంకుడు గుంతను ఏర్పాటు చేశామని ముదిగుంట గ్రామ సర్పంచ్ ఆకుల రవి కుమార్ తెలిపారు. ఒకప్పుడు భూగర్భ జలాలు అడుగంటి అల్లాడిపోయామని, తాము చేపట్టిన నీటి సంరక్షణ చర్యలతో భూగర్భ నీటి మట్టం పెరిగిందని, కలుషిత నీటి ద్వార సంక్రమించే వ్యాధులు కూడా దూరమయ్యాయిని అన్నారు. ఇదే స్పూర్తితో పనిచేసి భవిష్యత్తులో నీటి సమస్యను పరిష్కరించుకునేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

## దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ప్రజావాణికి 165 దరఖాస్తులు



వరంగల్ బ్యూరో, మార్చి 30 (జనం సాక్షి) : జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి, నిర్ణీత కాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, పారదర్శకంగా మరియు వేగవంతంగా సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సాంకేతికతను వినియోగిస్తూ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా నేరుగా అనుసంధానం చేసి, ఎల్ఈడి స్క్రీన్ ద్వారా దరఖాస్తుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడే విధానాన్ని అమలు చేశారు. ఈ విధానంతో సంబంధిత అధికారులు సమస్యను వెంటనే అర్థం చేసుకుని, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం కలిగిందని కలెక్టర్ తెలిపారు.అలాగే, నిరక్షరాస్యులైన దరఖాస్తు దారులకు సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసి, సీనియర్ సిటిజన్లు మరియు రిటైర్డ్ ఉద్యోగుల సేవలను వినియోగిస్తూ ప్రతి వారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తుదారుల కోసం ఆరోగ్య పరీక్షల హెల్త్ క్యాంప్‌ను కూడా ఏర్పాటు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 165 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 71, జీడబ్ల్యూఎంసీకి సంబంధించినవి 23, ఇతర శాఖలకు సంబంధించినవి 71 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు.రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖా స్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో, వాటిని సంబంధిత తహసీల్దా ర్లకు పంపించి త్వరితగతిన పరిష్కారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, డీఆర్డీఓ రాంరెడ్డి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, హౌసింగ్ పీడీ శ్రీవాణి, డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు, తదితర శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

### అరైవ్ అలైవ్ ఫేజ్-3లో భాగంగా

# జైపూర్‌లో రోడ్డు భద్రత అవగాహన

- మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదు
- సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత
- సీపీ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల ప్రతినిధి మార్చి 30 (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం,తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు చేపట్టిన "అరైవ్ అలైవ్ ఫేజ్-3" కార్యక్రమంలో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా జైపూర్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో దుబ్బపల్లి ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ....,రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డుభద్రతపై అవగాహన పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. ప్రజా ప్రగతి ప్రణాళికలో భాగంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సులు,కంటి వైద్య శిబిరాలు మరియు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన యువకులు, కార్మికులు, విద్యార్థులు రోడ్డు భద్రతపై తెలుసుకున్న విషయాలను తమ గ్రామాలు,కాలనీలు, స్నేహితులు,కుటుంబ సభ్యులు మరియు సహచరులకు తెలియజేసే దూతలుగా మారాలని సూచించారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించేలా చైతన్యవంతం చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు.మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరిస్తూ,వారి భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.రాత్రి సమయంలో డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని,రోడ్డుపై నడిచే వారిని గమనిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.కనీస జాగ్రత్తలు పాటిస్తే రోడ్డుప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ప్రతి ఒక్కరి సహకారంతో రామగుండం కమిషనరేట్‌ను ప్రమాదరహిత ప్రాంతంగా మార్చాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, జైపూర్ సీఐ నవీన్, చెన్నూర్ టౌన్ ఇన్స్పెక్టర్ బన్సీలాల్, చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ, జైపూర్ ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, మార్చి 30, (జనంసాక్షి) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూర్ పట్టణానికి చెందిన దాసరి ప్రవీణ్ కుమార్, దాసరి రమేష్ లు తమ తాతల నుండి వస్తున్న పట్టా భూమిని నిషేధిత భూముల జాబితాలో చేర్చారని, ఈ పొరపాటును సవరించి తనకు పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. కిష్టంపేట గ్రామస్తులు తమ దరఖాస్తులో నిజామాబాద్ నుండి జగదల్పూర్ జాతీయ రహదారి 63 లోని కిష్టంపేట, భీమారం మధ్యలో ఉన్న జోడు వాగులపై నూతన వంతెన నిర్మించాలని కోరారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ తనకు గిఫ్ట్ దస్తావేజు, న్యాయస్థానం డిక్రీ ద్వారా సంక్రమించిన భూమి పట్టాను కొందరు అక్రమంగా రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం అశోక్ రోడ్డు కు చెందిన పాలకుర్తి రమాదేవి తన భర్త పేరిట గల భూమిని ఆయన మరణించినందున తన పేరిట విరాసత్ చేసి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వేమనపల్లి మండలం నాగారం గ్రామ మాజీ సర్పంచ్ తలండి స్వరూపారాణి తాను అధికారంలో ఉన్నప్పుడు చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.




## ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం

- డీసీసీ మానుకోట జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళి నాయక్

గూడూరు, మార్చి30 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ళు వచ్చే విధంగా కృషి చేస్తామని డీసీసీ మానుకోట జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళీ నాయక్ తెలిపారు. సోమవారం గూడూరు మండలం లోని గాజులగట్టు గ్రామ పంచాయతీ పరిధిలోని సమ్మిడి రాజు గౌడ్-ఉమా రాణి ల ఇందిరమ్మ ఇళ్ళు నూతన గృహ ప్రవేశానికి హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఉమా మురళీనాయక్ మాట్లాడుతూ పేదలకు పక్కా గృహాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని,ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షలు రూ,,లు లబ్ధిదారులకు అందిస్తుందని, పేద కుటుంబాలైన, దళితులు, గిరిజనులు, వికలాంగులు, భూమిలేని వ్యక్తులకు విడతల వారిగా ఇళ్ళు ఇచ్చి,వారు నిర్మించుకునే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బట్టి మౌనిక, ఉప సర్పంచ్ బొడ్డు రవి,భూక్యా సురేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పొన్నబోయిన చందు, మాధవన్ పెద్ది రమేష్ చందర్ రెడ్డి,నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ వడ్ల నరేష్ రెడ్డి,చిట్టే వెంకన్న, జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్,బొల్లికొండ మధు,మండల వర్కింగ్ ప్రసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి,ఎండీ రసూల్,కట్ల నరేందర్ రెడ్డి,సురేందర్ రెడ్డి, కతదితరులు పాల్గొన్నారు.

## రూ.85.61 లక్షల చెక్కుబల్దియాకు చెల్లింపు

- ఐడీఓసీ భవన సముదాయాల పన్ను బకాయిల చెక్ అందజేసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



హనుమకొండ ప్రతినిధి మార్చి 30 (జనంసాక్షి) : హన్మకొండలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయాలకు సంబంధించిన పన్ను బకాయిలుగా రూ. 85,61,262 మొత్తానికి చెక్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం హన్మకొండ కలెక్టరేట్ కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు తమకు ఉన్న పన్ను బకాయిలను వెంటనే చెల్లించి బల్దియాకు సహకరించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ముగింపుకు కేవలం ఒక రోజు మాత్రమే గడువు మిగిలి ఉన్న నేపథ్యంలో, మార్చి 31 అర్ధరాత్రి వరకు బల్దియా సేవా కేంద్రాలు నగరవ్యాప్తంగా పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు (అడ్మిన్) సమ్మయ్య, బిర్రు శ్రీనివాస్, ఆర్ఐ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల ఘట్టం



**హుజూర్‌నగర్, మార్చి 30 (జనంసాక్షి) :** ఏప్రిల్ 9న జరగబోయే హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఘట్టం సోమవారం సాయంత్రంతో ముగిసినట్లు ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్య లు తెలిపారు. అధ్యక్ష పదవికి కొణతం శ్రీనివాసరెడ్డి, నారపరాజు శ్రీనివాసరావు, ఉపాధ్యక్ష పదవికి కానూరి ప్రదీప్తి, కుక్కడపు సైదులు, జక్కుల వీరయ్య, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి పదవికి ఆర్ వి రమణారెడ్డి, పిన్నపురెడ్డి వెంకట రెడ్డి, భూక్య నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి పదవికి కోలా రమాదేవి, నీలం విజయదుర్గ, గ్రంథాలయ కార్యదర్శి పదవికి ధూళిపాల శ్రీనివాసరావు, మద్దుల నాగేశ్వరరావు, కోశాధికారి పదవికి గొట్టే ప్రశాంత్, బానోతు శంకర్, పచ్చిపాల గురుమూర్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పదవికి రమావత్ అడవి రాముడు, పిన్నపరెడ్డి వెంకటరెడ్డి, మహిళా కార్యవర్గ సభ్యుల పదవికి జుట్టుకొండ సంధ్యారాణి, షేక్ మౌలాబి, పురుష కార్యవర్గ సభ్యుల పదవికి కమతం నాగార్జున, బుడిగ నరేష్, షేక్ నాగపాష, నర్సింగ్ సతీష్, పల్లె అలెగ్జాండర్, పండ్ల నాగరాజు, చిట్టిపోలు రమేష్, జక్కుల నవీన్, దాసరి మోహన్, కందుల శంబిరెడ్డి నామినేషన్లను దాఖలు చేసినట్లుగా ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు వట్టికూటి అంజయ్య లు తెలిపారు.

## మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేయాలి



**ఖమ్మం, మార్చి 30 (జనంసాక్షి) :** మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ఈ వేసవిలోపే పూర్తి చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాజీవ్ స్వగృహ 'జలజ' ప్రాజెక్టును ఇటీవల సొసైటీ స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో, రిటైనింగ్ వాల్ పనులు త్వరితగతిన పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వాల్‌కు ఆనుకుని రహదారి నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి డా. విజయ్ కుమార్, టీఎన్జీవో ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, వల్లపు వెంకన్న, యర్రా రమేష్, జైపాల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల కొరకు వినియోగదారుల ధర్నా



**వైరా, మార్చి 30 (జనం సాక్షి) :** వైరాలోని సోమవారం గ్రామంలో ఉన్న కాణిపాక గ్యాస్ ఏజెన్సీ వద్ద వినియోగదారులు సోమవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజుల క్రితం తాము ము గ్యాస్ బుక్ చేపించుకున్నప్పటికీ గ్యాస్ ఏజెన్సీ వారు గ్యాస్ ఇవ్వకుండా గ్యాస్ లేదని చెబుతున్నారని అన్నారు. సకాలంలో గ్యాస్ అందించకపోవడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినియోగదారులు వాపోయారు. గ్యాస్ ఏజెన్సీ ముందు కొంత సేపు ధర్నా నిర్వహించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చి వినియోగదారులతో మాట్లాడి త్వరలోనే అందరికీ గ్యాస్ ఇప్పిస్తామని చెప్పడంతో ధర్నాను విరమించుకున్నారు. అయితే తాము గ్యాస్ తీసుకో పోయినప్పటికీ తమకు డెలివరీ గ్యాస్ అయినట్లుగా మెసేజ్ వస్తుందని వినియోగదారులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తమకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని వినియోగదారులు అంటున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 30 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని,నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలకి సంబంధించి 33 దరఖాస్తులు, డిఆర్డిఏ 6, డిపిఓ 5, డిడబ్ల్యూఓ 5, మిగిలిన 29 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని తెలిపారు.మొత్తం 78 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జడ్పీ సీఈఓ శిరీష, రెవెన్యూ డివిజన్ అధికారి వేణు మాధవరావు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పినపాక పీహెచ్‌సీలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం



పినపాక, మార్చి 30 (జనం సాక్షి) : పినపాక మండలం: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సోమవారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రత్యేక అధికారి తాతారావు, పినపాక సర్పంచ్ అలివేలు, తహసీల్దార్ గోపాల కృష్ణ ప్రారంభించారు. ఈ శిబిరంలో మొత్తం 216 మంది రోగులు వైద్య సేవలు పొందగా, అందులో పురుషులు 75 మంది, మహిళలు 141 మంది ఉన్నారు. విభాగాల వారీగా చూస్తే ఆర్థోపెడిక్ విభాగంలో 36 మంది, పిల్లల వైద్య విభాగంలో 8 మంది, కంటి వైద్య విభాగంలో 21 మంది, జనరల్ మెడిసిన్‌లో 90 మంది, ప్రసూతి, గైనకాలజీ విభాగంలో 61 మంది సేవలు పొందారు. ఈ శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరిగిందని పినపాక మెడికల్ ఆఫీసర్లు దుర్గా భవాని, వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిపుణులైన వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, ఆర్బీఎస్‌కే బృందం, సూపర్వైజర్లు, ఎంఎల్హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అందరూ సహకరించాలి

**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 30 (జనంసాక్షి) :** సూర్యాపేట మున్సిపాలిటీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.107.30 కోట్ల అంచనా బడ్జెట్‌ను రూపొందించి ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది తెలిపారు.నూతన పాలక మండలి ఏర్పడిన తరువాత తొలి సమావేశంగా 2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026-27 ముసాయిదా బడ్జెట్ సమావేశాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని రవి మహల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన రూ.107.30 కోట్ల బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను విస్తరించడం ద్వారానే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఇంటి పన్నుల ద్వారా రూ.1775 లక్షలు, స్టాంపు డ్యూటీ ద్వారా రూ.600 లక్షలు, నాన్-ట్యాక్స్ ఆదాయం అద్దెల ద్వారా రూ.204.50 లక్షలు, పరిశుభ్రత విభాగం ద్వారా రూ.111.50 లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా రూ.1568.50 లక్షలు, ఇంజినీరింగ్ విభాగం ద్వారా రూ.330.50 లక్షలు ఆదాయం రానుందని వివరించారు.అదనంగా డిపాజిట్లు, రుణాల రూపంలో రూ.110 కోట్లు, నాన్ ప్లాన్ నిధులు రూ.620 లక్షలు, ప్లాన్ నిధులు రూ.5170 లక్షలు, ఇతర నిధులు రూ.240 లక్షలు కలిపి మొత్తం రూ.10730 లక్షల బడ్జెట్ రూపొందించామని తెలిపారు.ఖర్చుల కేటాయింపుల విషయానికి వస్తే సిబ్బంది వేతనాలకు రూ.1420 లక్షలు,పారిశుధ్య నిర్వహణకు రూ.522 లక్షలు, విద్యుత్ చార్జీలకు రూ.344 లక్షలు, రుణాల చెల్లింపులకు రూ.406 లక్షలు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.459 లక్షలు, ఇంజినీరింగ్ విభాగ నిర్వహణకు రూ.445 లక్షలు, సాధారణ పరిపాలనకు రూ.219.20 లక్షలు కేటాయించినట్లు చెప్పారు.పట్టణ ప్రణాళిక విభాగం ఖర్చు కు రూ.7.50 లక్షలు, ప్రజా సౌకర్యాల కోసం రూ.65.73 లక్షలు, అభివృద్ధి పనులకు రూ.445.80 లక్షలు, 1/3 బ్యాలెన్స్ బడ్జెట్‌గా రూ.255.77 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు.డిపాజిట్లు, రుణాలు చెల్లింపులకు 110 లక్షలు కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రానున్న నాన్ ప్లాన్ గ్రాంట్ కింద రూ.620 లక్షలు, ప్లాన్ గ్రాంట్ కింద రూ.2460 లక్షలు, ఇతర నిధుల కింద అభివృద్ధి పనులకు రూ.2950 లక్షలతో మొత్తంగా 10730 లక్షలు కేటాయించడం జరిగిందని వివరించారు.మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం ఎక్కువగా సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు, పరిశుభ్రత, నీటి సరఫరా, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఖర్చవుతుందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో అదనపు ఆదాయ వనరులను గుర్తించడం అత్యవసరమని సూచించారు.పట్టణాభివృద్ధికి ప్రజల



భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఇంటి పన్నులు, నీటి బిల్లులు సమయానికి చెల్లించడం ద్వారా మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.అక్రమ నిర్మాణాలను నియంత్రించడం, మున్సిపాలిటీ ఆస్తులను పరిరక్షించడం ద్వారా కూడా ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు.అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల సమస్యలను చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎండి.షఫీ ఉల్లా, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికే నామినేటెడ్ పదవులు

**నంగునూర్, మార్చి 30 (జనం సాక్షి) :** నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేందుకు కృషి చేస్తున్న నియోజకవర్గ ఇన్చార్జి పై ఆరోపణలు చేయడం సరికాదని నంగునూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ అన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డ కార్యకర్తలకు మార్కెట్ కమిటీలో స్థానం కల్పించిన సందర్భంగా నంగునూర్ మండల పరిధిలోని రాజగోపాల్ పేట ప్రధాన రహదారిపై సోమవారం మండల నాయకులతో కలిసి స్థానిక నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో



రాజగోపాల్ పేట్ సర్పంచ్ లతకృష్ణ, నాయకులు కాటం కనకయ్య,ఎండీ ఇమ్రాన్, రంగు అశోక్ గౌడ్, తిప్పని రాజేష్, జీవన్ నాయక్, శ్యామ్ రెడ్డి, రంగారెడ్డి, సురేందర్ రెడ్డి, నరసింహారెడ్డి ప్రభాకర్, మహేష్, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిందితుడిపై పీడీ యాక్టు నమోదు

**బూర్గంపహాడ్, మార్చి 30 (జనంసాక్షి) :** గంజాయి కేసులో నిందితుడిగా ఉన్న సారపాకకు చెందిన షేక్ మున్వర్ పై బూర్గంపహాడ్ పోలీసులు పీడీ యాక్టు నమోదు చేశారు. పాల్వంచ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సారపాకకు చెందిన షేక్ మున్వర్ 2024, 2025 సంవత్సరాల్లో బూర్గంపహాడ్ పోలీసుస్టేషన్లో రెండు, 2024లో లక్ష్మీదేవిపల్లి పోలీసుస్టేషన్లో ఒకటి, 2024లో ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్లో ఒకటి చొప్పున గంజాయి అక్రమంగా రవాణా చేసినందుకు కేసులు నమోదయ్యాయి. చివరిగా 2025 ఏప్రిల్లో దుండిగల్ పోలీసుస్టేషన్లో 98 కిలోల గంజాయిని సరఫరా చేస్తూ దొరకగా అక్కడ కూడా కేసు నమోదు చేశారు. ఈ ఐదు కేసుల్లో షేక్ మున్వర్ మొత్తం 287 కిలోల గంజాయిని సరఫరా చేస్తూ అక్రమార్జనకు పాల్పడటంతో పీఐటీ ఎన్డీపీఎస్ యాక్టు కోసం పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్కుమార్ సూచనతో పాల్వంచ సీఐ కె.సతీష్ ప్రతిపాదించగా జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షణలో ప్రతిపాదిత ఆధారాలు క్షుణ్ణంగా పరిశీలించి సీఐడి అడిషనల్ డీజీపీ చారుసిన్హాగత ఫిబ్రవరి 16న డిటెన్షన్ ఆర్డర్ (నిర్బంధ ఉత్తర్వులు)ను జారీ చేసి 18న ఆ ఆర్డర్ ప్రతులను షేక్ మున్వర్కు అందించి చర్లపల్లి సెంట్రల్ జైల్కు ఆయన్ను తరలించినట్లు సీఐ తెలిపారు. మార్చి 17న అడ్వైజరీ బోర్డు (సలహా మండలి) షేక్ మున్వర్పై వచ్చిన నిర్బంధ ఉత్తర్వులపై విచారణ జరిపి భౌతిక, సాంకేతిక ఆధారాలను పరిశీలించి పీడీ యాక్టు -సమర్థిస్తూ ఏడాదికాలం చర్లపల్లి జైలులో నిర్బంధించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో ప్రజల ఆరోగ్యమే ప్రధానమని, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపే గంజాయి వంటి మాదక ద్రవ్యాలను సేవించినా, రవాణా చేసినా ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని, వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీడీ యాక్టులు నమోదు చేయడం జరుగుతుందని, అంతేకాకుండా పట్టుబడిన నిందితులు గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించిన ఆస్తులు కోర్టు ఉత్తర్వులతో జప్తు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## వీరశైవ లింగాయత్ మహిళలు రాజకీయంగా రాణించాలి



**సంగారెడ్డి, మార్చి 30 (జనం సాక్షి) :** వీరశైవ లింగాయత్ మహిళలు రాజకీయంగా రాణించాలని వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహిళ సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, చైర్మన్ లను సంగారెడ్డి లో శాలువా, పూలమాల, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, టిపిసిసి జనరల్ సెక్రెటరీ గిరిజ శెట్కార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ అభినందన సభ, సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ , గ్రామ పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన లింగాయత్ కౌన్సిలర్లకు, సర్పంచులకు గౌరవిస్తూ, ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరశైవ లింగాయత్ మహిళలు రాజకీయంగా ఎదగాలని కోరారు. వార్డు సభ్యుల నుంచి సర్పంచ్, కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీ వరకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధన్న పాటిల్, కోవూరి సంగమేశ్వర్, పి, సంతోష్ పాటిల్ మరెల్లి అడివప్ప, సిహెచ్ రాములు, మహిళ నాయకురాలు అరుణ కౌలాస్ , పట్లోళ్ల అరుణ, గొర్రెగట్టు శారద, భవానీ ప్రసాద్, సుధాకర్, గందిగ రాజు, శంకరప్ప శివకుమార్, అగూర్ శివరాజ్, పి, అశోక్ పి. నాగేశ్వర్, వినోద్ కుమార్, సతీష్, వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా సమస్యలను పరిష్కరించాలి

**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 30 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలో సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని రవి మహల్ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అధ్యక్షతన నిర్వహించిన సూర్యాపేట మున్సిపాలిటీ 2025-26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ సవరణ, 2026-27 ముసాయిదా బడ్జెట్ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.వార్డు స్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా పరిష్కరించడంలో మున్సిపల్ పాలక మండలి బాధ్యత అని అన్నారు.నూతన పాలక మండలి తొలి సమావేశంలోనే రూ.107.32 కోట్లతో బడ్జెట్ రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ బడ్జెట్ లక్ష్యాలకు అనుగుణంగా మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంపొందించుకుని పట్టణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పట్టణంలో పరిశుభ్రత నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టులు, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.మహిళల భద్రత, సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.మున్సిపాలిటీకి రావాల్సిన ఇంటి పన్ను, నల్లా బిల్లులు, ఇతర బకాయిల వసూళ్లలో ప్రజలను చైతన్యపరచి సమయానికి చెల్లించేలా ప్రోత్సహించాలని అన్నారు.అక్రమ భవన నిర్మాణాలను అరికట్టి, మున్సిపాలిటీకి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మున్సిపాలిటీ ఆస్తులను పరిరక్షించడంపై దృష్టి సారించాలని అన్నారు.గతంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో సూర్యాపేట మున్సిపాలిటీ సాధించిన గుర్తింపును తిరిగి సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ




కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, వైస్ ఛైర్మన్ ఎండీ.షఫీ ఉల్లా, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్కార్' వేలం గందరగోళం

- **ఏప్రిల్ 2వ తేదీకి సంత వేలం వాయిదా..**

బూర్గంపహాడ్, మార్చి 30 (జనంసాక్షి) : బూర్గంపహాడ్ మండలం మోరంపల్లిబంజర గ్రామపంచాయతీలో 2026-27 సంవత్సరానికి గాను వారాంతపు సంత, పశువుల సంతకు సంబంధించి సోమవారం నిర్వహించిన సర్కార్ సంత వేలంపాట గందరగోళంగా దారితీసింది. తొలుత ఎంపీడీవో జమలారెడ్డి సంత వేలంపాటకు సంబంధించిన ప్రభుత్వ మద్దతు ధర రూ.34 లక్షలుగా నిర్ధారించి వేలంను నిర్వహించారు. వేలంపాట సమయంలో కొందరు వ్యాపారులు సంత నిర్వహించిన సమయంలో అధిక ధరలు వసూలు చేశారని అభ్యంతరం తెలిపారు. దీనికి అధికారులు వ్యాపారులకు సర్దిచెప్పి ఈసారి అలా జరగకుండా చూస్తామని చెప్పి తిరిగి వేలంపాటను నిర్వహించారు. ఈ వేలంపాటలో ఏడుగురు పాటదారులు పాల్గొన్నారు. మధ్యాహ్నం సమయానికి 33.81 లక్షలకు పాటదారుడు వేలం పాడగా అధికారులు మూడవసారి అని చెప్పి వెంటనే ప్రభుత్వ మద్దతు ధర రాలేదని మళ్లీ తిరిగి సాయంత్రం 3 గంటలకు పాట కొనసాగుతుందని చెప్పి వేలంపాటను అర్ధాంతరంగా ముగించారు. తిరిగి వేలంపాటను నిర్వహించగా పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో పాటు ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో చివరకు వేలంపాటను ఏప్రిల్ 2వ తేదీకి వాయిదా వేశారు. మొదటి నుంచి చివరి వరకు వేలంపాట



రసాభాసగానే సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉపసర్పంచ్ పొక్కుల రవి, సారపాక, మోరంపల్లిబంజర్, సోంపల్లి కార్యదర్శులు కంది మహేష్, భవానీ, వెంకటేష్, పాటదారులు బానోత్ రవీందర్, తేజావత్ విద్యాసాగర్, రాసా శ్రీను, కల్తీ స్వామి, భూక్యా రంజిత్నాయక్, కణితి జొర్రా కృష్ణ, గుగులోత్ కిషనానాయక్ పాల్గొన్నారు.

### సారపాక సంత వేలం ధర రూ.7.25 లక్షలు...

మండల పరిధిలోని సారపాక గ్రామపంచాయతీల్లో సర్పంచ్ కిషోర్నాయక్ అధ్యక్షతన వారాంతపు సంత వేలంపాటను సోమవారం అధికారులు నిర్వహించారు. ఈ సంత వేలంలో గత ఏడాది కంటే రికార్డు ధర పలికింది. గతంలో భూక్యా కృష్ణకుమార్ రూ.6.17 లక్షలకు సంత వేలం దక్కించుకోగా ఈ ఏడాది ధారావత్ మమత లక్ష అదనంగా రూ.7.25లక్షలకు సంత వేలంపాటను దక్కించుకున్నారు. సంత వేలంలో 8 మంది పాటదారుల నుంచి పోటీ పెరగడంతో ఈ ఆదాయం లభించిందని తెలిపారు. ప్రస్తుతం సంత స్థలాన్ని జాతీయ రహదారి పక్కనే వరుణ్ మోటర్స్ సమీపంలోకి మార్చడంతో ఇబ్బందులు తలెత్తవని సర్పంచ్ కిషోర్ అన్నారు. సంత వేలంపాటలో భాగంగా కూరగాయల సంతతో పాటు పశువుల సంత ఏర్పాటు చేయాలని ఈవో మహేష్ ప్రతిపాదించగా ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో త్వరలో పశువుల సంత ఏర్పాటుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని పశువుల సంతను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ వేలంపాటలో ఈవో మహేష్తో పాటు వేలంపాటదారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

### బూర్గంపహాడ్ సంత వేలం రూ.3లక్షలు..


మండల కేంద్రమైన బూర్గంపహాడ్లో వారాంతపు సంతకు సంబంధించి బూర్గంపహాడ్, పినపాక పట్టీనగర్ కార్యదర్శులు బర్ల ప్రభాకర్, విజయు సోమవారం వేలంపాట నిర్వహించారు. వారాంతపు సంత వేలంతో పాటు మూడు షాపులకు వేలం నిర్వహించారు. సంత వేలానికి సంబంధించి ఐదుగురు పాటదారులు పోటీపడగా జక్కం నాగేశ్వరరావు రూ. 3లక్షలకు దక్కించుకోగా గత ఏడాది జక్కం శ్రీనివాసరావు రూ.2.54 లక్షలకు సంతను దక్కించుకోగా ఈ ఏడాది రూ.44వేలు అదనపు ఆదాయం వచ్చింది. అయితే మూడు షాపులకు సంబంధించి ఎవరూ ఆసక్తి చూపకోవడంతో షాపుల వేలం ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా వేశారు. ఈ సంత వేలం సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్నల సమక్షంలో నిర్వహించారు.

## జవహర్‌నగర్‌లో ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలి




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 30 (జనంసాక్షి) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్-1, జవహర్‌నగర్ డివిజన్ - 3లో బాలాజీ నగర్ అడ్డా వద్ద భవన నిర్మాణ మరియు హమాలి కార్మికులకు ఐదు రూపాయల భోజనం పథకం (ఇందిరమ్మ క్యాంటీన్) ఏర్పాటు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంతకు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చింతకింది అశోక్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ అడ్డా కార్మికులకు రోజువారీ ఉపాధి దొరకడం కష్టమైపోయిందని, అనేక మంది కార్మికులు అర్ధకలితో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్‌నగర్, బాలాజీ నగర్ అడ్డా ప్రాంతంలో సుమారు 300 మందికి పైగా కార్మికులు ఉపాధి కోసం రోజూ అడ్డాల వద్ద వేచి చూస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఐదు రూపాయల భోజనం పథకాన్ని అక్కడ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత, వీలైనంత త్వరలో ఇందిరమ్మ క్యాంటీన్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు, నాయకులు నగేష్, శివన్నారాయణ, కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
31 మార్చి 2026






# రూపాయి ధమాల్

- చరిత్రలోనే అత్యంత దిగువ స్థాయికి రూపాయి
- పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతలు, ఆయిల్ ధరల పెరుగుదలతో భారీ పతనం
- ఒక్క నెలలోనే 4.4 శాతం క్షీణత - రికార్డు స్థాయి దిగజారుదల
- స్టాక్ మార్కెట్ కూడా భారీ నష్టాల్లో - నిఫ్టీ 488 పాయింట్లు పడిపోయింది

## 95.45 స్థాయికి పడిపోయిన రూపాయి

**ముంబై, మార్చి 30 (జనంసాక్షి) :**
భారత రూపాయి విలువ అమెరికన్ డాలర్‌తో పోలిస్తే చరిత్రలోనే అత్యంత దిగువ స్థాయికి చేరుకుంది. సోమవారం ట్రేడింగ్‌లో రూపాయి విలువ ఏకంగా 95.45 స్థాయికి పడిపోయి కొత్త రికార్డు కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఇంట్రాడేలో రూపాయి 95.22 వద్ద కనిష్ఠాన్ని తాకింది. పశ్చిమాసియాలో (యూఎస్-ఇరాన్) యుద్ధ ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి రూపాయి విలువ వేగంగా క్షీణిస్తోంది. ఈ మార్చి నెలలోనే రూపాయి దాదాపు 4.4 శాతం క్షీణించింది. మార్చి 27న 94.82 వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి, సోమవారం మళ్లీ 95 మార్కును దాటి కొత్త రికార్డు సృష్టించింది.

పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల వల్ల బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 115 డాలర్ల వరకు పెరిగింది. భారత్ చమురు దిగుమతుల బిల్లు భారీగా పెరగడం, విదేశీ పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐ) భారత మార్కెట్ల నుంచి డబ్బు ఉపసంహరించుకోవడం, ఎగుమతులు బలహీనపడటం వల్ల కరెంట్ ఖాతా లోటు పెరగడం వంటి కారణాలు రూపాయి పతనానికి దారితీశాయి.

రూపాయి మరింత పడిపోకుండా ఉండటానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కఠిన చర్యలు తీసుకుంది. బ్యాంకులు విదేశీ మారక మార్కెట్‌లో ఉంచుకునే నికర ఓపెన్ పొజిషన్లపై కొత్త పరిమితులు విధించింది. ఏప్రిల్ 10 నుంచి అమలులోకి వచ్చే ఈ నిబంధనల ప్రకారం బ్యాంకులు రోజువారీ 100 మిలియన్ డాలర్ల వరకే ఓపెన్ పొజిషన్లు ఉంచుకోవాలి. ఆర్బిట్రేజ్ ట్రేడ్‌లను అరికట్టడం లక్ష్యంగా ఈ చర్యలు తీసుకోబడ్డాయి.

రూపాయి పతనంతో పాటు ఈరోజు స్టాక్ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 488 పాయింట్లు నష్టపోయి 22,331 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 1,635 పాయింట్లు కోల్పోయి 71,947 వద్ద ట్రేడ్ అయింది. నిపుణులు రూపాయి పతనం ఇంకా కొంత కాలం కొనసాగే అవకాశం ఉందని, చమురు ధరలు తగ్గకపోతే లేదా విదేశీ పెట్టుబడులు తిరిగి రాకపోతే ఒత్తిడి మరింత పెరగవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర సవాలుగా మారుతోందని వారు అభిప్రాయపడుతున్నారు.

**రూపాయి చరిత్రలోని ప్రధాన పతనాలు**
భారత రూపాయి 1947 స్వాతంత్ర్యం నుంచి ఇప్పటి వరకు అమెరికన్ డాలర్‌తో పోలిస్తే స్థిరంగా క్షీణించింది. 1947లో 1 డాలర్ = రూ.3.30 ఉండగా, 2026 మార్చి 30న రూ.95.45 వరకు పడిపోయి కొత్త రికార్డు కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఇది స్వాతంత్ర్యం తర్వాత రూపాయి అత్యంత దారుణమైన పతనం.

**రూపాయి ప్రధాన పతనాలు (కీలక సంవత్సరాలు):**
1947: రూ.3.30 (స్వాతంత్ర్య సమయంలో)
1966: రూ.7.50 (మొదటి పెద్ద డీవాల్యుయేషన్)
1991: రూ.17-25 (ఆర్థిక సంక్షోభం)
2008: రూ.50-52 (ప్రపంచ ఆర్థిక సంక్షోభం)
2013: రూ.68 వరకు (అత్యంత తీవ్రమైన పతనం)
2020: రూ.76-77 (కోవిడ్ మహమ్మారి)
2022: రూ.80-83 (రష్యా-ఉక్రెయిన్ యుద్ధం)
2026 మార్చి: రూ.95.45 (పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతలు)

1947 నుంచి 2026 వరకు రూపాయి సుమారు 29 రెట్లు (రూ.3.30 ⟶ రూ.95.45) క్షీణించింది. ప్రస్తుత పతనం ప్రధానంగా యుద్ధం, ఆయిల్ ధరలు, ఎఫ్ఐఐ ఔట్‌ఫ్లోల వల్ల వచ్చింది. ఆర్బీఐ ఇప్పటికే కఠిన చర్యలు తీసుకుంటోంది కానీ, గ్లోబల్ ఉద్రిక్తతలు తగ్గకపోతే రూపాయి మరింత ఒత్తిడికి లోనవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# స్వల్పంగా తగ్గిన పసిడి రేట్లు



**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :**
పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదారులకు అద్భుతమైన రిటర్న్ ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది. యుద్ధం మొదలవ్వడానికి ముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.90 లక్షల రూపాయల వరకు వెళ్లింది. యుద్ధం మొదలవ్వగానే బంగారం ధరలు ధమాల్ అని పడిపోయాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,48,090 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,750 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,11,070 దగ్గర ట్రేడ్ అయింది. సోమవారం 24 క్యారెట్‌పై 810 రూపాయలు.. 22 క్యారెట్‌పై 750 రూపాయలు.. 18 క్యారెట్‌పై 610 రూపాయలు తగ్గింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,47,280 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,000 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,10,460 దగ్గర ట్రేడ్ అవుతోంది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
| --- | --- | --- |
| హైదరాబాద్ | ₹ 380 | ₹ 45.60 |
| వరంగల్ | ₹ 382 | ₹45.84 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్
₹1,47,028 (24 క్యారెట్లు) | ₹1,35,750 (22 క్యారెట్లు)
చెన్నై
₹1,36,600 (22 క్యారెట్లు) | ₹1,43,430 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹2,45,000

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్

## సెన్సెక్స్ 1,635, నిఫ్టీ 488 పాయింట్లు పడిపోయాయి

- పశ్చిమాసియా యుద్ధం.. చమురు ధరల భగభగ
- మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9 లక్షల కోట్లు నష్టం
- ఆర్థిక సంవత్సరం చివరి రోజు నష్టాల్లో ముగిసింది

**ముంబై, మార్చి 30 (జనంసాక్షి) :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రతరం అవుతుందన్న భయాలు, చమురు ధరల భగభగలు, ఇరాన్‌కు మద్దతుగా హూతీ గ్రూప్ రంగంలోకి దిగడం వంటి పరిణామాలు మదుపరుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ 1,635.67 పాయింట్లు (2.22 శాతం) నష్టపోయి 71,947.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 488.20 పాయింట్లు (2.14 శాతం) పడి 22,331. 40 వద్ద స్థిరపడింది. మదుపర్ల సంపదగా భావించే నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9 లక్షల కోట్లు క్షీణించి రూ.412 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 72,565.22 వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 71,774.13 వద్ద కనిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 22,250 దిగువకు వెళ్లి చివరికి 22,331.40 వద్ద ముగిసింది.

**ప్రధాన నష్టపోయిన స్టాకులు:**
బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్ స్టాకులు ప్రధానంగా నష్టపోయాయి. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ మినహా మిగిలిన అన్నీ నష్టాల్లో ముగిశాయి.

**కారణాలు:**
- పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రం కావొచ్చన్న భయాలు
- అమెరికా ఇరాన్‌పై భూతల దాడికి సిద్ధమవుతోందన్న వార్తలు




- ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఖర్ గాలిబాఫ్ హెచ్చరికలు
- హూతీ రెబెల్స్ ఎర్ర సముద్రంలో మళ్లీ నౌకలపై దాడులు చేస్తారేమోనన్న ఆందోళన
- బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 115.9 డాలర్ల వరకు పెరగడం
- ఎఫ్ఐఐల నిరంతర విక్రయాలు (శుక్రవారం ఒక్కరోజే రూ.4,367 కోట్లు విక్రయాలు)
- డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.94 వద్ద ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు కూడా మన మార్కెట్‌పై ఒత్తిడి పెంచాయి.

మహావీర్ జయంతి సందర్భంగా రేపు (మార్చి 31) స్టాక్ ఎక్స్ఛేంజీలు పని చేయవు. ఆర్థిక సంవత్సరం చివరి రోజున సూచీలు భారీ నష్టాల్లో ముగియడం మదుపరులకు నిరాశ కలిగించింది.
మార్కెట్ నిపుణులు యుద్ధ ఉద్రిక్తతలు తగ్గకపోతే మరిన్ని నష్టాలు ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారు.

## బ్యాంకు లాకర్లలోని వస్తువులకు
# బీమా కవరేజీ ఇవ్వడం సాధ్యం కాదు

- లాకర్లను బ్యాంకులు తనిఖీ చేయలేరని నిర్మలా సీతారామన్ స్పష్టం
- విలువ ఆధారంగా పరిహారం అందించడం అసాధ్యం
- దొంగతనం, అగ్నిప్రమాదం సందర్భాల్లో మాత్రమే 100 రెట్లు అద్దె పరిహారం
- కొత్త బీమా ప్రతిపాదనలు పరిశీలనలో లేవు



**న్యూఢిల్లీ, మార్చి 30 (జనంసాక్షి) :** బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన వస్తువులకు విలువ ఆధారంగా బీమా కవరేజీ అందించడం సాధ్యం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.
లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లాకర్లలోని వస్తువుల బీమా అంశాన్ని లేవనెత్తగా, మంత్రి స్పందించారు. "లాకర్లలో ఉంచిన వస్తువులను బ్యాంకు అధికారులు చూడలేరు, తనిఖీ చేయలేరు. వాటిని రికార్డు చేయడం కూడా సాధ్యం కాదు. అందువల్ల వస్తువుల విలువ ఆధారంగా బీమా కవరేజీ అందించడం సాధ్యం కాదు" అని ఆమె తేల్చి చెప్పారు.
నిర్మలా సీతారామన్ మరింత వివరిస్తూ, "బ్యాంకు లాకర్లలోని వస్తువులను బ్యాంకు సిబ్బంది తనిఖీ చేయడం బ్యాంకు నిబంధనలకు విరుద్ధం. ఆర్బీఐ నియమాల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో మాత్రమే నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తారు. ఆ సమయంలో లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారం చెల్లిస్తారు" అని గుర్తు చేశారు.
ప్రస్తుతానికి లాకర్లలోని వస్తువులకు సంబంధించి కొత్త బీమా కవరేజీ ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని మంత్రి స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు బ్యాంకు లాకర్లు ఉపయోగించే లక్షలాది మంది మదుపరులు, సామాన్యుల్లో చర్చనీయాంశమవుతున్నాయి. లాకర్లలో విలువైన బంగారం, వజ్రాలు, ముఖ్యమైన పత్రాలు ఉంచేవారు ఇప్పటికే బీమా సౌకర్యం కోసం ఆశలు పెట్టుకున్న నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ఆశాభంగం కలిగించాయి.

# వోల్టాస్‌కు కస్టమ్స్ డిమాండ్ నోటీసు

- దిగుమతి వివరాలు తప్పుగా వెల్లడించినట్లు ఆరోపణ
- రూ.10.76 కోట్ల డ్యూటీ, రూ.12.76 కోట్ల జరిమానా
- నోటీసును ఖండిస్తూ ట్రైబ్యునల్‌లో సవాలు చేస్తాం : వోల్టాస్




**ముంబై, మార్చి 30 (జనంసాక్షి) :** ప్రముఖ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ వోల్టాస్‌కు కస్టమ్స్ విభాగం భారీ డిమాండ్ నోటీసు జారీ చేసింది. 2019 జూన్ నుంచి 2022 జులై మధ్య కాలంలో దిగుమతి చేసుకున్న వస్తువుల వివరాలను తప్పుగా వెల్లడించినట్లు ఆరోపిస్తూ రూ.23.52 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఇందులో రూ.10.76 కోట్ల కస్టమ్స్ డ్యూటీ, రూ.12.76 కోట్ల జరిమానా ఉన్నాయి. వోల్టాస్ కంపెనీ ఈ నోటీసును ఖండిస్తూ, సంబంధిత ట్రైబ్యునల్‌లో సవాలు చేస్తామని స్పష్టం చేసింది. కంపెనీ ఒక ప్రకటనలో "ఈ ఉత్తర్వులు మా ఆర్థిక స్థితి లేదా నిర్మాణ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపవని" తెలిపింది. వోల్టాస్ టాటా గ్రూప్‌కు చెందిన సంస్థ. 1954లో స్థాపించబడిన ఈ కంపెనీ ఏసీలు, వాటర్ కూలర్లు, కమర్షియల్ రిఫ్రిజిరేటర్లు తయారు చేస్తోంది. ఈ డిమాండ్ నోటీసు వోల్టాస్ షేర్లపై సోమవారం మార్కెట్‌లో ప్రతికూల ప్రభావం చూపింది. ఈ అంశంపై వోల్టాస్ మరిన్ని వివరాలు ఇవ్వాలని భావిస్తోంది. కస్టమ్స్ అధికారులు ఇచ్చిన నోటీసుకు వ్యతిరేకంగా కంపెనీ లీగల్ రూట్‌లో ముందుకు వెళ్లనుంది.

## ఏప్రిల్ 1 నుంచి జెఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ కార్ల 2 శాతం ధరల పెంపు

### ఎంజీ ఎం9, సైబర్‌స్టార్ వంటి ప్రీమియం మోడళ్లు మినహాయింపు

దిల్లీ, మార్చి 30: ప్రముఖ కార్ల తయారీ సంస్థ జెఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఏప్రిల్ 1 నుంచి తన ఎంపిక చేసిన మోడళ్ల ధరలను 2 శాతం పెంచనుంది. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో ఈ ధరల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ పెంపు ఎంజీ మెయిన్‌లైన్ పోర్ట్‌ఫోలియోలోని మోడళ్లకు మాత్రమే వర్తిస్తుంది. ఎంజీ సెలెక్ట్ ఛానెల్ ద్వారా విక్రయించే ప్రీమియం మోడళ్లైన ఎంజీ ఎం9 మరియు సైబర్‌స్టార్ను ఈ ధరల పెంపు నుంచి మినహాయించారు. ప్రస్తుతం జెఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ (ఐసిఈ) మరియు ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవి)ను విక్రయిస్తోంది. ఈ కార్ల ధరలు రూ.4.99 లక్షల నుంచి రూ.38.33 లక్షల వరకు ఉన్నాయి. ఇప్పటికే టాటా మోటార్స్‌తో పాటు ఆడి, బీఎండబ్ల్యూ, మెర్సిడెస్-బెంజ్ వంటి లగ్జరీ కార్ల తయారీ సంస్థలు కూడా ఏప్రిల్ 1 నుంచి ధరలు పెంచనున్నట్లు ప్రకటించాయి. ఈ ధరల పెంపు వినియోగదారులపై అదనపు భారం మోపనుంది. ఉత్పత్తి వ్యయాలు (ముడి పదార్థాలు, లాజిస్టిక్స్) పెరగడం వల్ల కంపెనీలు ఈ నిర్ణయం తీసుకుంటున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

# సిమ్ బైండింగ్ గడువు డిసెంబర్ వరకు పొడిగింపు?

## వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్ యాప్లకు సాంకేతిక సవాళ్లు



**న్యూఢిల్లీ, మార్చి 30 (జనంసాక్షి) :** వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి మెసేజింగ్ యాప్లకు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనల అమలు గడువును డిసెంబర్ వరకు పొడిగించాలని కేంద్రం భావిస్తోంది. గతేడాది నవంబర్‌లో కేంద్రం ఈ నిబంధనలను తీసుకొచ్చి 90 రోజుల గడువు ఇచ్చింది. అయితే టెక్ కంపెనీలు సాంకేతిక సవాళ్లు (టెస్టింగ్, ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్స్) ఎదుర్కొంటున్నట్లు కేంద్ర దృష్టికి తీసుకొచ్చాయి. ఈ సవాళ్లను అధిగమించి నిబంధనలను సరిగ్గా అమలు చేయడానికి మరికొంత సమయం కావాలని ఆయా సంస్థలు అభ్యర్థించాయి.
టెలికాం విభాగానికి చెందిన ఉన్నతాధికారులను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా సంస్థలు ప్రచురించిన కథనాల ప్రకారం, కేంద్రం డిసెంబర్ వరకు గడువు పొడిగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సిమ్ బైండింగ్ అంటే ఆయా మెసేజింగ్ యాప్‌లు సిమ్ కార్డ్ లేకుండా పని చేయకుండా చేయడం. ఇది స్పూఫింగ్, ఫేక్ అకౌంట్లు, మిస్‌యూజ్‌ను నియంత్రించడం లక్ష్యంగా ప్రతిపాదించబడింది. ప్రస్తుతం ఈ అంశంపై టెక్ కంపెనీలు, యూజర్లు, ఆర్బీఐ, టెలికాం శాఖ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. అధికారిక నోటిఫికేషన్ వెలువడిన తర్వాత మాత్రమే స్పష్టమైన చిత్రం అందుబాటులోకి వస్తుంది.

# బిట్‌కాయిన్ 66,500 డాలర్లకు దిగివచ్చింది

- 200 రోజులు, ఏడాది సగటు స్థాయిలను కోల్పోయింది
- రాబోయే వారంలో 68,000 డాలర్ల వరకు పుంజుకునే అవకాశం



**న్యూఢిల్లీ/ముంబై, మార్చి 30 (జనంసాక్షి) :** గత కొన్ని ట్రేడింగ్ రోజులుగా బలహీనంగా కదలాడుతున్న క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ మరింత తగ్గి 66,500 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. ట్రేడర్లు, విశ్లేషకులు ఇది 200 రోజుల చలన సగటు మరియు ఏడాది వ్యవధిలో ఇదే తేదీ సగటు స్థాయిలను కోల్పోయినట్లు పేర్కొన్నారు. ఈ స్థాయిలను కోల్పోవడం సమీపకాలంలో బిట్‌కాయిన్ విలువ మరింత దిగిరావొచ్చనే సంకేతాన్ని ఇస్తోందని వారు విశ్లేషిస్తున్నారు.
బిట్‌కాయిన్ విలువ తగ్గడానికి మదుపర్ల భయాందోళనలు ప్రధాన కారణం కాకపోవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే కీలక స్థాయిలను కోల్పోవడం వల్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అంతర్లీన డిమాండ్ బలంగా ఉండటం వల్ల రాబోయే వారంలో 68,000 డాలర్ల వరకు పుంజుకునే అవకాశం కూడా ఉందని కొందరు విశ్లేషకులు అంటున్నారు. పశ్చిమాసియాలోని యుద్ధ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో బిట్‌కాయిన్ విలువ హెచ్చుతగ్గులకు లోనవుతోంది. గతేడాది అక్టోబరు 6న బిట్‌కాయిన్ రికార్డు స్థాయిలో 1,26,272 డాలర్ల విలువను తాకిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మార్కెట్ సెంటిమెంట్ జాగ్రత్తగా ఉంది. యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రమైతే బిట్‌కాయిన్ మరింత దిగువకు వెళ్లే అవకాశం ఉందని, అయితే సానుకూల అంతర్జాతీయ పరిణామాలు వస్తే త్వరగా రికవరీ అయ్యే అవకాశం కూడా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.



# ఇళ్ల అమ్మకాలకూ యుద్ధ గండం

**పశ్చిమాసియా సంక్షోభం భారత స్థిరాస్తి రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది**

- ఏడు ప్రధాన నగరాల్లో 7% క్షీణించిన గృహ విక్రయాలు
- ఒక త్రైమాసికంలోనే రూ.9,000 కోట్ల నష్టం
- వార్షికంగా మాత్రం 9% వృద్ధి - దీర్ఘకాలిక ఆశలు



**న్యూఢిల్లీ, మార్చి 30:** పశ్చిమాసియాలోని యుద్ధ ఉద్రిక్తతలు భారత స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) రంగంపై స్పష్టమైన ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది జనవరి-మార్చి (జనవరి త్రైమాసికం) మధ్య కాలంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో గృహ విక్రయాలు గత డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే 7 శాతం క్షీణించాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ అనరాక్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో 1,08,970 యూనిట్లు అమ్ముడవగా, జనవరి-మార్చి త్రైమాసికంలో అమ్మకాలు 1,01,675 యూనిట్లకు పరిమితమయ్యాయి. విలువ పరంగా కూడా 6 శాతం క్షీణత నమోదై రూ.1.60 లక్షల కోట్ల నుంచి రూ.1.51 లక్షల కోట్లకు తగ్గింది. అయితే గత ఏడాది ఇదే కాలంతో (జనవరి-మార్చి 2025) పోలిస్తే గృహ అమ్మకాలు 9 శాతం పెరిగాయి. గత ఏడాది 93,280 యూనిట్లు అమ్ముడైతే ఈ ఏడాది 1,01,675 యూనిట్లు అమ్ముడయ్యాయి. విలువ పరంగా కూడా 6 శాతం వృద్ధి నమోదైంది. అనరాక్ గ్రూప్ ఛైర్మన్ అనుజ్ పురి మాట్లాడుతూ, "పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరగడం, నిర్మాణ వ్యయాలు భారమవడం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. కొనుగోలుదారులు ప్రస్తుతం 'వేచి చూసే' ధోరణిని అవలంబించారు" అన్నారు. పశ్చిమాసియా ప్రాంతాల నుంచి భారత రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే కొనుగోలుదారులు యుద్ధ భయంతో కొనుగోళ్లకు విరామం ఇచ్చారని ఆయన తెలిపారు. అయినప్పటికీ దీర్ఘకాలికంగా నివాస గృహాల విభాగంలో ఫండమెంటల్స్ బలంగానే ఉన్నాయని అనుజ్ పురి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నివేదిక రియల్ ఎస్టేట్ రంగంలో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితిని స్పష్టంగా చూపిస్తోంది. యుద్ధ ఉద్రిక్తతలు తగ్గిన తర్వాత మార్కెట్ రికవరీ అయ్యే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# పరకాలలో నాలుగో ప్రత్యేక గోల్డ్‌లోన్ బ్రాంచ్

## ప్రారంభించిన ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్

భారతదేశంలో అతిపెద్ద స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా, అలాగే పదేళ్లకు పైగా వ్యవధి తర్వాత యూనివర్సల్ బ్యాంక్‌గా మారేందుకు ఇన్-ప్రిన్సిపల్ ఆమోదం పొందిన తొలి బ్యాంక్‌గా నిలిచిన ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఏయూ ఎస్ఎఫ్ బి), తెలంగాణ రాష్ట్రంలో పరకాలలో తన నాలుగో ప్రత్యేక గోల్డ్ లోన్ బ్రాంచ్‌ను ప్రారంభించింది. ఇదే నెలలో, బ్యాంక్ హుజురాబాద్, ఖమ్మం, వేములవాడలో మూడు ఇటువంటి బ్రాంచ్‌లను ఇప్పటికే ప్రారంభించింది. ఈ విస్తరణ ఏయూ ఎస్ఎఫ్ బి దక్షిణ భారతదేశంలో సెక్యూర్డ్ లెండింగ్ ఉనికిని మరింత బలోపేతం చేస్తోంది మరియు ఇటీవల గుజరాత్‌లోని జామ్‌నగర్, జునాగఢ్‌లలో ప్రత్యేక గోల్డ్ లోన్ బ్రాంచ్‌ల ప్రారంభంతో అనుసంధానమై ఉంది. తెలంగాణ బ్యాంక్‌లకు కీలక మార్కెట్‌గా పరిగణించబడుతోంది. రాష్ట్రంలో బంగారం యాజమాన్యం



అధికంగా ఉండటం, చురుకైన స్థానిక ఆర్థిక వ్యవస్థలు, అలాగే అధికారిక గోల్డ్-బ్యాక్డ్ రుణాలకు ఉన్న పెరుగుతున్న డిమాండ్ ఈ అవకాశాన్ని నడిపిస్తున్నాయి. పరిశ్రమ నివేదిక (జనవరి 2026) ప్రకారం, భారతదేశ గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో రూ. 15.6 లక్షల కోట్లు కాగా, టాప్ 10 రాష్ట్రాలు - తెలంగాణ సహా మొత్తం పోర్ట్‌ఫోలియోలో 90.8% వాటాను కలిగి ఉన్నాయి.

ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిప్యూటీ సీఈఓ ఉత్తమ్ తిబ్రేవాల్ మాట్లాడుతూ, "సమయానికి, నమ్మదగిన క్రెడిట్‌కు ప్రాప్తి గ్రామీణ, అర్బన్ భారతదేశానికి కీలక అవసరం. కుటుంబాలు నమ్మే ఆస్తి, బంగారంను ఉపయోగించి అధికారిక ఆర్థిక సేవలకు ప్రాప్యతను మరింత సులభతరం చేయడానికి మా ప్రత్యేక గోల్డ్ లోన్ బ్రాంచ్‌లను ప్రవేశపెడుతున్నాము. పరకాల బ్రాంచ్, పారదర్శకమైన, భద్రమైన, కస్టమర్-కేంద్రీకృత విధానంతో క్రెడిట్ లోటును పూరించే మా కట్టుబాటును ప్రతిబింబిస్తోంది. అభివృద్ధి చెందుతున్న, అధిక అవకాశాలున్న మార్కెట్లలో మా ఉనికిని బలోపేతం చేస్తోంది" అని తెలిపారు. తోడుగా, తెలంగాణ సెక్యూర్డ్ లెండింగ్‌లో కీలక మార్కెట్‌గా ఎదుగుతున్న నేపథ్యంలో ఏయూ ఎస్ఎఫ్ బి మార్చి 31, 2026 నాటికి తమిళనాడు, కర్ణాటక మరియు మహారాష్ట్రలో తన గోల్డ్ లోన్ బ్రాంచ్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించే ప్రణాళికలు రూపొందిస్తోంది.

### ఏప్రిల్ 2 నుండి నిర్వహించే

# గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో, ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ సభలు, వార్డు , మున్సిపల్ సభల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. గ్రామ సభలు, మున్సిపల్ సభలను పండుగ వాతావరణంలో నిర్వహిం చడంతో పాటు ప్రజలు, ప్రజా ప్రతినిధులు చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణపై నివేదికలను సిద్ధం చేసి గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలని, ప్రజా ప్రతినిధులకు ముందస్తుగా ఆహ్వానాలు పంపించాలని ఆదేశించారు. గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులు తదితర వివరాలను గ్రామ సభల సందర్భంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం సేకరణ, రైతులకు 500 బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 సిలిండర్ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను కరదీపికల రూపంలో తయారు చేసి సభకు వచ్చే ప్రతి ఒక్కరికి అందజేయాలని, అలాగే అర్జీలు స్వీకరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, గ్రామ సభలకు ప్రజలు అధికంగా హాజరయ్యేలా రెండు రోజుల ముందుగానే ప్రచారం నిర్వహించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు టెంట్లు, షామియానాలు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, మినిట్ టు మినిట్ కార్యక్రమ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు ఏర్పాట్లపై ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

# గ్రామ/వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్ బ్యూరో, (జనంసాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 02వ తేదీన గ్రామ పంచాయతీలలో నిర్వహించనున్న గ్రామ సభలు, మున్సిపాలిటీలలో నిర్వహించనున్న వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి అనంతరం అధికారులకు పలు అంశాలపై కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ముందస్తుగానే గ్రామ/వార్డు సభల వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని, పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. గ్రామ సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 7.30 నుండి 10.30 గంటల లోపు సభలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు, ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్దిదారులతో అనుభవాలను తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా గ్రామ/వార్డు సభల విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఇదిలాఉండగా, పదవ తరగతి పరీక్షా కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసిల్దార్లకు కలెక్టర్ సూచించారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సాఫీగా జరిగేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, డీఆర్డీఓ సాయాగౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్‌లో ఉచిత అంబలి పంపిణీని ప్రారంభించిన కలెక్టర్**

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ప్రారంభిం చారు. వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు వీలుగా తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమని టీఎన్జీఓ సంఘాన్ని అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీఓ ప్రతినిధులు కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌కు సీబీసీఐడీపై

# నమ్మకం లేకపోవడం శోచనీయం

**శాసన మండలిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**మంథని, (జనంసాక్షి) :** 2014 నుంచి జరిగిన మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ చేయిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. అయినా... హౌజ్ కమిటీ పేరిట మండలిలో కూడా బీఆర్ఎస్ సభ్యులు రాజకీయం చేయడం సిగ్గుచేటు అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఫైర్ అయ్యారు. శాసన మండలి సమావేశాల్లో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సభా నిర్వహణలో ఛైర్మన్ కి సహకరించాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉంటుందన్నారు. ఛైర్ ను డిక్టేట్ చేసేలా వ్యవహరించడం తగదన్నారు. బీఆర్ఎస్ సభ్యుల అప్రజాస్వామిక తీరు సరి కాదని, ప్రతి విషయాన్ని ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని మర్చిపోవద్దని హెచ్చరించారు. ఇది పెద్దల సభ.. తమ రాజకీయాల కోసం సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం సరి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2014 – 18 మధ్య బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు హౌజ్ కమిటీ లను వేశారే తప్ప .. కమిటీ ఛైర్మన్ సమావేశం పెట్టింది లేదు.. నివేదికలు, రిపోర్టులు ఇచ్చింది లేదన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ కు సీబీసీఐడీపై నమ్మకం లేకపోవడం శోచనీయం అని అన్నారు.

# కమిషనరేట్‌లో సిపిఆర్‌పై శిక్షణ

**మెడికవర్ ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరం**




**కరీంనగర్ బ్యూరో, (జనంసాక్షి) :** కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం రోజు కరీంనగర్ జిల్లా కమిషనరేట్‌లో సిపిఆర్‌పై పోలీసులకు, రాపిడో నిర్వహకు లకు శిక్షణ అందించారు. ఎవరైనా హార్ట్ ఎటాక్ గురైతే అత్యవసర పరిస్థితిలో సిపిఆర్ ఎలా చేయాలనే ఆందోళన ఉంటుందని, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఉండేం దుకే ఈ సిపిఆర్ శిక్షణ ఇస్తున్నట్లు ఆస్పత్రి వైద్యులు వెల్లడిం చారు. సిపిఆర్ నేర్చుకోవడం వల్ల ఒక మనిషిని ప్రాణా పాయం నుంచి కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సిపిఆర్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఆర్ పై అవగాహన ఉంటే కార్డియాక్ అరెస్ట్ కు గురైన వ్యక్తిని ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాణాపాయం నుండి కాపాడే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం పోలీసులు, వారి కుటుంబాలకు, రాపిడో నిర్వా హకులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిర ంలో 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. మెడికవర్ ఆస్పత్రికి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేష్ , నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, సంతోష్ , పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 117 దరఖాస్తులు : జిల్లా కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రతీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో 117 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారులు తమ సమస్యల పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డిఓ,ఎన్ విగిరిలకు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యల పై వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశిం చారు. ఈ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ అర్జీదారుల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పెండింగ్‌లో లేకుండా వెంట వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కాని దరఖాస్తుల పై వివరంగా దరఖాస్తు దారు నికి తెలపాలని అన్నారు. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు



**వీణవంక (జనంసాక్షి):** వీణవంక ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ పాఠశాలలోని దయాస్ను కూల్చివేసిన కొండపాక సర్పంచ్ దాట్ల వీరస్వామి పై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కొండపాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సుమారు 10 లక్షల విలువగల దయాస్ను కొండపాక సర్పంచ్ దాట్ల వీరస్వామి ధ్వంసం చేశారని, దాని ద్వారా ప్రజలకు నష్టం వాటిల్లుతుందని అన్నా రు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరుంధతి – గిరిబాబు, మాజీ ఉప సర్పంచ్ రామ గుండం రాజ్ కుమార్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు నూరి భూమయ్య, నాయకులు నల్లగాశ శ్రీనివాస్, పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ , పీజీ కళాశాలలో అట్టహాసంగా "యుగాంత " ఫేర్వెల్ పార్టీ



**కరీంనగర్ బ్యూరో, (జనంసాక్షి) :** అల్ఫోర్స్ మహిళా డిగ్రీ , పీజీ కళాశాలలో 2023–26బ్యాచ్ విద్యార్థినుల కోసం నిర్వహించిన ఫేర్వెల్ కార్యక్రమం "యుగాంత" ని స్థానిక రాజశ్రీ కన్వెన్షన్ లో చాలా అట్టహాసంగా నిర్వహించారు. ఈ వీడ్కోలు సంబరాలకు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, యూనివర్సిటీ పీజీ కళాశాల, గోదావరిఖని ప్రిన్సిపాల్ డా.ఇ.మనో హర్ ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... "నైపుణ్యాలు లేకుండా జీవితం కొనసాగించడం కష్టమే" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి డా.ఇ. మనోహర్ విద్యార్థుల కు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, తల్లిదండ్రుల కలలను నెరవేర్చే బాధ్యతపై విలువైన సందేశాన్ని అందించారు. కార్యక్రమం ఆద్యంతం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని, లక్ష్యసాధనపై స్పష్టతను పెంపొందించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డా.ఇ. మనోహర్‌తో పాటు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందంతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 30 (జనంసాక్షి):** విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాలోని 13 కేజీబీవీలు, ఏడు టీజీఎంఎస్ హాస్టళ్లకు కలిపి 20 ఫ్రీజర్లు కలెక్టర్ ప్రత్యేక చొరవతో సమకూర్చారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆయా విద్యాలయాల బాధ్యులకు కలెక్టర్ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తుందని వివరించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని విద్యాలయాల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు, సేవలు అందిస్తుం దని తెలిపారు.



జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు గత చలికాలంలో విద్యార్థులకు వేడి నీళ్లు అందించేందుకు ఇప్పటికే గీజర్లు అందించామని గుర్తు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించేందుకు ఫ్రీజర్లు సోమవార ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్ల బాధ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ ఫ్రీజర్ల ద్వారా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు , కూరగాయలు పాడైపోకుండా నిల్వ చేసుకోవచ్చనీ, పాలు, ఆకు కూరలు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు స్వచ్ఛంగా అందించే అవకాశం ఉందని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో శుభ్రమైన ఆహారం పదార్థాలు అందించడం, వ్యర్థాల నిర్వహణ, వసతి గృహాలలో మెరుగైన జీవన వాతావరణం కల్పించడానికి ఇన్సినరేటర్, వంటపాత్రలు కూడా గతంలో అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీవో పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్, కేర్ టేకర్స్ పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి బాగోతం

- గ్రామస్తుల నుండి వేలకు వేలు దండుకున్న వైనం
- ఇంటి పర్మిషన్లు, రిజిస్ట్రేషన్లు, పింఛన్లు మంజూరుకు వసూళ్ల దందా



**శంకరపట్నం, (జనంసాక్షి):** కొత్త ఇంటి నిర్మాణానికి పర్మిషన్లు, రెండవ విడతలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, కొత్త పింఛన్ల మంజూరుకు లబ్ధిదారుల వద్ద నుండి వేల రూపాయలు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శి బాగోతం బట్టబయలైంది. వివరాల్లోకి వెళితే కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఎండి మహబూబ్ పాషా గత కొన్ని నెలలుగా ఈ వసూళ్ల దందాకు పాల్పడినట్లు గ్రామస్తులు ఆరోపిం చారు. కార్యదర్శికి వేలకు వేలు రూపాయలు ముట్టజెప్పినా పనులు జరగకపోవడంతో విసిగి పోయిన గ్రామస్తులు అతడిని నిలదీయగా కార్యదర్శి ముఖం చాటేసినట్లు తెలిపారు. ఈ విషయమై బాధితులు పై అధికారులకు ఫిర్యాదు చేయగా సోమవారం మండల పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గ్రామ సర్పంచ్ కొంకటి రవి సమక్షంలో ఎంపీఓ ప్రభాకర్ విచారణ నిర్వహించగా బాధితులు ఒక్కొక్కరుగా తమ వద్ద నుండి తీసుకున్న డబ్బుల వివరాలను వెల్లడించారు. ఇదే గ్రామానికి చెందిన మాతంగి లింగయ్య తన కొడుకుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం రూ.40వేలు, కుర్ర మల్లయ్య వృద్ధాప్య పింఛన్ కోసం రూ.10 వేలు, ఆసరి వినోద్ ఇందిరమ్మ ఇంటి కోసం రూ.60 వేలు, గొర్ల సతీష్ ఇంటి పర్మిషన్ కోసం రూ.25 వేలు, నేదురి సతీష్ ఇంటి పర్మిషన్ కోసం రూ.25వేలు, మాతంగి సమ్మయ్య ఇందిరమ్మ ఇంటి మంజూరుకు రూ.25 వేలు, నేదురిసతీష్ ఇంటి నిర్మాణం కోసం రూ.10 వేలు, గ్రామపంచాయతీలో ఉద్యోగం ఇప్పిస్తానని మాతంగి ప్రభాకర్ వద్ద నుండి రూ.30వేలు, రెడ్డి రాజయ్య ఆసరా పింఛన్ కోసం రూ.5 వేలు తీసుకున్నట్లు బాధితులు విచారణలో వెల్లడించారు. గ్రామంలో ఇలా చాలామంది వద్ద నుండి వేల రూపాయలు వసూలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీఓ ప్రభాకర్ గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఇంటి పర్మిషన్లు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూ రుకు ఎవరికీ ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రజలు మీసేవ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దళారులకు లేదా మధ్యవర్తులకు ఎవరికి డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించాలి

- లేకుంటే ప్రజాభవన్ ముట్టడిస్తాం
- టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి



**గోదావరిఖని, (జనంసాక్షి) :** సింగరేణిలో మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలని, పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సింగరేణిలో అవినీతిని అరికట్టాలని నిరసిస్తూ సోమవారం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆర్జీ వన్ ఏరియా జయం ఆఫీస్ ముందు జరిగిన ధర్నా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ధర్నా కార్యక్రమంలో మిర్యాల రాజిరెడ్డి హాజరై మాట్లాడారు. గతంలో గోల్డెన్ హ్యాండ్ షేక్ పేరు మీద 20 వేల మందిని డిస్మిస్ పేరిట పదివేల మందిని తొలగించిన నాటి ప్రభుత్వాలు. ప్రస్తుతం అదే పోకడ కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతుందని కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన ఉద్యోగులను భయ భ్రాంతులకు గురి చేసే విధంగా ఉద్యోగుల పైన ఏసీబీ విజిలెన్స్ దాడులు చేస్తామని బెదిరింపులకు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు గురి చేయడం దారుణమని ఈ పద్ధతి వెంటనే మానుకోవాలని తెలిపారు. అవినీతి విచారణ చేయాల్సింది ఉద్యోగుల పైన కాదని బొగ్గు గనుల కోసం తాపత్రయపడే మంత్రుల పైన ఏసీబీ విజిలెన్స్ విచారణ చేయాలని ఆయన పేర్కొన్నారు. అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులను మెడికల్ బోర్డుకు పిలవకుండా మెడికల్ బోర్డు నిలిపి వేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం , అధికారులు కలిసి చేస్తున్నారని వారు పేర్కొన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మార్పు వస్తుంది నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని కార్మికులను మభ్యపెట్టి కార్మికుల నెత్తిపై భస్మా హస్తం పెట్టారని ఇప్పటికైనా కార్మికులందరూ అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. 2000 మంది కార్మికుల సింగరేణి వ్యాప్తంగా అనారోగ్యంతో గత 10 నెలల సర్వీస్ ఉన్న వారు గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు కొరకు వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. రెగ్యులర్ మెడికల్ బోర్డు లేక అనేకమంది కార్మికులు దీర్ఘకాలిక రోగాలతో అవస్థలు పడుతున్నారని . ఏసిబి విజిలెన్స్ పేరిట కాలయాపన చేస్తున్నారని సింగరేణి కార్మిక వర్గమంతా ఆలోచించాలని పేర్కొన్నారు. సంస్థలో జరుగుతున్న అవినీతి అక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుంభకోణాల పైన సంస్థ నిధుల దుర్వినియోగం పైన సింగరేణి కార్మిక వర్గమంతా మేల్కొనాలని పోరాటాలకు సిద్ధం కావాలని, సంస్థను పరిరక్షించుకోవాలని, అందుకు తగిన పోరాటాలతో పాటు సింగరేణి భవన్ ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి కార్మికులందరూ కూడా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆర్ జీవన్ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య, కోశాదికారి చెల్పూరి సతీష్, జావిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, చల్లా రవీందర్ రెడ్డి, మొదుంపల్లి రాజేషం, చిలకలపల్లి శ్రీనివాస్, దూట శేషగిరి, కొండ్రా, ఉప్పులేటి తిరుపతి , జనగామ మల్లేష్, పులిపాక శంకర్ , అడ్డగట్ల గోపి , రహమాన్, పుప్పాల రవీందర్, మురళీకృష్ణ, పర్లపల్లి అభిషేక్ , అంబటి శ్రీనివాస్ ,వంశీ నాగరాజు ,పిడుగు సతీష్, రాజ్ కుమార్, వెంకట్ రెడ్డి, కరట రాములు ,మల్లారెడ్డి, రామచందర్, అను రాజ్, నుతి రాజ్ కుమార్, చంద్రు శ్రీనివాస్, ఆరిఫ్, దండే యశ్వంత్, భాస్కర్, అక్షిత్, పోషం , రాజలింగు, రవి, కుమార్ స్వామి, బుఖ్య రాజ్ కుమార్, రామ్మూర్తి, కుమార స్వామి, సార్ల పోషం, తిరుపతి, అధిక సంఖ్యలో టీబీజీకేస్ శ్రేణులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు విద్యార్థులకు క్రమశిక్షణను అలవరస్తున్నాం

- ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ ఛైర్మన్ గోనెలహరి రఘు
- ఆల్ఫోర్స్ స్కూల్ డే వేడుకలో విద్యాసంస్థల ఛైర్మన్ వి.నరేందర్ రెడ్డి



**ఆర్మూర్,(జనంసాక్షి):** ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు చక్కటి ప్రణాళికలతో, పకడ్బందీగా మెలకువలను, చదువుతో పాటు క్రమశిక్షణను విద్యార్థులకు అందిస్తుందని విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల అల్ఫోర్స్ లిటిల్ నేషనల్ స్కూల్‌లో స్కూల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్మన్ గోనే లహరి రఘు హాజరైనారు. వేడుకను పురస్కరించుకుని విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, చిన్నారుల ఆటపాటలు తల్లి దండ్రులను, చూపరులను అలరించాయి. చదువులో ఉత్తీర్ణులై ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. వారు మాట్లాడుతూ ఆల్ఫోర్స్ లో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుంటున్నారని నరేందర్ రెడ్డి అన్నారు. పదవ తరగతి,ఇంటర్,జేఈఈ మెయిన్స్ ఎలాంటి పరీక్షలైనా వంద శాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నారని చెప్పారు. పాఠశాల విద్యార్థులు మూడేళ్లలో ఆల్ఫోర్స్ కరుకులంతో కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకుని అనర్గళంగా ఇంగ్లీష్ పై పట్టు సాధించారన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ ఛైర్మన్ గోనె లహరి రఘు మాట్లాడుతూ పిల్లలను ఒత్తిడికి గురి చేయకుండా చదువులో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు ఏ రంగంలో నిష్ణాతులైతే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఆ విధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల కృషిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆజాద్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరసింహారెడ్డి,వైస్ ప్రిన్సిపల్ నిహారిక, టీచర్లు, విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణి ఫిర్యాదులు 225
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, (జనంసాక్షి) :** ప్రజావాణి అర్జీల పై విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పై నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ... జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తారని, ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 225 ఫిర్యాదులు వినతులు వచ్చాయి. సంబంధిత అధికారులు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల వద్దకే స్వయంగా జిల్లా కలెక్టర్ వెళ్లి వినతి పత్రాలను స్వీకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను ఆలకించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో కె.మహేశ్వర్, డిఆర్‌డిఓ శ్రీధర్, గృహ నిర్మాణ శాఖ పిడి శ్రీనివాసు, పలు అధికారులు పాల్గొన్నారు.

# మార్జిన్ పెంచకపోతే చికెన్ సెంటర్లు బంద్ చేస్తాం

- శ్రమ మాది, లాభం పౌల్ట్రీ కంపెనీలదా, కంపెనీల వ్యవహారంతో తీవ్రంగా నష్టపోతున్నాం
- చికెన్ సెంటర్స్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు తీగల సుభాష్




**నాగర్ కర్నూల్, మార్చి 30 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ పౌల్ట్రీ కంపెనీలు చికెన్ సెంటర్ యాజమాన్యాలకు మార్జిన్ పెంచని ఎడల ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి సామూహికంగా బంద్ నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ తాలూకా చికెన్ సెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల సుభాష్, ఉపాధ్యక్షులు సుల్తాన్, కార్యదర్శి మహమ్మద్ జహంగీర్, దివాకర్ రెడ్డి తదితరులు విలేకరుల సమావేశంలో తెలిపారు. పౌల్ట్రీ కంపెనీలు చికెన్ సెంటర్ నిర్వాహకులకు తక్కువ మార్జిన్ అందిస్తూ ఉండడం వల్ల తమకు గిట్టుబాటు కాక వర్కర్స్ జీతాలు దుకాణాల కిరాయిలు విద్యుత్ బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. చికెన్ సెంటర్ యాజమాన్యం సమక్షంలో సమావేశం నిర్వహించి ఏప్రిల్ 1వ తేదీ నుంచి సామూహికంగా బందు పాటించాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చికెన్ సెంటర్ నిర్వాహకుల యాజమాన్యుల ఆధ్వర్యంలో యూనియన్ తీసుకున్న నిర్ణయం మేరకు నాగర్కర్నూల్ తాలూకాలో కూడా పూర్తిస్థాయిలో బంద్ పాటించాలని ఇందుకోసం ప్రతి చికెన్ సెంటర్ నిర్వాహకుడు సహకరించాలని కోరారు. పౌల్ట్రీ కంపెనీల ఆధిపత్యంతో తీవ్రంగా నలిగిపోతున్నది చికెన్ సెంటర్ నిర్వాహకులే అన్నారు. తాము ఉపాధి పొందుతూ నలుగురికి పని కల్పించి ఉపాధి కల్పించే చికెన్ సెంటర్ నిర్వహణ భారంగా మారి అప్పులపాలు అవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పౌల్ట్రీ యాజమాన్యాలకు ప్రభుత్వాల ద్వారా నియంత్రణ లేకపోవడం వల్ల వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందని, ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటూ తమకు మాత్రం తక్కువ మార్జిన్ చెల్లిస్తూ ఉండడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వారు పేర్కొన్నారు. పౌల్ట్రీ కంపెనీల యాజమాన్యం తమ డిమాండ్కు అనుగుణంగా మార్జిన్ పెంచని ఎడల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని పౌల్ట్రీ యాజమాన్యాల సారథ్యంలోని చికెన్ దుకాణాలను సైతం బందు చేయిస్తామని వారు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పౌల్ట్రీ యాజమా న్యాలపై నియంత్రణ ఉండే విధంగా చట్టాన్ని తీసుకురావడంతో పాటు వారి వద్ద కోళ్లను కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్న చికెన్ సెంటర్ల నిర్వాహకులకు మెరుగైన ఉపాధి కోసం ఆలోచన చేయాలని వారు ఈ మేరకు డిమాండ్ చేశారు. పౌల్ట్రీ యాజమాన్యం చికెన్ సెంటర్ నిర్వాహకులకు మెరుగైన మార్జిన్ అందించే విధంగా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని అలా జరగని పక్షంలో ఒకటవ తేదీ నుంచి దుకాణాలు మూసి నిరసన తెలుపుతామని వారు పేర్కొన్నారు.

# ప్రజావాణి వినతులను త్వరితగతిన పరిష్కరించండి

### సిఎంసి కమిషనర్ సృజన



**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** ప్రజలు తమ విలువైన సమయాన్ని వెచ్చిస్తూ ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి వినతులు సమర్పిస్తుంటారని, అలాంటి వాటిని సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించాల్సిన బాధ్యతను సైబర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి సృజన గుర్తు చేశారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో సైబరాబాద్ కార్పొరేషన్ పరిధి నుండి అర్జీదారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతూ ఆయా సమస్యలపై వినతులను సమర్పిస్తుంటారని, అంతే బాధ్యతతో సంబంధిత అధికారులు వాటి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సిఎంసి ప్రధాన కార్యాలయం అయిన న్యాక్ భవనంలో సోమవారం ఆయా విభాగాల అధికారులతోకలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని సమీక్షించారు. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల నుండి వివిధ అవసరాల నిమిత్తం ఫిర్యాదు చేయడానికి వచ్చిన అర్జీదారులతో ఆమె మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ఫిర్యాదులలో ప్రధానంగా 39 వినతి పత్రాల స్వీకరించడం జరిగిందని, అందులో ప్రధానంగా పారిశుద్ధ్యం, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, వీధి దీపాలు, పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజనీరింగ్ విభాగం పౌర సమస్యలకు సంబం ధించిన అర్జీలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం లభించేలా, పరిష్కరించదగిన కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి ప్రాముఖ్యతను ఇస్తున్నామని, బాధితుల విన్నపాలపై ప్రత్యేక దృష్టిని సారించి వీలైనంత త్వరగా వాటి పరిష్కా రానికి కృషి చేయడమే సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ లక్ష్యమని కమిషనర్ సృజన తెలియజేశారు.

**మియాపూర్ సర్కిల్ పరిధిలో..**

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సర్కిల్ పరిధి వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుండి పలు వినతులను స్వీకరించగా పట్టణ ప్రణాళిక విభాగం నుండి 06, రెవెన్యూ విభాగం నుండి 0, హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం నుండి 0, యుసిడి విభాగం నుండి 01, ఇంజనీరింగ్ విభాగం నుండి 01 కలిపి మొత్తం 07 ఉన్నాయని అధికారులు తెలిపారు. డిసి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి





### డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

**గద్వాల టౌన్ మార్చి 30 (జనంసాక్షి):** గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వైయస్సార్ చౌక్ దగ్గర సోమవారం నిర్వహించిన పోరు దీక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురవ పల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగులు మరియు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు అని విమర్శించారు. ఒక సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, ఆ హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.10,000 కోట్లకు పైగా ఉండగా, బడ్జెట్‌లో కేవలం రూ.4,000 కోట్లు మాత్రమే కేటాయించడం ద్వారా విద్యార్థులు మరియు కళాశాల యాజమాన్యాలను మోసం చేస్తున్నారని అన్నారు. అలాగే జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పిన హామీలను కూడా అమలు చేయలేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన తీర్పు ఇవ్వాలని, హామీలు అమలు అయ్యే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బి.ఎస్. కేశవ్, మాజీ జడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

# పెద్దల సభలోనూ బీఆర్ఎస్ నిరసన

### శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

- రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన
- శాసనమండలిలో సభ్యుల సస్పెన్షన్ తొలిసారి



**హైదరాబాద్, (జనంసాక్షి) :** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఒక్క రోజు సమావేశాలకు హాజరుకాకుండా బహిష్కరిస్తున్నట్లుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అవినీతి, అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వారిని సస్పెండ్ చేసింది. అసెంబ్లీ సెషన్ ముగిసేవరకూ సమావే శాలకు హాజరుకాకుండా బహిష్కరించింది. దీంతో పొంగులేటి కంపెనీ అవినీతిపై మండలిలో బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. పొంగులే టిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అవినీతిపై సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా మండలి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇలా మండలి సభ్యులపై సస్పెన్షన్ వేటు పడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, సస్పెన్షన్‌కు నిరసగా బీఆర్ఎస్ మండలి సభ్యు లు చైర్మన్ పోడియం వద్ద నిరసన తెలిపారు. ఈ క్రమంలో మండలి సభ్యులను మార్షల్స్ బల వంతంగా లాక్కెళ్లారు. అక్రమ మైనింగ్ అంశంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాని.. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. ఛైర్మన్ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ అంశంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు శాసనసభలో సీఎం రేవంత్ స్పష్టం చేశారని చెప్పారు. సభ సజావుగా సాగేందుకు బీఆర్ఎస్ సభ్యులు సహకరించాలని కోరారు. మరోవైపు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా సభా కార్యక్రమాల నిర్వహణకు

# నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

### డా. ప్రేమ్ కుమార్



**గద్వాల టౌన్ (జనంసాక్షి):** గద్వాల పట్టణంలోని పిల్లిగుండ్ల కాలనీలో పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌదర్పల్లి ఏడవ వర్డ్ పరిధిలోని పిల్లిగుండ్ల కాలనీలో అనేక కుటుంబాలు అత్యంత పేదరికంలో జీవిస్తూ, సొంత ఇళ్ల స్థలాలు లేక చిన్న గుడిసెల్లో కష్టాలు పడుతున్నారని తెలిపారు. అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఆ ప్రాంతంలో చాలామందికి స్థిరమైన జీవనోపాధి కూడా లేకపోవడంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అర్హులైన వారిని గుర్తించికి నివాస సదుపాయం కల్పించడం తో పాటు జీవనోపాధి అవకాశాలు కూడా అందించాలని కలెక్టర్‌ను కోరారు.

# రంగారెడ్డి జిల్లాలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ దరఖాస్తులు ప్రారంభం

**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** అర్హులైన ఎస్సీ నిరుద్యోగ యువత, రైతులు ఎస్సీ యాక్షన్ ప్లాన్ ను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాక సంచాలకులు కోరారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన సవరించిన ఎస్సీ యాక్షన్ ప్లాన్‌ను ప్రభుత్వం ఈ నెల 28న విడుదల చేసింది. ఇందులో ఎలక్ట్రిక్ టూ వీలర్స్, త్రీ వీలర్స్, సోలార్ పంపులు, రెండు పాడి పశువుల పథకాలు ఉన్నాయి. అర్హులైన ఎస్సీ నిరుద్యోగ యువత, రైతులు ఏప్రిల్ 8వ తేదీ వరకు తెలంగాణ ఓబిఎంఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను మండల, మున్సిపల్ స్థాయి కమిటీలు పరిశీలించి జిల్లా స్థాయికి పంపిస్తారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

# కాళేశ్వరం మీద లక్ష కోట్లు ప్రజాధనం వృథా





- ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే ఈ దుస్థితి
- రాజ్యసభలో కేంద్రమంత్రి పాటిల్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, (జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ సోమవారం రాజ్యసభలో సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ.లక్షల కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలంటూ రాజ్యసభలో కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ పైవిధంగా స్పందించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటుపై ఎన్డీఎస్ఏ నివేదికను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని కేంద్ర మంత్రి పేర్కొ న్నారు. జల్ జీవన్ మిషన్ నిధుల వినియోగంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రమంత్రి సి.ఆర్.పాటిల్ ధ్వజమెత్తారు. రాష్ట్రం వద్ద రూ.873 కోట్లు ఉన్నా.. మూడేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.194 కోట్లేనని ఆయన గుర్తు చేశారు. మూడేళ్లుగా ఒక్క కొత్త స్కీమ్ ప్రతిపాదన కూడా తెలంగాణ ప్రభుత్వం నుంచి రాలేదని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ పెదవి విరిచారు. మరోవైపు తెలంగాణకు చెందిన రాజ్యసభ్య సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ చే విచారణ జరిపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్‌లను రెగ్యులర్ చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- ఆర్టిజన్లు చేస్తున్న పోరాటానికి సిపిఎం మద్దతు



**సంగారెడ్డి టౌన్, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లను వెంటనే రెగ్యులర్ చేయాలని సిపిఎం సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు..విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు ఈ ధర్నాకు సిపిఎం మద్దతు పలికారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ మాట్లాడుతూ.. . ఆర్టిజన్ కార్మికుల గోంతేమ్మ కోర్కెలు కావని, న్యాయమైన డిమాండ్ లు ప్రభుత్వం పరిష్కారం చేయాలనీ అన్నారు. ట్రాన్స్కో, జెన్కో, డిస్కంలలో దాదాపు 20 వేల మంది ఆర్టిజన్స్ ఏడేళ్లుగా వెట్టి చాకిరీ చేస్తున్నారని విమర్శించారు. అంతకుముందు ఈ కార్మికులందరూ 20 ఏళ్లు కాంట్రాక్టు పద్ధతిలోనే విద్యుత్ సంస్థల్లో పని చేశారని గుర్తు చేశారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల విద్యార్హతల ఆధారంగా బిఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజినీర్, ఆఫీస్ సబార్డినేట్‌గా కనవర్శన్ చేయాలని అన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటం సిపిఎం సంపూర్ణ మద్దత్తు ఇస్తున్నదని అన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమం జే ఏ సి నాయకులు, సిపిఎం నాయకులు రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహన సేవలను మెదక్ ప్రజలు ఉపయోగించుకోవాలి

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- ఆసుపత్రిలో ఉండే స్క్రీనింగ్ సౌకర్యాలు ఈ వాహనంలోనే..
- క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, చికిత్స ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చు : గవర్నర్




**హైదరాబాద్, (జనంసాక్షి):** క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహన సేవలను మెదక్ ప్రజలు ఉపయోగించుకోవాలనీ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కోరారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) వారి సీఎస్ఆర్ నిధుల సహకారంతో ఏర్పాటు చేసిన ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సోమవారం లోక్ భవన్ లో జెండా ఊపి ప్రారంభించారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు విజ్ఞప్తి మేరకు బీడీఎల్ కంపెనీ మెదక్ ప్రజలకు క్యాన్సర్ తొలి దశలోనే తెలుసుకునేందుకు స్క్రీనింగ్ పూర్తి మెషినరీతో ఉన్న వాహనాన్ని సీఎస్ఆర్ కింద సమకూర్చింది. మొబైల్ స్క్రీనింగ్ వాహనంలో క్యాన్సర్ ప్రిలిమినరీ స్క్రీనింగ్ కోసం ఉద్దేశించిన సౌకర్యాలను ఎంపీ రఘునందన్ రావు గవర్నర్ కు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనం ఉపయోగపడు తుందన్నారు. ఆసుపత్రిలో ఉండే స్క్రీనింగ్ సౌకర్యాలు ఈ వాహనంలో ఉన్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే, చికిత్స ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చునని గవర్నర్ తెలిపారు. మెదక్ ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని గవర్నర్ కోరారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహనం కోసం కృషి చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, వాహనాన్ని సమకూర్చిన బీడీఎల్ ప్రతినిధులను గవర్నర్ అభినందించారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రతీ జిల్లా కేంద్రంలో ఒక క్యాన్సర్ ఆసుపత్రి ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆశయంలో ఈ వాహనం ముందే చేరడం సంతోషంగా ఉందన్నారు.

# సీఏపీఎఫ్ బలగాలు దేశ అంతర్గత భద్రతకు వెన్నెముక

- రాజ్యసభలో సీఏపీఎఫ్ బిల్లు-2026పై ఎంపీ వద్దిరాజు ప్రసంగం

**ఖమ్మం టౌన్ (జనంసాక్షి):** కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్) దేశ అంతర్గత భద్రతకు వెన్నెముక వంటివని సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ తదిరత బలగాలు దేశ సరిహద్దులను కాపాడటం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోనడం, చట్టవ్యవస్థను పరిరక్షించడం వంటి కీలక బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తున్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. "కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సాధారణ పరిపాలన బిల్లు -2026పై" రాజ్యసభలో సోమవారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. అయితే, ఈ బలగాల పరిపాలనా వ్యవస్థ ఇప్పటివరకు విభిన్నంగా, సంక్లిష్టంగా, కొంతమేర పాత పద్ధతుల్లో కొనసాగుతున్నదని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు. ఆ బలగాలకు వేర్వేరు నియమాలు, నిబంధనలు ఉండటం వల్ల అయోమయం, ఆలస్యం, పనితీరు లోపాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తీసుకువచ్చిన బిల్లు చాలా ముఖ్యమైనది, కీలకమైనది ఎంపీ రవిచంద్ర చెప్పారు. నియామకాలు, సేవా నిబంధనలు, బదిలీలు, పదోన్నతులు, క్రమశిక్షణ వంటి విషయాలలో ఒకే విధమైన వ్యవస్థను తీసుకు వచ్చేందుకు ఈ బిల్లు ద్వారా వీలవుతుందని ఎంపీ వద్దిరాజు వివరించారు. బలగాలన్నింటిలో ఒకే విధమైన నియమాలు ఉండటం వల్ల సమన్వయం మరింత మెరుగుపడుతుందని ఆయన చెప్పారు. సిబ్బంది నిర్వహణలో స్పష్టత రావడమే కాక జవాన్లలో మరింత ఉత్సాహం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. నిర్ణయాల ప్రక్రియ వేగవంతం అవుతుందని, పారదర్శకత, బాధ్యత మరింత బలపడుతుందని ఎంపీ రవిచంద్ర అన్నారు. అయితే, ఈ బిల్లును అమలు చేసే సమయంలో కొన్ని ముఖ్యమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా జవాన్ల సంక్షేమం, మానసిక ఆరోగ్యం, కుటుంబ సహా యం, పని-జీవిత సమతౌల్యం, సరైన సెలవుల విధానం, ఆధునిక శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. అలాగే, ఫిర్యాదులు స్వీకరించడం, వాటిని సకాలంలో పరిష్కారించే వ్యవస్థ బలంగా ఉండాలని, రాష్ట్రాలతో సమన్వయం ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఎంపీ వద్దిరాజు సూచించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర అనుభవాన్ని ఉదాహరణగా చూపిస్తూ, తమ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో భద్రతా వ్యవస్థను ఆధునీకరించడానికి తీసుకున్న చర్యలను వివరించారు. అవసరమైన ఆధునిక వాహనాలు, ఆయుధాలు సమకూర్చడమే కాక సర్వైలెన్స్, ఇంటెలిజెన్స్ వ్యవస్థల ద్వారా నక్సలిజం వంటి సమస్యలను సమర్థవంతంగా నియంత్రించగలిగినట్లుఎంపీ రవిచంద్ర చెప్పారు. ఈ బిల్లు సరైన మార్పులతో అమలు చేసినట్టయితే దేశ భద్రతను మరింత బలపరు స్తుందని, జవాన్ల మనోబలాన్ని పెంచుతుందని ఆయన అన్నారు. "దేశాన్ని కాపాడేకి మనం కేవలం మాటలతో కాకుండా, సమర్థవంతమైన విధానాలతో మద్దతు ఇవ్వాలి"అని ఎంపీ వద్దిరాజు చెప్పారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
31 మార్చి 2026

# దేశ వికాసంలో రాజస్తాన్ ప్రజల పాత్ర ఎనలేనిది

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**హైదరాబాద్, మార్చి30 (జనంసాక్షి) :** దేశ వికాసంలో రాజస్థాన్ ప్రజల పాత్ర ఎనలేనిదని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. సోమవారం లోక్ భవన్ లో ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ లో భాగంగా రాజస్థాన్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో హైదరాబాద్ లో ఉంటున్న రాజస్థాన్ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకలకు రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణితో పాటుగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ... దేశంలో సంస్కృతి, సాంప్రదాయాల పరంగా రాజస్థాన్ కు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. భగవాన్ శ్రీ రాముడు, జన్మభూమి స్వర్గం కంటే మిన్న అని చెప్పారని.. వారి స్ఫూర్తితోనే రాజస్థాన్ ప్రజలు దేశ అభివృద్ధి, సాంస్కృతిక వికాసంకు గొప్ప సేవ చేస్తున్నారని గవర్నర్ కొనియాడారు. గవర్నర్ సందేశం అనంతరం ఏర్పాటు చేసిన రాజస్థాన్ సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శశికిరణాచారి, ఇతర లోక్ భవన్ ఉన్నతాధికారులు, రాజస్థాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

- హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే
- శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



**హైదరాబాద్, మార్చి30 (జనంసాక్షి) :** రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి అవినీతి మొత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటున్నామని పదే పదే చెబుతోందని.. కానీ ఓబులాపురం మైనింగ్ కేసులో అక్రమాలు జరిగాయని చెప్పడంతో నాగం జనార్ధన్ రెడ్డితో సభా సంఘం వేశారని గుర్తు చేశారు. అదే విధంగా పొంగులేటి అక్రమాలపై కూడా సభా సంఘం వేయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలంటూ ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. వాణి దేవి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కెలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు.

# పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందును నిషేధించాలి

## తీర్మానం ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ




**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** తెలంగాణలో పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుని నిషేధించాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. రైతులు వ్యవసాయానికి వాడుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ ప్రమాదకరంగా మారిందని.. అందుకే తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు సభ్యులకు మంత్రి వివరించారు. ఇది ప్రాణాంతక రసాయనమని.. దీన్ని అనేక దేశాల్లో నిషేధించారని తెలిపారు. పారాక్వాట్ డైక్లోరైడ్ వాడడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలతో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వాడి అనేక మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ లక్ష్యాలకు ఇది అడ్డుగా మారిందని.. దీని తయారీ, వాడకం, రవాణా, దిగుమతి ఇలా అన్ని విధాలుగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గడ్డి మందుని నిషేధించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేశారు. ఇటీవలే నడుగు రాహుల్ రామకృష్ణ సోదరుడు దీనికి బలయ్యారు.

# అమెరికాకు స్పెయిన్ షాక్

- గగనతలంలో విమానాలకు అనుమతి నిరాకరణ

**న్యూఢిల్లీ, మార్చి30 (జనంసాక్షి) :** అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు స్పెయిన్ ప్రకటించింది. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో పాలు పంచుకొనే విమానాలను అనుమతించమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ సోమవారం వెల్లడించారు. ఇరు దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించడాన్ని ఇప్పటికే స్పెయిన్ నిరాకరించింది. 'ఇరాన్ యుద్ధానికి సంబంధించిన కార్యకలాపాల కోసం మిలిటరీ స్థావరాలు లేక గగనతలాన్ని వియోగించడానికి అనుమతి ఇవ్వబోం. ఏక పక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగానే తాజా ప్రకటన వచ్చింది' అని రక్షణ, ఆర్థిక మంత్రులు స్థానిక వీడియాలో వెల్లడించారు.

# ములుగు జిల్లాలో ఈదురుగాలుల వర్షం

**ములుగు, మార్చి30 (జనంసాక్షి) :** జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఏటూరునాగారం –తాడ్వాయి మధ్య ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. భారీ ఈదురుగాలులతో రహదారుల పై చెట్లు పడిపోయాయి. దీంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. జేసీపీ సాయంతో చెట్లను తొలగించి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసారు. మరో వైపు రాష్ట్రంలోని పలు జిల్లాలకు వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. హైదరాబాద్ తో పాటు జగిత్యాల, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, ములుగు, నాగర్ కర్నూలు, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షానికి చాన్స ఉంది.

# మహిళల అక్షరాస్యత పెంపునకు సెర్ప్ ప్రత్యేక చర్యలు

**అమ్మకు అక్షరమాల కార్యక్రమానికి విశేష స్పందన**

- అక్షరానికి మించిన ఆయుధం లేదు..ఆడబిడ్డలంతా అక్షరమాల కార్యక్రమంలో చేరండి : మంత్రి సీతక్క



**హైదరాబాద్, మార్చి 30(జనంసాక్షి) :** మహిళల సాధికారతకు అక్షరాస్యతే బలమైన పునాది అనే దృక్పథంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మకు అక్షరమాల కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విశేష ఫలితాలను అందిస్తోంది. ముఖ్యంగా మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆదరణ పొందుతోంది. చదువుకోలేక వెనుకబడిన మధ్యవయసు, వృద్ధ మహిళలకు మరోసారి విద్యా అవకాశాన్ని కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. కుటుంబ బాధ్యతల వల్ల చదువు మధ్యలో ఆగిపోయిన మహిళలు తిరిగి పుస్తకాలు పట్టడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తోంది. గ్రామ స్థాయిలోనే ఎస్‌హెచ్‌జీ ఆధారంగా తరగతులు నిర్వహించడం వల్ల మహిళలు సౌకర్యవంతంగా పాల్గొనే వాతావరణం ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,01,357 మంది మహిళలు లిఅమ్మకు అక్షరమాల కార్యక్రమం లో చదువు నేర్చుకోట..ఆదివారం నిర్వహించిన అక్షరాస్యత పరీక్ష కు 6,31,656 మంది హాజరయ్యారు. అంటే 90 శాతం మంది మహిళలు పరీక్ష రాయడం ఈ కార్యక్రమంపై మహిళల్లో ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ పరీక్ష ఫలితాలు ఏప్రిల్ లేదా మే మాసంలో వచ్చే అవకాశాలున్నాయి. ఈ పరీక్షలో ఉత్తీర్ణత పొందిన వారు పదో తరగతి పరీక్షలకు హాజరు కావచ్చు.

కార్యక్రమాన్ని తెలంగాణ వయోజన విద్యాశాఖతో సమన్వయం చేస్తూ అమలు చేశారు. వాలంటీర్లు, ఫెసిలిటేటర్లకు వివిధ స్థాయిల్లో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండల స్థాయిలో కమ్యూనిటీ వాలంటీర్లు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సంస్థ ప్రతినిధులు కలిసి శిక్షణ పొందారు. దీని ద్వారా బోధనలో ఒక రకమైన ప్రమాణీకరణ, నాణ్యతను నిర్ధారించారు. ఈ కార్యక్రమం ద్వారా అక్షరాస్యులైన మహిళలకు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించడం ద్వారా వారి విద్యా ప్రస్థానానికి కొత్త దిశను ప్రభుత్వం చూపుతోంది. దీని ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడమే కాకుండా, స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదుగుతున్నారు. అక్షరాస్యతతో మహిళలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకోవడం, బ్యాంకింగ్ లావాదేవీలు స్వయంగా నిర్వహించడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం వంటి అంశాల్లో ముందుకు వస్తున్నారు. కుటుంబం, సమాజంలో వారి పాత్ర మరింత బలపడుతోంది. జాతీయ స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళల అక్షరాస్యతలో ఇంకా లింగ వ్యత్యాసం కొనసాగుతున్న నేపథ్యంలో, తెలంగాణలో అమలవుతున్న ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తోంది. మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్న "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలి" అనే ప్రభుత్వ సంకల్పానికి అక్షరాస్యత బలమైన పునాదిగా మారుతోందని, మహిళల జీవితాల్లో దీర్ఘకాలిక సానుకూల మార్పులకు దారితీస్తోందని సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ పేర్కొన్నారు.

**ఆడబిడ్డలంతా అక్షరమాల కార్యక్రమంలో చేరండి : మంత్రి సీతక్క**

ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, మహిళల సాధికారతకు అక్షరాస్యతే కీలకమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి మహిళ చదువుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. "అక్షరానికి మించిన ఆయుధం లేదు. చదువు ద్వారా మహిళలు తమ జీవితాలను స్వయంగా మార్చుకునే శక్తిని పొందుతారు" అని ఆమె పేర్కొన్నారు. స్వయం సహాయక బృందాల మహిళలు చూపుతున్న చురుకుదనం అభినందనీయమని, వారి భాగస్వామ్యం సమాజంలో పెద్ద మార్పునకు నాంది అవుతుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు కేవలం చదవడం, వ్రాయడం మాత్రమే కాకుండా ఆర్థికంగా, సామాజికంగా మరింత బలపడుతున్నారని వివరించారు. అక్షరాస్యత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మహిళలు పదో తరగతి, ఆ పైచదువులు చదివేలా ప్రభుత్వం పూర్తి స్థాయి మద్దతు అందిస్తుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఆడబిడ్డల అక్షరాస్యత కోసం పాటు పడుతున్న సెర్ప్, రూరల్ డెవలప్‌మెంట్, వయోజన విద్యా శాఖల సిబ్బందిని మంత్రి సీతక్క ప్రత్యేకంగా అభినందించారు.

# చైనా సీసీ కెమెరాల బ్యాన్

- బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం
- కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం



**న్యూఢిల్లీ, మార్చి30 (జనంసాక్షి) :** చైనీస్ సీసీటీవీ కెమెరాలను నిషేధిస్తూ భారత్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ భద్రత దృష్ట్యా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'మేడ్ ఇన్ చైనా' కెమెరాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించబోతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం భారత మార్కెట్లో హెక్ విషన్ , దాహువా, టీపీ-లింక్ వంటి చైనా కంపెనీల హవా నడుస్తోంది. అయితే.. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త సర్టిఫికేషన్ నిబంధనల ప్రకారం.. ఇంటర్నెట్‌తో అనుసంధాన మయ్యే ఈ చైనా కంపెనీల నిఘా పరికరాల అమ్మకాలను భారత్‌లో నిలిపి వేయనున్నారు. ముఖ్యంగా స్టాండర్డ్ అల్లైజేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్' అనుమతి ఉన్న కెమెరాలను మాత్రమే ఇకపై దేశంలో విక్రయించాల్సి ఉంటుంది. నిఘా పరికరాలు అత్యంత సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తాయి. విమానాశ్రయాలు, ప్రభుత్వ భవనాలు, రవాణా కేంద్రాలు వంటి కీలక ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో చైనా కెమెరాల ద్వారా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కెమెరాల్లో రహస్యంగా 'బ్యాక్ డోర్' యాక్సెస్ ఉండే అవకాశం ఉందని, దీని ద్వారా సేకరించిన సమాచారం విదేశీ సర్వర్లకు చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్షణ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చైనా కెమెరాలను వాడటం వల్ల మన వ్యూహాత్మక సమాచారం బయటకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సర్వైలెన్స్ మార్కెట్‌లలో ఒకటి. తాజా నిర్ణయం వల్ల చైనా కంపెనీలకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉండగా.. భారతీయ తయారీదారులకు ఇది పెద్ద అవకాశంగా మారనుంది. తద్వారా 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ పెరగనుంది. మొత్తానికి.. డేటా భద్రతే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం టెక్నాలజీ , రక్షణ రంగాల్లో పెను మార్పులకు దారితీయనుంది.

# నగరంలో మరోమారు డ్రగ్స్ కలకలం

- మోకిలాలో రైల్వే ఉద్యోగి అరెస్ట్

**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. మోకిలలో డ్రగ్స్ విక్రయిస్తున్న డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి రైల్వేశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి.. బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా రైల్వే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో గూగుల్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో పాటూ మరో వ్యాపారవేత్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# చిత్తశుద్ధి ఉంటే ఓవైసీపై చర్య తీసుకోండి

- బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్



**న్యూఢిల్లీ, మార్చి30 (జనంసాక్షి) :** హేట్ స్పీచ్ బిల్లుపై చిత్తశుద్ధి ఉంటే, మొదట తెలంగాణ ప్రభుత్వం.. అక్బరుద్దీన్ ఓవైసీపై చర్యలు తీసుకోవాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రాజ్యసభలో ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావనకు తీసుకువస్తే కాంగ్రెస్ సహా విపక్షాలు అడ్డుకున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్, అన్ని విపక్షాలు ఏకమై తన గొంతు నొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఓబీసీల్లో ముస్లింలను మూకుమ్మడిగా చేరుస్తున్నారని.. ఓబీసీలు వెనకపడటానికి కారణమవుతున్నారని ఆరోపించారు. ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ అన్నారు. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో సహా అందరూ అడ్డుకున్నారని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సమాజాన్ని కులంగా గుర్తించి ఓబీసీ జాబితాలో చేర్చిందని... 4 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్లు ఎంపీ చెప్పారు. బెంగాల్, తమిళనాడు, కేరళ, తెలంగాణలోనూ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. పోటీపడి ఒక వర్గం ఓట్ల కోసం కక్కుర్తి పడుతున్నారని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల స్థానాల్లో ముస్లింలే పోటీ చేశారన్నారు.

# సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

- అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్



**హైదరాబాద్, మార్చి30 (జనంసాక్షి) :** సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాళ్టి(మార్చి 30)తో సన్నబియ్యం పంపిణీ పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్ లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి లంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్..సన్నబియ్యం ఆలోచన రేవంత్ రెడ్డిదేనన్నారు. రూ. 14560 కోట్లు సన్నబియ్యం కోసం ఖర్చుచేశామని చెప్పారు. ఇపుడు పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. 86 శాతం మంది జనాలకు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఫుడ్ సెక్యూరిటీ చట్టానికి తెలంగాణలో న్యాయం చేస్తామన్నారు. ఎంత ఖర్చైనా సన్నబియ్యం పథకం కొనసాగిస్తామని తెలిపారు. రైతుల ఖాతాలో ఇప్పటి వరకు రూ. 40 వేల కోట్లు వేశామన్నారు ఉత్తమ్. ధాన్యం డబ్బులు 48 గంటల్లో రైతులకువేస్తున్నామని తెలిపారు. అడిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు.

# ఉద్యమకారులు లేకుంటే మనమంతా లేనట్లే

- సిఎం, మంత్రులు కూడా ఉండేవారా?
- వారికిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి
- మండలిలో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విజ్ఞప్తి చేశారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ విజయ శాంతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిపోయినా.. ఇంకా ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు సైతం అమలు కాలేదన్నారు. ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి గుర్తుచేశారు. ఆయా కుటుంబాలకు నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ సైతం ఇచ్చామని ప్రభుత్వానికి వివరించారు. ఉద్యమకారులకు మనం తొలి ప్రాధాన్యం ఇస్తామని భరోసా కూడా ఇచ్చామని ఎమ్మెల్సీ విజయశాంతి తెలిపారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఉద్యమకారులు తమను ప్రశ్నిస్తున్నారని శాసనమండలి వేదికగా ఎమ్మెల్సీ విజయశాంతి వివరించారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తి వేసి జూన్ 2వ తేదీ నాటికి వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చామని.. అది కూడా ఇంకా నెరవేరలేదని విజయశాంతి చెప్పారు.

# జీతాల కోసం ఆశావర్కర్ల ధర్నా

- జాతీయరహదారిపై బైఠాయింపు
- ఎక్కడిక్కడే నిలిచి పోయిన వాహనాలు



**మహబూబ్‌నగర్, మార్చి 30 (జనంసాక్షి) :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆశావర్కర్లు జడ్చర్ల సమీపంలోని కావరమ్మపేట జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వందలాది మంది మహిళలు రోడ్డుపై బైఠాయించారు. ధర్నా వల్ల హైదరాబాద్ ,కర్నూలు జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా ఎక్కడికక్కడే నిలిచి పోయాయి . జీతాలు ఇవ్వాలని, సీఎం డౌన్ డౌన్ అంటూ ఆశా వర్కర్లు నినాదాలు చేశారు. జీతాలు లేక కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని, పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆశా వర్కర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించడం లేదని, వెట్టి చాకిరీ చేయించుకుంటూ వేతనాలు నిలిపివేయడం దారుణమని అన్నారు. ధర్నాను విరమించాలని పోలీసులు బలగాలు కోరగా ససేమిరా అనడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆశావర్కర్లను అక్కడి నుంచి తొలగించేందుకు నానా అవస్థలు పడ్డారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. అధికారులు రాతపూర్వక హామీ ఇచ్చే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370